
'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 15 సంచిక: 339

బుధవారం 1-3-2023


విద్యుత్ కాంతుల్లో యాదాద్రి ఆలయం.. స్వామివారి కల్యాణోత్సవానికి హాజరైన భక్తజనం 3లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



2047 నాటికి 'అభివృద్ధి' భారత్

భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చుకోవాలన్న లక్ష్య సాధనకు ఆధునిక సాంకేతికత దోహదపడుతుందని ప్రధాని అన్నారు.

- వివరాలు 6లో▶



మెస్సీనే మేటి...

36 ఏళ్ల తర్వాత అర్జెంటీనా జట్టును ప్రపంచ చాంపియన్‌గా నిలబెట్టిన మెస్సీ ప్రపంచ ఉత్తమ ఫుట్‌బాలర్‌గా ఎంపికయ్యాడు.

- వివరాలు 12లో▶



పులులకు 'ఎండదెబ్బ'

ఎండాకాలం పులులకు శాపంగా మారుతోంది. ఈ ఏడాది రెండు నెలల్లోనే 34 పులులు మరణించడం కలవరానికి గురిచేస్తోంది.

- వివరాలు 6లో▶



విస్తరిస్తున్న ఖలిస్తానీ ఉద్యమం

'ఆపరేషన్ బ్లూస్టార్'తో అంతరించిపోయిన ఖలిస్తానీ ఉద్యమం తాజాగా అమృత్‌పాల్‌సింగ్ నేతృత్వంలో తిరిగి ప్రాణం పోసుకుంటోంది.

- వివరాలు 6లో▶

పది నెలలూ ప్రజల్లోనే

ఎన్నికల రణానికి సిద్ధంకండి • రాష్ట్ర బీజేపీ నేతలకు నడ్డా, అమిత్‌షా దిశానిర్దేశం

- కేసీఆర్ సర్కార్ పోవాలి.. కాషాయ జెండా ఎగరాలి
- స్పష్టమైన వ్యూహాలు, కార్యాచరణతో ముందుకు సాగాలి
- రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలి.. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రచారం చేయాలి
- కుటుంబ పాలనకు చరమగీతం పాడే సత్తా బీజేపీకే ఉందనే సంకేతాలు వెళ్లాలి.. మార్చి నుంచి సెప్టెంబర్ వరకు నిత్యం ప్రజల్లో ఉండేలా సభలు, ర్యాలీలు, చేరికలు
- ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో ప్రధాని మెగా బహిరంగ సభ
- ఢిల్లీలో 4 గంటల పాటు కొనసాగిన సమావేశాలు


మంగళవారం ఢిల్లీలో జేపీ నడ్డా, అమిత్ షాలతో సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న తరుణ్ చుగ్, జితేందర్‌రెడ్డి, ఈటల, బండి సంజయ్ తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ /సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని స్థాయిల బీజేపీ నాయకులు సమన్వయంతో, సమష్టిగా వ్యవహరిస్తూ ఎన్నికల కురుక్షేత్రానికి సిద్ధం కావాలని ఆ పార్టీ అధిష్టానం పిలుపునిచ్చింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ సర్కార్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇంటికి సాగనంపేలా, తెలంగాణలో కచ్చితంగా కాషాయజెండా ఎగురవేసేలా.. స్పష్టమైన వ్యూహాలు, కార్యాచరణతో ముందుకు సాగాలని స్పష్టం చేసింది. రాష్ట్రంలో కొనసాగుతున్న నియంత, కుటుంబ పాలనకు చరమగీతం పాడే సత్తా కేవలం బీజేపీకే ఉందనే సంకేతాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించింది. 'ఇంటింటికీ కమలం పువ్వు' నినాదంతో వచ్చే పది నెలలు నిరంతరం ప్రజల్లోనే ఉంటూ వారి విశ్వాసాన్ని, మద్దతును కూడగట్టేలా వివిధ రూపాల్లో కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని సూచించింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మంగళవారం ఢిల్లీలో రాష్ట్ర పార్టీ ముఖ్య నేతలతో భేటీ అయ్యారు. అంతకుముందు నడ్డా, అమిత్‌షాతో పాటు జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) బీఎల్ సంతోష్ , తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జిలు తరుణ్‌ఛుగ్, సునీల్ బన్సల్, సహ ఇన్‌చార్జి అరవింద్ మీనన్, రాష్ట్రనేతలు సమావేశమయ్యారు. ఈ భేటీ మధ్యలో రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌తో అమిత్‌షా, నడ్డా, ఇతర నేతలు విడిగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి చెందిన ఇతర నేతలు బయటే

మిగతా 3వ పేజీలో ▶

అన్ని స్థాయిల్లో చేరికలు ప్రోత్సహించాలి

'రాష్ట్రంలో కేసీఆర్ నియంత పాలనపై ప్రజలు విసుగుతో ఉన్నారు. పార్టీ గెలుపునకు అవకాశాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు చేరికలను ప్రోత్సహించాలి. నేతలు సమన్వయంతో వ్యవహరించాలి.' అని నడ్డా, షా సూచించారు.


నడ్డా | అమిత్‌షా

ముమ్మర పర్యటనలు.. బహిరంగ సభలు

'రాష్ట్రంలో 119 అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిల్లో సమావేశాల తర్వాత, పది ఉమ్మడి జిల్లాల పరిధిలో ఒక్కోచోట 50 వేల మందికి తగ్గకుండా బహిరంగ సభలు నిర్వహించాలి. మార్చిలో అగ్రనేతలు అమిత్‌షా, జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు, ఇతర ముఖ్య నేతలు పర్యటించాలి. ఏప్రిల్‌లో ప్రధాని పాల్గొనే విధంగా, రాష్ట్రవ్యాప్తంగా 34 వేలకు పైగా పోలింగ్ బూత్‌ల్లోని పార్టీ కమిటీలు, కార్యకర్తలతో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభను నిర్వహించాలి..' అని సమావేశాల్లో నిర్ణయించారు.

న్యూస్‌రీల్

ఆగస్టు 29, 30 తేదీల్లో గ్రూప్-2 పరీక్ష

సాక్షి, హైదరాబాద్ : గ్రూప్–2 పరీక్షను ఆగస్టు 29, 30 తేదీల్లో నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ మంగళవారం వెల్లడించింది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ హాల్ టికెట్లను పరీక్షకు ఒక వారం ముందు **www.tspsc.gov.in** నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. 783 గ్రూప్–2 పోస్టులకు 5,51,943 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో పోస్టుకు దాదాపు 705మంది పోటీ పడనున్నారు. గ్రూప్–2 పరీక్షకు ఈ ఏడాది జనవరి 18 నుంచి ఫిబ్రవరి 16 వరకు దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే.

కుక్క కాటుకు 1,000 కుట్లు



అమెరికాలో ఆరేళ్ల బాలిక వ్యథ

వాషింగ్టన్: స్నేహితురాలితో ఆడుకోవడానికి పొరుగింటికి వెళ్లిన ఆరేళ్ల బాలికపై శునకం దాడిచేసింది. ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను బతికించడానికి వెయ్యికిపైగా కుట్లు వేయాల్సి వచ్చింది. చికిత్స కోసం నిధులు సేకరించారు. హృదయవిదారకమైన ఈ ఉదంతం అమెరికాలోని చెస్టర్‌విల్లేలో చోటుచేసుకుంది. ఆరేళ్ల చిన్నారి లిలీ ఫిబ్రవరి 18న ఆడుకోవడానికి పొరుగింటికి వెళ్లింది. అక్కడ టేబుల్‌పై కూర్చొని ఉండగా ఆ కుటుంబం పెంచుకుంటున్న పిట్‌బుల్ అనే జాతి శునకం హఠాత్తుగా దాడి చేసింది. ముఖంపై కరిచేసింది. కంటి కింది నుంచి చుబుకం దాకా పంటి గాట్లు దిగాయి. లిలీ మిత్రురాలు వెంటనే గట్టిగా అరవడంతో వంటగదిలో ఉన్న ఆమె తల్లి బయటకు వచ్చింది. కుక్కను ఆమె

మిగతా 6వ పేజీలో ▶

ఆప్ సర్కారుకు ఎదురు దెబ్బ

- మంత్రి పదవులకు రాజీనామా చేసిన మనీశ్ సిసోడియా, సత్యేందర్ జైన్
- ఆమోదించిన సీఎం కేజ్రీవాల్

6లో

గోదావరి-కావేరి అనుసంధానానికి రూ. 39,275 కోట్లు!

- సమగ్ర ప్రాజెక్టు నివేదికలో ఎన్‌డబ్ల్యూడీఏ అంచనా
- అనుమతుల ప్రక్రియ ప్రారంభిస్తామని ప్రకటన

5లో


వృద్ధులతో కలిసి భోజనం చేస్తున్న కేటీఆర్

హనుమాన్ గుడి లేని ఊరు.. పథకాలు అందని ఇల్లు లేదు

ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్

- సిరిసిల్లలో డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ
- ఎల్లారెడ్డిపేటలో రాష్ట్రంలోనే తొలి వృద్ధాశ్రమం ప్రారంభం

3లో

కామ్రేడ్లు కలిసొస్తే పొత్తులకు రెడీ: రేవంత్

రేవంత్ సభపై కోడిగుడ్లతో దాడి 3లో

రాష్ట్రంలో ఐటీ సోదాల కలకలం

- గూగీ ప్రాపర్టీస్ సహా పలు సంస్థలపై దాడులు
- మొత్తం 20 ఐటీ అధికారుల బృందాలతో తనిఖీలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ కంపెనీలపై ఐటీ సోదాలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఒకేరోజు నగరంలో దాదాపు 20 ఐటీ అధికారుల బృందాలు గూగీ ప్రాపర్టీస్ సహా పలు రియల్ ఎస్టేట్ సంస్థల్లో సోదాలు జరిపినట్టు సమాచారం. నెల రోజుల వ్యవధిలో పదుల సంఖ్యలో ఐటీ అధికారుల బృందాలు రాష్ట్రంలో వరుస తనిఖీలు నిర్వహించడం ఇది రెండోసారి. సోమవారం ఉదయం నుంచే దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేటల్లోని గూగీ ప్రాపర్టీస్‌తోపాటు సదరు కంపెనీ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులైన ఆదిభట్లలోని వండర్‌సిటీ, మంగల్‌పల్లిలోని రాయల్‌సిటీ, ఆదిభట్ల సమీపంలోని డాలర్ సిటీ, యాచారంలోని ఫార్మాసిటీ, యాదాద్రి సమీపంలోని పెరల్ సిటీ కార్యాలయాలతోపాటు హవర్స్, విహంగా ఇన్‌ఫ్రాసహా గూగీ రియల్ ఎస్టేట్‌కు చెందిన అనుబంధ సంస్థల్లోనూ తనిఖీలు కొనసాగినట్టు సమాచారం. కంపెనీల కార్యాలయాలతోపాటు గూగీ ప్రాపర్టీస్ ఎండీ, సీఈఓ షేక్ అక్బర్‌తోపాటు ఇతర డైరెక్టర్ల ఇళ్లు, కార్యాలయాల్లోనూ తనిఖీలు నిర్వహించినట్టు తెలిసింది. గూగీ ప్రాపర్టీస్‌తోపాటు ఆ సంస్థకు అనుబంధ సంస్థలుగా ఏర్పాటు చేసిన వెంచర్స్, డెవలప్‌మెంట్ ప్రాజెక్టుల వివరాలు ఐటీ అధికారులు సేకరించినట్టు సమాచారం. కంపెనీ లావాదేవీలకు సంబంధించి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. గతానికి భిన్నంగా పదుల సంఖ్యలో ఐటీ అధికారుల బృందాలు ఏకకాలంలో రాష్ట్రంలో సోదాలు జరుపుతుండడం గమనార్హం.

చీకోటి ప్రవీణ్‌కు ఐటీ నోటీసులు



సాక్షి, హైదరాబాద్: ఖరీదైన లగ్జరీ కారు కొనుగోలు వ్యవహారంలో క్యాసినో నిర్వాహకుడు చీకోటి ప్రవీణ్‌కు ఐటీ అధికారులు నోటీసులు జారీ చేశారు. రూ.3 కోట్ల రేంజ్‌రోవర్ కారుకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని ఐటీ అధికారులు నోటీసుల్లో పేర్కొన్నట్టు తెలిసింది. బినామీ సంస్థ (ప్రముఖ ఫర్నిచర్ సంస్థ) పేరిట చీకోటి ఈ కారును కొనుగోలు చేసినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఆ కారు తన స్నేహితుడి సంస్థదని, తాను అవసరం ఉన్నప్పుడు వాడుకుంటున్నట్లు ప్రవీణ్ ఐటీ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. శ్రీలంక, హాంకాంగ్, నేపాల్ క్యాసినో నిర్వహణ ఆరోపణలపై ఫెమా చట్టాల కింద ఈడీ ప్రవీణ్‌ను విచారించిన విషయం తెలిసిందే.

భైంసాలో ఆర్‌ఎస్‌ఎస్ యాత్రకు హైకోర్టు అనుమతి

ఈనెల 5న యాత్ర నిర్వహించనున్న ఆర్‌ఎస్‌ఎస్

సాక్షి, హైదరాబాద్: నిర్మల్ జిల్లా భైంసాలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) ఈ నెల 5న మధ్యాహ్నం 2.30 నుంచి రాత్రి 7 వరకు నిర్వహించ తలపెట్టిన శారీరక్ ప్రదర్శన్, పాతసంచాలన్ ర్యాలీకి హైకోర్టు షరతులతో కూడిన అనుమతినిచ్చింది. షరతులు పాటించకుండా యాత్ర నిర్వహిస్తే పోలీసులు చర్యలు తీసుకోవచ్చని తెలిపింది. ఈ యాత్ర ఫిబ్రవరి 19న నిర్వహించాల్సి ఉండగా...పోలీసులు అనుమతివ్వలేదు. మార్చి 5న నిర్వహించేందుకు అనుమతిచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఆర్‌ఎస్‌ఎస్ భైంసా సంఘ చాలక్ సాదుల కృష్ణదాస్ హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

FORM IV
(See Rule 8)

Statement about ownership and other particulars about newspaper **SAKSHI**

1. Place of Publication : HYDERABAD
2. Periodicity of its publication : DAILY
3. Printer's Name : V. MURALI
   Nationality : INDIAN
   Address : Jagati Publications Limited, 6-3-249/1, Sakshi Towers, Road No.1, Banjara Hills, Hyderabad -500 034.
4. Publisher's Name : V. MURALI
   Nationality : INDIAN
   Address : Jagati Publications Limited, 6-3-249/1, Sakshi Towers, Road No.1, Banjara Hills, Hyderabad -500 034.
5. Editor's Name : V. MURALI
   Nationality : INDIAN
   Address : Flat No. 301, Rajya Lakshmi Residency, Padma Colony, Nallakunta, Hyderabad - 500 044.
6. Name & Addresses of Individuals who own the Newspaper and shareholders holding more than one percent of the total capital :
   1. M/s. Jagati Publications Limited, 6-3-249/1, Sakshi Towers, Road No.1, Banjara Hills, Hyderabad -500 034.
   2. M/s.Carmel Asia Holdings Pvt Ltd., No. 12/2, Commerce at mantri, Bannerghatta Main road, Opposite mantri home care office, Bangalore, Karnataka - 560 076.
   3. M/s.Gilchrist Investments Pvt Ltd, # 1-1-151 & 1-1-151/1, Ground Floor, Sairam Towers, Alexander Road, Secunderabad - 500 003.
   4. M/s. Alpha Avenues Pvt Ltd., # 1-1-151 & 1-1-151/1, Ground Floor, Sairam Towers, Alexander Road, Secunderabad - 500 003.
   5. M/s. Alpha Villas Pvt Ltd., # 1-1-151 & 1-1-151/1, Ground Floor, Sairam Towers, Alexander Road, Secunderabad - 500 003.
   6. M/s. India Cements Ltd. # 827, Annasalai, Dhun Building, IVth Floor, Chennai - 600 002
   7. M/s. P.R. Enerrgy Holding Limited Lakshmi Nivas, Plot. No. 705, Road. No.3, Banjara Hills, Hyderabad-500 034
   8. M/s. PVP Business Ventures Pvt. Ltd. # 46, Avenue 4, Street No.1, Road No. 10, Banjara Hills, Hyderabad - 500 034
   9. M/s. PVP Business Towers Pvt Ltd., 8-2-609/K, Avenue 4, Street No. 1, Road No. 10, Banjara Hills, Hyderabad - 500 034.
   10. M/s.R.R. Global Enterprises Pvt. Ltd. 8-2-120/86/5, Third Floor, Sneha House, Road No. 3, Banjara Hills, Hyderabad - 500 034.
   11. M/s. Sentia Developers Ltd. 1A-Hamilton House, 1st Floor, Connaught Place, New Delhi - 110 001.
   12. M/s.Avant Garde Fashion Wear Pvt. Ltd, 54/3, Ejipura Main Road, Vivek Nagar, Bangalore - 560 047.
   13. M/s. Beta Avenues Pvt. Ltd., # 1-1-151 & 1-1-151/1, Ground Floor, Sairam Towers, Alexander Road, Secunderabad - 500 003.
   14. M/s. IA and IC Pvt. Ltd., Pada.No.3, Balkum, Opp Casa Lodha Royal, Near Jalaram Mandir, Thane (West) - 400 608.


I, V. MURALI hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
(V. MURALI)
Publisher

Date: 28-02-2023

వారానికి 4 రోజులు

పని విధానంలో ఇదో కొత్త ట్రెండ్



యూరప్‌లో 4 రోజుల పనివిధానంపై ప్రయోగాలు..

- యూరప్‌లోని పలు కంపెనీల్లో ప్రయోగాత్మక పరిశీలనలో సత్ఫలితాలు
- గతేడాది 61 సంస్థల్లో 3 వేల మంది పనితీరుపై అధ్యయనం
- ఉత్పాదకత, ఉద్యోగుల్లో చురుకుదనం పెరిగినట్లు వెల్లడి
- భారత్‌లో ఈ పనివిధానంపై భిన్నాభిప్రాయాలు

WEEK WORK 4-DAY

సండే.. దేశంలో చాలామంది ఉద్యోగుల సేదతీర్చే రోజు.. వారమంతా పనిలో పడ్డ కష్టం నుంచి వారికి విశ్రాంతినిచ్చే ఒకే ఒక్క సెలవు రోజు.. అదే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, కార్పొరేట్ కంపెనీలు, ఐటీ, అనుబంధ రంగాల వంటి వాటిలో పనిచేసే ఉద్యోగులైతే వారానికి రెండు రోజులపాటు సెలవులు పొందుతుంటారని మనకు తెలుసు. మరి వారానికి మూడు రోజులపాటు సెలవులు అందుకుంటున్న ఉద్యోగులు కూడా ఉన్నారని మీకు తెలుసా?! అదేంటి.. మన దేశంలో ఎవరిస్తున్నారని ఆలోచిస్తున్నారా? ఇంకా మన దేశంలో అమల్లోకి రాలేదులేండి... ప్రస్తుతానికి యూరప్‌లోని కొన్ని దేశాలు ఈ ట్రెండ్‌ను సెట్ చేసే పనిలో ఉన్నాయి.. అదేంటో తెలుసుకుందామా?

సాక్షి, హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ మహమ్మారి దెబ్బకు కంపెనీలు, సంస్థల పని విధానమే మారిపోయింది. అప్పటివరకు ఆఫీసుకు వెళ్లి చేసే పని బదులు వర్క్ ఫ్రం హోం వెసులుబాటు కల్పించాయి. ఆ తర్వాత కొన్నిరోజులు ఆఫీసు నుంచి, మరికొన్నిరోజులు ఇంటి నుంచి పని (హైబ్రీడ్) చేసే పద్ధతిని అమల్లోకి తెచ్చాయి. దీనికి కొనసాగింపుగా అన్నట్లు యూరప్‌లోని కొన్ని దేశాలు వారానికి నాలుగు రోజుల పని, మూడు రోజుల సెలవుల విధానం అమలును ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నాయి. ముఖ్యంగా యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)లో 61 కంపెనీలు 3 వేల మంది ఉద్యోగులకు 6 నెలలపాటు ఫోర్‌డే వీక్ విధానాన్ని పరిశీలించాయి.

వారానికి నాలుగు రోజుల పని వల్ల ఉత్పాదకత పెరగడంతోపాటు ఉద్యోగుల పని-జీవితం బ్యాలెన్స్ కూడా మెరుగైనట్లు ప్రయోగాత్మక పరిశీలనలో తేలింది. అలాగే ఉద్యోగాలు మానేసే వారి సంఖ్య తగ్గడంతోపాటు

ఇరుపక్షాలకూ లాభమే..

గతంలో మానేసిన వారు తిరిగి విధుల్లో చేరడం, అనారోగ్యంతో సెలవులు పెట్టే వారి సంఖ్య తగ్గడం వంటి ఎన్నో సానుకూల అంశాలు వెల్లడయ్యాయి. జీతం కంటే కూడా వారంలో ఒకరోజు పని తగ్గుదల వైపే మొగ్గుచూపుతున్నట్లు ఈ ప్రయోగంలో పాల్గొన్న వారిలో అధిక శాతం మంది ఉద్యోగులు పేర్కొన్నారు.

భారత్‌లో నిపుణుల స్పందనేంటి?

మన దేశంలోనూ వారానికి 4 రోజుల పని విధానంపై క్రమంగా ఆసక్తి పెరుగుతోంది. దీనిపై కర్ణాటక అసెంబ్లీలో ఏకంగా ఓ బిల్లును కూడా ప్రవేశపెట్టారు. రోజుకు 12 గంటలు పనిచేసే ఉద్యోగులకు వారానికి మూడు రోజులు ఆఫ్ తీసుకోవచ్చని ఇందులో పొందుపరిచారు. అయితే భారత్‌లో ఈ విధానం అమలుపై నిపుణుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకోవడంతోపాటు ఎదురయ్యే కొన్ని సవాళ్లను అధిగమిస్తూ పక్కా ప్రణాళికలతో చేపడితేనే మన దేశంలో సత్ఫలితాలు సాధ్యమని వాల్యూ మ్యాట్రిక్స్.ఏఐ వ్యవస్థాపకుడు ఆదిత్య మాలిక్ పేర్కొన్నారు. ఈ విధానానికి తగ్గట్లుగా నియమ, నిబంధనలు ఇతర అంశాలను మార్చాల్సి ఉంటుందన్నారు. మన దేశంలో ఆతిథ్య, తయారీ, రిటైల్ రంగాల్లో నాలుగు రోజుల పనివిధానం అమలు సాధ్యం కాదని డే కొలాబ్ కో-ఫౌండర్, సీఈవో రాజేశ్వరీసింగ్ అభిప్రాయపడ్డారు. కేవలం ఈ-కామర్స్, బ్యాంకింగ్, బీమా, టెక్నాలజీ వంటి రంగాల్లోనే ఇది సాధ్యమని పేర్కొన్నారు.



ఈ పని పద్ధతికి సరిపోయే పరిశ్రమ ఎంపికతోపాటు ఉద్యోగుల జీతభత్యాలు తగ్గించకుండా ఇందుకు అర్హమయ్యే సంస్థలనే ఎంపిక చేయాలని కర్మ వీ ఫౌండర్, సీఈవో ఉజ్జల్ డే సూచించారు. ప్రతి పరిశ్రమ, సంస్థకు 4 రోజుల పని విధానం సరిగ్గా వర్తించకపోవచ్చని, అయితే కోవిడ్ వ్యాప్తి తర్వాత పనిప్రదేశాలు మారిపోతున్న నేపథ్యంలో టెక్నాలజీ సహకారంతో నూతన ప్రక్రియలను చేపట్టడంలో నష్టమేమీ లేదని ఐమోచా సీఈవో అమిత్ మిశ్రా అభిప్రాయపడ్డారు. భారత్‌లో ఫోర్ డే వర్క్ విధానం అమలు వల్ల యాజమాన్యాలకు లేబర్ కాస్టులు, ఓవర్‌హెడ్ ఖర్చులు తగ్గడంతోపాటు ఉద్యోగులకూ వర్క్-లైఫ్ బ్యాలెన్స్ మెరుగవుతుందని జెన్‌లీప్ ఫౌండర్ సచిన్ తెలిపారు.


ఫోర్ డే వీక్ ఆహ్వానించదగ్గదే..



మన దేశంలో ఈ విధానం పనిచేయదనుకోవడానికి లేదు. గత పదేళ్లలో భారత్ ఎంతో అభివృద్ధి చెందింది. అయితే మనం 'మెంటల్ వెల్‌నెస్'కు తక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాం. రాబోయే 5-10 ఏళ్లలో దీనికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది. కొత్త పనివిధానంతో కొన్ని సమస్యలు కూడా పరిష్కారమవుతాయి. ఆర్థిక రంగానికి కూడా ఉపయోగపడుతుంది. ఫైవ్ డే వీక్ బదులు రోజుకు మరో గంటన్నర, రెండు పనిగంటలు పెంచి ఫోర్ డే వీక్ చేస్తే ఉద్యోగులకు మూడు రోజులు వెసులుబాటుగా ఉంటుంది. ఈ దిశగా యాజమాన్యాలు ఆలోచించాలి.

– సాక్షితో డాక్టర్ బి.అపర్ణారెడ్డి, హెచ్.ఆర్. నిపుణురాలు

ఈ విధానం ఎలా అమల్లోకి...?



దాదాపు వందేళ్ల కిందటే వారానికి చేసే పనిదినాలను తగ్గించాలనే ఆలోచన వచ్చిందట. ఫోర్డ్ మోటార్ కంపెనీ వ్యవస్థాపకుడు హెన్రీ ఫోర్డ్ 1926లోనే 6 రోజులపని స్థానంలో 'ఫైవ్ డే వీక్'విధానాన్ని ప్రవేశపెట్టారు. ఉద్యోగులు, సిబ్బంది పని గంటలు తగ్గించినంత మాత్రాన ఉత్పాదకతపై దాని ప్రభావం పడలేదని వెల్లడైంది. దీంతో ఇతర కంపెనీలు కూడా ఈ పద్ధతిని అనుసరించడం ప్రారంభించాయి. మారుతున్న కాలం, అభిరుచులను బట్టి ఐర్లాండ్, ఐస్‌లాండ్, ఆస్ట్రేలియా ఇతర దేశాల్లో అమలు చేసి సత్ఫలితాలు సాధించాయి. ఈ పని పద్ధతిపై న్యూజిలాండ్, యూఎస్, కెనడా, వివిధ ఐరోపా దేశాలు ప్రయోగాలు చేశాయి. 'ఫోర్ డే వర్క్' సిస్టమ్‌ను 2018లోనే టెక్ కంపెనీ అమెజాన్ ఎంపిక చేసిన ఉద్యోగులకు అమలు చేసింది. 2019లో జపాన్‌లో మైక్రోసాఫ్ట్ నెలపాటు ఈ పద్ధతిని పరిశీలించింది. 2020లో యూనీలివర్ న్యూజిలాండ్‌లో ఏడాదిపాటు పరీక్షించింది. తద్వారా ఈ కంపెనీలు మంచి ఫలితాలనే సాధించాయి. ఆ తర్వాత విదేశాల్లోని కొన్ని కంపెనీలు ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని అమలు చేస్తున్నాయి.

ఇప్పటికే ఇక్కడ స్టార్టప్ 'త్రీడే వీక్'!

దాదాపు ఏడాదిన్నర క్రితమే బెంగళూరుకు చెందిన ఓ ఫిన్‌టెక్ స్టార్టప్ కంపెనీ కొత్తగా ఉద్యోగంలో చేరిన వారికి వారంలో మూడు రోజుల పనికి 80 శాతం జీతం, ఇతర సౌకర్యాలు కల్పించింది. కొత్త ఆలోచనలు, నవీన ఆవిష్కరణలపై జిజ్ఞాస పెంచేందుకు తమ ప్రాజెక్ట్‌లో పనిచేసే టీమ్ సభ్యులకు వారు కోరుకున్న పనివిధానంలో పనిచేసే అవకాశం కల్పించింది.

ఎన్‌పీఏ డైరెక్టర్‌గా అమిత్‌గార్గ్



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్‌పటేల్ జాతీయ పోలీసు అకాడమీ (ఎస్‌వీపీ ఎన్‌పీఏ) డైరెక్టర్‌గా అమిత్‌గార్గ్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుత డైరెక్టర్ సెమా రాజన్ మంగళవారం ఉద్యోగ విరమణ చేయడంతో.. అదనపు డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న అమిత్ గార్గ్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కనీసం మూడు నెలలపాటు ఆయన పదవిలో ఉంటారని లేదా తదుపరి డైరెక్టర్‌ను నియమించే వరకు డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొంది.

విద్యుత్ వినియోగంలో కొత్త రికార్డు

14,794 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదు

సాక్షి, హైదరాబాద్: గతేడాదితో పోల్చితే ఈ ఏడాది రాష్ట్రంలో 30% విద్యుత్ డిమాండ్ పెరిగిందని తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్ రావు పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్రంలో గరిష్ట విద్యుత్ వినియోగం 14,794 మెగావాట్లకు పెరిగిందని, రాష్ట్ర చరిత్రలో ఇప్పటివరకు ఇదే అత్యధిక గరిష్ట విద్యుత్ వినియోగం అని వెల్లడించారు. వేసవి విద్యుత్ సరఫరాపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ...డిమాండ్‌కు తగ్గట్లు 290 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను మంగళవారం సరఫరా చేశామన్నారు. నిరంతర విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా పవర్ ఎక్స్ఛేంజీల నుంచి రూ.1,000 కోట్ల విద్యుత్‌ను కొనుగోలు చేశామని వెల్లడించారు. ఈ వేసవిలో మరో రూ.1,500 కోట్ల విద్యుత్‌ను కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. భవిష్యత్తులో విద్యుత్ వినియోగం 16వేల మెగావాట్లకు పెరగనుందని అంచనా వేశారు. ఈ మేరకు విద్యుత్ సరఫరా చేసేందుకు సన్నద్ధతతో ఉన్నామన్నారు.

విచారణ.. నియామకానికి అడ్డంకి కాదు

ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుల నియామకంపై హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ కమిషన్‌పై సాగుతున్న విచారణ.. సభ్యుల నియామకానికి ఎలాంటి అడ్డంకి కాదని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టం చేసింది. కమిషన్‌కు చైర్మన్, సభ్యుల నియామకం చేపట్టకపోవడంపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లతో పాటు పలువురికి నోటీసులు జారీ చేసింది. ఎస్టీ, ఎస్సీ కమిషన్ చైర్మన్, సభ్యులను నియమించకపోవడాన్ని సవాల్ చేస్తూ ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. వీరి నియామకం లేని కారణంగా ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడుతోందని పేర్కొన్నారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. నోటీసులు జారీ చేస్తూ, ఏప్రిల్ 13కు విచారణను వాయిదా వేసింది.

స్వచ్ఛ భారత్‌లో మరోసారి తెలంగాణ సత్తా

- స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ అవార్డుల్లో హవా
- మంత్రి ఎర్రబెల్లి వెల్లడి.. అవార్డులు గెలిచిన జిల్లాల అధికారులకు అభినందన



సాక్షి ప్రతినిధి, వరంగల్/సాక్షి హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రతి మూడు నెలలకోసారి ప్రకటిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ అవార్డుల్లో తెలంగాణ మరోసారి సత్తా చాటింది. రెండు వేర్వేరు విభాగాల్లో మొదటి మూడు స్థానాలకుగాను రెండు స్థానాలు సాధించి దేశంలోనే నంబర్‌వన్‌గా మళ్లీ నిలిచింది. 2022 అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికానికి, స్వచ్ఛ భారత్ మిషన్ ఎంపిక చేసిన రెండు విభాగాల్లోనూ తెలంగాణ అగ్రగామిగా నిలిచింది. స్టార్ త్రీ విభాగంలో తెలంగాణలోని సిద్దిపేట జిల్లా, జగిత్యాల జిల్లాలు దేశంలో మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. మూడో స్థానంలో కేరళలోని కొట్టాయం జిల్లా నిలిచింది. స్టార్ ఫోర్ విభాగంలో తెలంగాణలోని రాజన్న సిరిసిల్ల జిల్లా, 2వ స్థానంలో మధ్యప్రదేశ్‌లోని భోపాల్ జిల్లా నిలవగా, 3వ స్థానాన్ని తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా దక్కించుకుంది. గతంలోనూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రకటించిన ప్రతి అవార్డు విభాగంలోనూ తెలంగాణ మొదటి మూడు స్థానాల్లో నిలిచింది. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో అనేక అవార్డులు సాధించింది. మంగళవారం హనుమకొండలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మీడియాతో మాట్లాడుతూ ఈ వివరాలు వెల్లడించారు. నిధులు ఇవ్వకున్నా, అవార్డులు ఇస్తున్నందుకు కేంద్రానికి ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. పల్లెప్రగతి వంటి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సీఎం కేసీఆర్ దార్శనికత వల్లే ఈ అవార్డులు దక్కుతున్నాయన్నారు. ఈ అవార్డులు రావడంలో ఉన్నతాధికారుల నుంచి గ్రామ సిబ్బంది వరకు అందరి కృషి ఉందని కొనియాడారు. కాగా, అదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముఖరా కె గ్రామ సర్పంచ్ మీనాక్షికి మార్చి 4న ఢిల్లీలో రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా అవార్డు అందజేస్తారని ఎర్రబెల్లి తెలిపారు.

నిందితుడిని కాపాడేందుకు కాళోజీ వర్సిటీ యత్నం

గవర్నర్ తీవ్ర ఆగ్రహం.. వర్సిటీ వీసీకి లేఖ

సాక్షి, హైదరాబాద్: డాక్టర్ ప్రీతి ఆరోగ్యం సరిగా లేదని మొదట తప్పుడు సమాచారం ఇచ్చి నిందితుడిని కాపాడటానికి కాళోజీ వైద్య విశ్వవిద్యాలయం అధికారులు ప్రయత్నించారని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. వర్సిటీ వైస్ చాన్స్‌లర్‌కు మంగళవారం ఆమె లేఖరాశారు. సమగ్ర విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. వైద్య కళాశాలల్లో యాంటీ ర్యాగింగ్ చర్యలు గట్టిగా తీసుకోవాలని సూచించారు. మహిళా మెడికోలకు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలన్నారు. వైద్య కళాశాలల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. మహిళా మెడికోల కోసం కౌన్సెలింగ్ సెంటర్లను కూడా ఏర్పాటు చేయాలన్నారు.

ప్రీతి మృతిని జీర్ణించుకోలేకపోతున్నా

ప్రీతి తల్లిదండ్రులకు ఎమ్మెల్సీ కవిత లేఖ

సాక్షి, హైదరాబాద్: మెడికో ప్రీతి మరణించిందని తెలియగానే తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యాయని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. ఓ తల్లిగా ఆవేదనకు గురయ్యాయని తెలిపారు. ఈ మేరకు కవిత.. ప్రీతి తల్లిదండ్రులకు లేఖరాశారు. ప్రీతికి ఇలా జరగడం జీర్ణించుకోలేకపోతున్నట్టు పేర్కొన్నారు. 'కడుపు కోత అనుభవిస్తున్న మిమ్మల్ని ఎంత ఓదార్చినా అది తక్కువే. మీ కుటుంబానికి సీఎం కేసీఆర్ ప్రభుత్వం, బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంది. ప్రీతి మరణానికి కారణమైన దోషులను రాష్ట్ర ప్రభుత్వం వదిలిపెట్టదు' అని హామీ ఇచ్చారు.

టీఎస్ ఐసెట్ నోటిఫికేషన్ విడుదల

- 6నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- మే 26, 27 తేదీల్లో టీఎస్ ఐసెట్
- జూన్ 20న ఫలితాల విడుదల
- రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి వెల్లడి



నోటిఫికేషన్ విడుదల చేస్తున్న ఆర్.లింబాద్రి, టీఎస్ఐసెట్ కన్వీనర్ పి.వరలక్ష్మి, కేయూ వీసీ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ శ్రీనివాస‌రావు

కేయూ క్యాంపస్: ఈ విద్యాసంవత్సరం (2023–2024) ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకుగాను రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్. లింబాద్రి టీఎస్ ఐసెట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. మంగళవారం వరంగల్ కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో టీఎస్ ఐసెట్ చైర్మన్ తాటికొండ రమేశ్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. అపరాధ రుసుము లేకుండా మార్చి 6 నుంచి మే 6వ వరకు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు, దివ్యాంగ అభ్యర్థులకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.550, ఇతరులకు రూ.750 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. రూ.250 అపరాధ రుసుముతో మే 12 వరకు, రూ.500తో మే 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. హాల్‌టికెట్లను మే 22 నుంచి సంబంధిత వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

ప్రవేశ పరీక్ష ఇలా...

టీఎస్ ఐసెట్ ప్రవేశపరీక్షను మే 26, 27 తేదీల్లో నాలుగు సెషన్లలో నిర్వహిస్తారు.

- 26న మొదటి సెషన్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12–30 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2–30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, మూడో సెషన్ మే 27న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12–30 గంటల వరకు, నాలుగో సెషన్ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారు.
- 14 ప్రాంతీయ కేంద్రాలు, సుమారు 75 పరీక్షకేంద్రాలను కూడా గుర్తించారు.
- ప్రాథమిక కీని జూన్ 5న విడుదల చేస్తారు.
- ప్రాథమిక కీపైన అభ్యంతరాలు ఉంటే జూన్ 8వ తేదీ వరకు తెలియజేయాల్సింటుంది.
- ఫలితాలు జూన్ 20న విడుదల చేస్తారు.

25 శాతం అర్హత మార్కులు

టీఎస్ ఐసెట్‌లో ఎస్సీ, ఎస్టీ కేటగిరీ అభ్యర్థులు కనీస అర్హత మార్కులు లేవని, మిగతా కేటగిరీలవారికి అర్హత మార్కులు 25%గా నిర్ణయించినట్లు లింబాద్రి తెలిపారు. సిలబస్, మోడల్ పేపర్, సూచనలు, ఆన్‌లైన్ దరఖాస్తుల సమర్పణ విధాన, ఆన్‌లైన్ పరీక్ష, పరీక్ష కేంద్రాల జాబితా, మాక్ టెస్టుల సమాచారం https//icet.tshe.ac.in లో అందుబాటులో ఉన్నట్లు టీఎస్ ఐసెట్ కన్వీనర్ పి.వరలక్ష్మి తెలిపారు.

కౌన్ బనేగా 'రెరా' చైర్మన్?

- టీఎస్ రెరా రేసులో 50 మంది ఔత్సాహికులు
- పోటీలో మాజీ సీఎస్‌లు సోమేశ్, ఎస్‌కే జోషి సహా పలువురు
- ఈనెల 3తో ముగియనున్న దరఖాస్తు గడువు
- సోమేశ్ ఎంపిక లాంఛనమేనని రియల్టీ వర్గాల్లో ప్రచారం!


సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీఎస్ రెరా) చైర్మన్‌గా ఎవరు నియమితులవుతారనేది ఆసక్తికరంగా మారింది. ఎందుకంటే రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, ఎస్‌కే జోషి సహా పలువురు పదవిలో ఉన్న, పదవీ విరమణ పొందిన అధికారులు చైర్మన్ పదవి కోసం దరఖాస్తు చేసుకోవడం ఇందుకు కారణం. ఈనెల 3తో దరఖాస్తు గడవు ముగియనుంది. ఇప్పటికే 50కిపైగా దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. ఈ జాబితాలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ఎస్.సత్యనారాయణ, రిటైర్డ్ ఐఏఎస్‌లు చిరంజీవులు, బుసాని వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఐఆర్‌ఎస్ అధికారులు కూడా బరిలో ఉన్నట్లు తెలిసింది. రిటైర్డ్ ఐఏఎస్, టీఎస్ రెరా మాజీ చైర్మన్‌రాజేశ్వర్ తివారీ ఈసారి దరఖాస్తు చేసుకోకపోవడం గమనార్హం.

ఎంపిక ఎలా ఉంటుందంటే..

టీఎస్ రెరాకు చైర్మన్, సభ్యుల నియామకం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. దీనికి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, తెలంగాణ మున్సిపల్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, న్యాయశాఖ సెక్రటరీ నేతృత్వం వహిస్తున్నారు. చైర్మన్, ఇద్దరు సభ్యుల నియామకానికి దరఖాస్తులు కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 16న నోటిఫికేషన్ జారీ చేసింది. తొలుత ఫిబ్రవరి 17ను గడువుగా విధించినా ఆ తర్వాత మార్చి 3 వరకూ పొడిగించింది. రెరా చట్టం ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో అదనపు కార్యదర్శి స్థాయిలో పనిచేసిన వారు చైర్మన్‌పదవికి అర్హులు. వచ్చిన దరఖాస్తుల్లోంచి రెండు పేర్లను ఈ కమిటీ ప్రభుత్వానికి సూచిస్తుంది. అందులోంచి ఒకర్ని ప్రభుత్వం చైర్మన్‌గా నియమిస్తుంది. అయితే ఇప్పటికే మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్ లాబీయింగ్ చేశారని, రాష్ట్ర పెద్దలతో ఆయనకున్న సన్నిహిత సంబంధాల కారణంగా సోమేశ్ పేరు లాంఛనమే అని రియల్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. చైర్మన్‌గా నియమితులైన వాళ్లు ఐదేళ్లపాటు లేదా 65 ఏళ్ల వయసు వరకు ఈ పదవిలో కొనసాగుతారు.

తెలంగాణ, పశ్చిమబెంగాల్‌లోనే..

స్థిరాస్తిరంగ నియంత్రణ, వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం 2016లో రెరా చట్టాన్ని రూపొందించింది. అయితే రాష్ట్రంలో మాత్రం రెండేళ్ల ఆలస్యంగా 2018లో రెరాను అమల్లోకి తెచ్చారు. కానీ ఈ చట్టం అమల్లోకి వచ్చిన ఏడాదిలోగా పూర్తిస్థాయి రెరా అథారిటీని ఏర్పాటు చేయాల్సి ఉండగా రాష్ట్రంలో ఇప్పటివరకు అథారిటీ, అప్పీలేట్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయలేదు. ఇలా అథారిటీని ఏర్పాటు చేయని రాష్ట్రాల్లో పశ్చిమబెంగాల్, తెలంగాణ ఉండటం గమనార్హం. 2017 జనవరి 1 తర్వాత యూడీఏ, డీటీసీపీ, మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, పంచాయతీలు, టీఎస్ఐఐసీల నుంచి అనుమతి పొందిన అన్ని నిర్మాణ ప్రాజెక్టులు టీఎస్ రెరా పరిధిలోకి వస్తాయి. ఇప్పటివరకు రెరాలో 5 వేలకుపైగా ప్రాజెక్టులు నమోదయ్యాయి.



నీ ఆరోగ్యం బాగుపడాలనే!
టాటా బాయ్‌బాయ్!

క్లుప్తంగా...

నేడు కామారెడ్డికి ముఖ్యమంత్రి కేసీఆర్



సాక్షి, హైదరాబాద్/కామారెడ్డి: ముఖ్యమంత్రి కేసీఆర్ బుధవారం కామారెడ్డి జిల్లాలో పర్యటించనున్నారు. బాన్సువాడ నియోజకవర్గంలోని బీర్కూర్ మండలం తిమ్మాపూర్‌లోని తెలంగాణ తిరుపతి దేవస్థానంలో జరుగుతున్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఆయన హాజరుకానున్నారు. ఉదయం 10 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 10.40 గంటలకు బాన్సువాడకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో తిమ్మాపూర్‌కు చేరుకొని తిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 1.30 గంటలకు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతారని అధికార వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్యే, అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ధర్మకర్తగా ఉన్న తెలంగాణ తిరుమల ఆలయాన్ని 2016 ఏప్రిల్ 2న సీఎం కేసీఆర్ దర్శించుకున్నారు.

హైదరాబాద్ మీదుగా కోదాడకు ఠాక్రే..



సాక్షి, హైదరాబాద్/కోదాడ: రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్ రావ్ ఠాక్రే మంగళవారం హైదరాబాద్ వచ్చారు. నాగ్‌పూర్ నుంచి వచ్చిన ఆయనకు టీపీసీసీ నేతలు హర్కర వేణుగోపాల్‌రావు, సంగిశెట్టి జగదీశ్వర్‌రావు తదితరులు విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. అక్కడ కాసేపు టీపీసీసీ నేతలతో మాట్లాడిన ఠాక్రే ఏఐసీసీ కార్యదర్శులు బోసురాజు, రోహిత్‌చౌదరితో కలిసి నేరుగా కోదాడ వెళ్లిపోయారు. మంగళవారంరాత్రి అక్కడే ఉండనున్న ఆయన బుధవారం ఉదయం నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ నేతలతో భేటీ అయి జోడో యాత్రలపై సమీక్ష నిర్వహిస్తారు. ఆ తర్వాత కోదాడలో హాథ్‌సే హాథ్‌జోడో యాత్రలో పాల్గొని ములుగు వెళ్లనున్నారు. ఐదు రోజుల పాటు తెలంగాణలోనే ఉండనున్న ఆయన వరంగల్ జిల్లాలో పర్యటిస్తారు. అనంతరం రెండు రోజులు గాంధీభవన్‌లో పార్టీ ముఖ్య నేతలతో సమావేశాలు నిర్వహించనున్నారు. ఠాక్రే వెంట నల్లగొండ ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఉన్నారు.

జలయజ్ఞం ప్రాజెక్టులపై సవతి తల్లి ప్రేమ ఎందుకు?

వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల ధ్వజం




సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేశామని, నీళ్ల కష్టాలు లేవంటూ మంత్రి కె.తారకరామారావు పచ్చి అబద్ధాలు చెప్తున్నారని వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టుగా రీ డిజైన్ చేసి రూ.లక్షా 20 వేల కోట్లు ఖర్చు చేసి 57 వేల ఎకరాలకు సాగు నీరు ఇచ్చారు తప్పితే..రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఏ ప్రాజెక్టునూ పట్టించుకోలేదని విమర్శించారు. ఉమ్మడి ఏపీలోనే తెలంగాణలో ప్రతి ఎకరాకు సాగు నీరు అందించే విధంగా 33 ప్రాజెక్టులకు మహానేత వైఎస్సార్ శంకుస్థాపనలు చేశారని గుర్తు చేశారు. పెండింగ్ ప్రాజెక్టులపై బహిరంగ చర్చకు సీఎం కేసీఆర్, కేటీఆర్ సిద్ధమా అని సవాల్ విసిరారు.

విద్వేష వ్యాఖ్యలు చేయనంటూ అఫిడవిట్ ఇవ్వండి

షర్మిలకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: 'ప్రజా ప్రస్థానం పాదయాత్రలో వ్యక్తిగత, విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయను' అంటూ అఫిడవిట్ దాఖలు చేయాలని వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిలను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది. మహబూబాబాద్‌లో జరిగే పాదయాత్రకు అనుమతి ఇచ్చేలా జిల్లా ఎస్పీని ఆదేశించాలని కోరుతూ షర్మిల పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. హోంశాఖ జీపీ రూపేందర్ వాదనలు వినిపిస్తూ వ్యక్తిగత, విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయవద్దని గతంలో హైకోర్టు సూచించినా అలాగే మాట్లాడుతున్నారని తెలిపారు.

సీఎం కేసీఆర్‌కు కుర్చీనే దొరకలేదా..?: ప్రవీణ్‌కుమార్



అయిజ: ఎన్నికల్లో గెలిచిన అనంతరం కుర్చీ వేసుకొని కూర్చొని ఆలంపూర్ ఆయకట్టుకు నీరు పారిస్తానని చెప్పిన సీఎం కేసీఆర్‌కు ఇంత వరకు కుర్చీనే దొర కలేదా? జాగా దొరకడం లేదా? అని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ఎద్దేవా చేశారు. బహుజన రాజ్యాధికార యాత్ర మంగళవారం జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలో కొనసాగింది. ఉత్తనూరు సమీపంలో ప్రవీణ్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రం సిద్ధించినా ఆలంపూర్ నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదన్నారు.

నేత్రపర్వం.. శ్రీలక్ష్మీనరసింహుడి కల్యాణం

శ్రీలక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్ల తిరుకల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి తులా లగ్న పుష్కారాంశ సుముహూర్తాన భక్తజనుల సమక్షంలో వైభోవోపేతంగా జరిగింది. మాంగళ్యధారణ మహోత్సవం రాత్రి 10.16కి జరిగింది. ఈ సందర్భంగా స్వామిని పున్నాగ, జాజి, వకుళ, మల్లె, మందార, చంపక, కేతకి, మల్లిక పుష్పాలతో, మేలిమి బంగారం కంఠాభరణాలతో అలంకరించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, టీటీడీ తరఫున డిప్యూటీ ఈవో రమేష్ బాబు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. సీఎం కేసీఆర్ సతీమణి శోభ, మంత్రి జి.జగదీశ్‌రెడ్డి పాల్గొన్నారు. – సాక్షి, యాదాద్రి



హనుమాన్ గుడి లేని ఊరు.. పథకాలు అందని ఇల్లు లేదు

రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖల మంత్రి కె.తారకరామారావు

సిరిసిల్లలో డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ.. ఎల్లారెడ్డిపేటలో తొలి వృద్ధాశ్రమం ప్రారంభం



ఎల్లారెడ్డిపేటలో గిఫ్ట్ ఏ స్మైల్‌లో ట్యాబ్‌లు అందించి విద్యార్థినులతో మంత్రి కేటీఆర్

సిరిసిల్ల: రాష్ట్రంలో 'హనుమాన్ గుడిలేని ఊరు, కేసీఆర్ సంక్షేమ పథకాలు అందని ఇల్లు లేదు'అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖల మంత్రి కె.తారకరామారావు అన్నారు. రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్‌లో మంగళవారం నాలుగు వందల మంది పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, మిషన్ భగీరథ నీళ్లు, గురుకులాల్లో విద్య, ఆసరా పెన్షన్... ఇలా ఏదో ఒక్క పథకంలో పక్కాగా ప్రతి ఒక్క కుటుంబం లబ్ధిపొందుతోందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ సంక్షేమ పాలనకు ఇది నిదర్శనమన్నారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ పక్కా ఇళ్లు ఇస్తామని, డబుల్ బెడ్రూం ఇల్లు రానివారికి 'రూ.3 లక్షల ఇల్లు'పథకంలో అవకాశం కల్పిస్తామని అన్నారు. స్థలం లేని వారికి స్థలం, ఇల్లు కట్టుకోడానికి నిధులను ప్రభుత్వమే ఇస్తుందన్నారు. అర్హులకు న్యాయం చేస్తామని స్పష్టం చేశారు.

మోదీకి ఇష్టం లేకున్నా.. మనమే నంబర్ వన్

తెలంగాణ అంటే ప్రధాని మోదీకి ఇష్టం లేకున్నా.. దేశంలోనే రాజన్న సిరిసిల్ల జిల్లా నంబర్ వన్‌గా నిలిచిందని కేటీఆర్ అన్నారు. సోమవారం కేంద్రం ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ విభాగంలో రాజన్న సిరిసిల్ల నంబర్ వన్‌గా ఉందని, రెండోస్థానంలో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లా, మూడో స్థానంలో పెద్దపల్లి జిల్లా ఉండటం మనందరికీ గర్వకారణమన్నారు. కేటీఆర్ తన పుట్టిన రోజు సందర్భంగా ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, వీర్నపల్లి, గంభీరావుపేట మండలాల్లోని కాలేజీ విద్యార్థులకు గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా రెండు వేల మందికి ట్యాబ్‌లు పంపిణీ చేశారు. వేములవాడ నియోజకవర్గంలోని పిల్లలకు మరో 3 వేల ట్యాబ్‌లు పంపిణీ చేస్తామని ప్రకటించారు. ఒక్కో ట్యాబ్ విలువ రూ.86 వేలు ఉంటుందన్నారు. ప్రభుత్వ కాలేజీల్లో చదివే పిల్లలు ఐఐటీ, నీట్ ఎంట్రన్స్ పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించాలని, ప్రపంచంతో పోటీ పడేస్థాయికి చేరాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో తొలి వృద్ధాశ్రమం

రాష్ట్రంలోనే తొలి వృద్ధాశ్రమాన్ని మంత్రి కేటీఆర్ ఎల్లారెడ్డిపేటలో ప్రారంభించారు. ఎస్టీ హాస్టల్ భవనాన్ని రూ.40 లక్షలతో ఆధునీకరించి వృద్ధుల ఆశ్రమం, డే కేర్ సెంటర్‌గా మార్చారు. 25 పడకలతో కూడిన ఆశ్రమాన్ని ఏర్పాటు చేసి యోగా కేంద్రం, ఫిజియోథెరపీ, డాక్టర్ రూం, వ్యాయామ శాల, గేమ్స్ రూమ్ ఏర్పాటు చేశారు. ఆశ్రమంలో ఉన్న వృద్ధులతో మంత్రి కేటీఆర్ క్యారంబోర్డు ఆడారు. వారితో కలిసి భోజనం చేశారు. వృద్ధులతో చాలాసేపు ముచ్చటించారు.

కామ్రేడ్లు కలిసొస్తే పొత్తులకు రెడీ..

మోదీ, కేసీఆర్ అవిభక్త కవలలు
జోడో యాత్ర బహిరంగసభలో రేవంత్

భూపాలపల్లి: కామ్రేడ్లు కలిసొస్తే ఎన్నికల్లో పొత్తులకు సిద్ధంగా ఉన్నామని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వెల్లడించారు. 'ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్‌లు అవిభక్త కవలలు. వారి ఆలోచన, తలలు కలిసే ఉంటాయి. శరీరాలను వేరు చేస్తే మాత్రం ప్రాణం పోతుంది. వారిపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకత, కాంగ్రెస్‌ను దెబ్బతీసేందుకే ఆ రెండు పార్టీలు కొద్ది రోజులుగా ప్రజల ముందు విమర్శలు చేసుకుంటున్నాయి'అని రేవంత్ ఆరోపించారు. రేవంత్ చేపట్టిన హాథ్ సే హాథ్ జోడోయాత్ర మంగళవారం భూపాలపల్లిలో కొనసాగింది. ఉదయం సింగరేణి గనుల వద్ద గేట్ సమావేశం, రాత్రి అంబేడ్కర్ చౌరస్తా వద్ద జరిగిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో రేవంత్ ప్రసంగించారు. పొత్తుల విషయంలో జాతీయ స్థాయిలో చర్చలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఏపీలో టీడీపీతో బీజేపీ జతకట్టే అవకాశం ఉన్నందున తెలంగాణలో టీడీపీతో కాంగ్రెస్‌కు పొత్తు ఉండే అవకాశం లేదన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క, మాజీ ఎంపీలు మల్లు రవి, సిరిసిల్ల రాజయ్య, అంజన్‌కుమార్ యాదవ్, కాంగ్రెస్ నేతలు వేం నరేందర్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు పాల్గొన్నారు.

రేవంత్ సభపై కోడిగుడ్లతో దాడి

ప్రతిగా రాళ్ల వర్షం కురిపించిన కాంగ్రెస్ శ్రేణులు
దాడిలో ఓ ఎస్సైకి గాయాలు, పగిలిన థియేటర్ అద్దాలు



రేవంత్‌కు రక్షణగా నిలిచిన భద్రతా సిబ్బంది

భూపాలపల్లి/భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లిలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు చెప్పులు, కోడిగుడ్లు, టమాటాలతో దాడి చేయడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. దాడిపై ఆగ్రహించిన కాంగ్రెస్ శ్రేణులు బీఆర్‌ఎస్ కార్యకర్తలున్న ఓ థియేటర్‌పై రాళ్ల వర్షం కురిపించాయి. పావుగంటపాటు రాళ్ల దాడి కొనసాగింది. దాడిలో కాటారం ఎస్సై శ్రీనివాస్ తలకు గాయమైంది. వెంటనే ఆయన్ను ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. రేవంత్‌కు స్వాగతం పలుకుతూ అంబేడ్కర్ చౌరస్తాలో స్థానిక కాంగ్రెస్ నేతలు బీఆర్‌ఎస్ కటౌట్‌కు ఎదురుగా కటౌట్ ఏర్పాటు చేయడంపై మంగళవారం ఉదయం తలెత్తిన వివాదం చివరకు పోలీసుల లాఠీ చార్జీకి దారితీసింది. ఈ ఘటనను దృష్టిలో పెట్టుకొనే బీఆర్‌ఎస్ కార్యకర్తలు దాడిచేశారని కాంగ్రెస్ కార్యకర్తలు ఆరోపించారు.



బీఆర్‌ఎస్ నాయకులు ఉన్న థియేటర్‌పైకి రాళ్లు విసురుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు

దమ్ముంటే రా బిడ్డా: గండ్రపై రేవంత్ ఫైర్

'కొత్త రాష్ట్రంలో కోతుల గుంపు చేరి దోచుకుంటోంది. కాంగ్రెస్ కార్యకర్తలు గెలిపించిన ఇక్కడి ఎమ్మెల్యే దొరగడీలో గడ్డి తినేందుకు పార్టీ ఫిరాయించాడు. మీ అభిమానాన్ని తాకట్టుపెట్టి పార్టీ ఫిరాయించిన సన్నాసులకు గుణపాఠం చెప్పేందుకే యాత్ర కార్యక్రమం తీసుకున్నా' అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆయన ప్రసంగిస్తున్న సమయంలోనే బీఆర్‌ఎస్ కార్యకర్తలు దాడికి పాల్పడటంతో రేవంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'వారికి ఇదే నా హెచ్చరిక. వందమందిని తీసుకొచ్చి మా సభ మీద దాడి చేయిస్తావా? దమ్ముంటే నువ్వు రా బిడ్డా.. ఎవరినో పంపించి వేషాలు వేస్తున్నావా?. నేను అనుకుంటే నీ థియేటర్ కాదు.. నీ ఇల్లు కూడా ఉండదు. అంబేడ్కర్ చౌరస్తాకు రా.. నిన్ను పరిగెత్తించకపోతే ఇక్కడే గుండు కొట్టించుకొని పోతా'అంటూ రేవంత్ మండిపడ్డారు. '23న మా సభతో పాటు బీఆర్‌ఎస్ సభ కూడా ఉంది. రెండు పార్టీలు ఒకే రోజు సభ పెట్టకూడదనే విజ్ఞతతో ఆ రోజు సభ వాయిదా వేసుకున్నామని రేవంత్ అన్నారు.

కాంగ్రెస్ వల్లే ఇళ్ల పట్టాల పంపిణీ: భట్టి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ పోరాటం ఫలితంగానే రాష్ట్రం లోని పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీకి ప్రభుత్వం ముందుకొచ్చిందని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఇల్లు లేని నిరుపేదల దుస్థితిపై అసెంబ్లీ సమావేశాల్లో గళమెత్తడంతో పాటు.. కాంగ్రెస్ పార్టీ తరఫున అనేక రకాలుగా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి ఉద్యమాలు నిర్వహించామని గుర్తు చేశారు. నిరుపేద కుటుంబాలు పడుతున్న దుస్థితి నుంచి విముక్తి చేయడానికి ఇంటి స్థలాల పంపిణీ చేయాలని, డబుల్ బెడ్రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని, సొంత జాగా కలిగిన వారికి కనీసం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశామని వివరించారు.

సస్పెన్షన్ ఎత్తేయకుంటే ఎన్నికల్లో పోటీ చేయను: రాజాసింగ్

అబిడ్స్ (హైదరాబాద్): తనపై బీజేపీ విధించిన సస్పెన్షన్‌ను పార్టీ అధిష్టానం ఎత్తివేయకపోతే రానున్న ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంటానని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన ప్రకటన చేశారు. మంగళవారం పలు మీడియా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూలలో ఆయన పలు విషయాలను వెల్లడించారు. తనపై బీజేపీ అధిష్టానం సస్పెన్షన్ ఎత్తి వేస్తారన్న నమ్మకం ఉందన్నారు. ఒకవేళ ఎత్తి వేయకుంటే పోటీకి దూరంగా ఉంటానే తప్ప.. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసే ఉద్దేశం లేదని చెప్పారు.

పది నెలలూ ప్రజల్లోనే

▶ మొదటి పేజీ తరువాయి

ఉండిపోయారు. ఆ తర్వాత మధ్యాహ్నం ఒకటిన్నర నుంచి రెండున్నర గంటల వరకు రాష్ట్ర నేతలు కిషన్‌రెడ్డి, డీకే అరుణ, కె.లక్ష్మణ్, వివేక్ వెంకటస్వామి, ఏపీ జితేందర్‌రెడ్డి, ధర్మపురి అరవింద్, పొంగులేటి సుధాకర్ రెడ్డి, విజయశాంతి, ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, గరికపాటి మోహన్‌రావులతో అమిత్‌షా, నడ్డా భేటీ అయ్యారు. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ సంస్థాగత బలోపేతం, అసెంబ్లీ ఎన్నికలు లక్ష్యంగా రాష్ట్ర పార్టీ సంసిద్ధత, వ్యూహాల ఖరారు వంటి అంశాలపై నాలుగు గంటల పాటు చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 'ప్రజాగోస–బీజేపీ భరోసా' స్ట్రీట్‌కార్నర్ మీటింగ్‌లకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని అభినందించిన నడ్డా, షా.. పలు అంశాలపై రాష్ట్ర నేతలకు దిశా నిర్దేశం చేశారు.

గెలుపు లక్ష్యంగా ప్రజల్లోకి...

'అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఇప్పటికే నిర్వహించిన కార్యక్రమాలకు ప్రజా స్పందన మెరుగ్గా ఉందని మాకు నివేదికలు అందాయి. ఈ మార్చి నుంచి సెప్టెంబర్ దాకా పోలింగ్ బూత్‌లు, నియోజకవర్గాల వారీగా సభలు, ర్యాలీలు, వివిధస్థాయిల నాయకుల చేరికలు వంటి వాటిని విస్తృతంగా చేపట్టి ప్రజలను బీజేపీ వైపు ఆకర్షితులను చేయాలి. ఎన్నికలకు పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యేందుకు క్షేత్రస్థాయి నుంచి సంస్థాగతంగా పటిష్టం కావడం, కేసీఆర్ సర్కార్ వైఫల్యాలను ఎండగట్టడం, కేంద్ర ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజా బాహుళ్యంలోకి తీసుకెళ్లడంపై పార్టీ యావత్ యంత్రాంగం దృష్టి పెట్టాలి. రాష్ట్రంలో ఏమాత్రం అభివృద్ధి జరగకపోవడం, వివిధ వర్గాలు ఇంకా తీవ్రమైన సమస్యల్లో కొట్టుమిట్టాడుతుండటం వంటి అంశాలను మరింత ఉధృతంగా జనంలోకి తీసుకెళ్లాలి. 119 నియోజకవర్గాల్లోనూ సభలు నిర్వహించాలి. వీటికి జాతీయ నేతల్లో ఎవరో ఒకరు హాజరవుతారు. ఇక పాత పది జిల్లాల్లో నిర్వహించే బహిరంగ సభలకు అగ్ర నేతల్లో ఎవరో ఒకరు హాజరవుతారు..' అని చెప్పారు.

లిక్కర్ స్కాంపై చర్చ జరగలేదా?

సాయంత్రం మూడున్నర గంటల సమయంలో ఈ భేటీలు ముగిశాయి. ఈ సమావేశాల్లో ఢిల్లీ లిక్కర్ స్కామ్‌పై చర్చిస్తారని వార్తలు వచ్చినా అలాంటిదేమీ జరగలేదని నేతలు తెలిపారు. ఎమ్మెల్యేల కొనుగోలు అంశం, పార్టీ అధ్యక్షుడి మార్పు వంటి అంశాలు కూడా చర్చకు రాలేదని చెప్పారు. అయితే బీఆర్‌ఎస్ పార్టీపై కొద్దిసేపు సరదాగా చర్చించిన నేతలు.. ఆ పార్టీ జాతీయ పార్టీ అయితే మొన్నటి త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ ఎన్నికల్లో ఎందుకు పోటీ చేయలేదంటూ వ్యాఖ్యానించారని తెలిసింది. ఇకపై ప్రతి నెలా తమలో ఒకరి రాష్ట్ర పర్యటన ఉంటుందని, రెండు లేక మూడు సభలకు ప్రధాని మోదీ హాజరయ్యేలా చూస్తామని నడ్డా, షా అన్నట్టు నేతలు తెలిపారు. కాగా రాష్ట్రంలో పెద్దెత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్మించడంలో భాగంగా ప్రభుత్వంపై చార్జిషీట్లు విడుదల చేయాలని రాష్ట్ర పార్టీ నేతలు సూచించినట్టు సమాచారం.



వీడు ఏలియన్ కాదు.. మరెవరు?

ఏలియన్లు ఎలా ఉంటాయి? ఆకుపచ్చ రంగు శరీరం.. పెద్ద తల.. పెద్ద పెద్ద కళ్లు.. ఇలా ఉంటాయి.. లేదా ప్రపంచాన్ని నాశనం చేసేలా భీకర స్థాయిలో ఉంటాయి..

ఇప్పటివరకూ చాలామందికి గ్రహాంతర జీవులు అంటే మదిలో మెదిలేది ఇదే.. సినిమాలు మనకు అలాగే చూపించాయి.. ఒకవేళ నిజంగానే మన సౌర కుటుంబంలోనే ఏలియన్లు ఉంటే.. అవి ఎలా ఉంటాయి? అచ్చంగా మనిషిలాగా ఉంటాయా లేక సినిమాల్లో చూపించినట్టుగానే ఉంటాయా? దీనిపై ప్రపంచవ్యాప్తంగా కొందరు శాస్త్రవేత్తలు అన్నింటినీ విశ్లేషించి అంచనా వేశారు. సదరు గ్రహం/ఉపగ్రహంపై ఉండే గ్రావిటీ (గురుత్వాకర్షణ శక్తి), వాతావరణం సాంద్రత, ఉష్ణోగ్రతలు వంటి అంశాల ఆధారంగా వాటి రూపురేఖలను రూపొందించారు.

యూఎఫ్‌వోలు కనిపించడంతో..



ఇటీవల అమెరికా గగనతలంలో 'గుర్తుతెలియని ఎగిరే వస్తువులు (యూఎఫ్‌వో)'లు కనిపించాయంటూ వార్తలు రావడం, వీడియోలు, ఫొటోలు కూడా వెల్లువెత్తడంతో.. మళ్లీ గ్రహాంతరవాసుల (ఏలియన్ల)పై చర్చ మొదలైంది. ఏలియన్లు భూమ్మీదికి రావడానికి ప్రయత్నిస్తున్నాయంటూ సోషల్ మీడియాలో ప్రచారం హోరెత్తిపోయింది. ఈ క్రమంలో మన సౌరకుటుంబంలో ఏలియన్లు ఉన్నాయా? ఉంటే ఎలా ఉండొచ్చు? అన్నదానిపై డైలీమెయిల్ వెబ్‌సైట్ పలువురు శాస్త్రవేత్తలతో మాట్లాడి వివరాలు సేకరించింది.

ఏ ఆకారంలోనైనా..


మన సౌర కుటుంబంలోనే కాదు.. విశ్వంలో లక్షల కోట్ల కొద్దీ ఉన్న నక్షత్ర మండలాల్లో ఎక్కడైనా జీవం ఉండేందుకు అవకాశం ఎక్కువేనని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఆ గ్రహాల్లో నెలకొని ఉన్న పరిస్థితులకు అనుగుణంగా.. మనుషులు, జెల్లీఫిష్‌లు, నత్తలు, స్క్విడ్ (ఆక్టోపస్ వంటివి)లు, ఎగిరే కీటకాలు, సూక్ష్మజీవులు.. ఇలా ఏ రూపంలో అయినా ఏలియన్లు ఉండవచ్చని అంటున్నారు.

- సౌర కుటుంబంలో అంగారక, శుక్ర గ్రహాలతోపాటు గురుడి ఉపగ్రహాలు యురోపా,గనిమీడ్, కలిస్టో.. శని ఉపగ్రహాలు ఎన్సెలాడస్, టైటాన్.. నెప్ట్యూన్ ఉపగ్రహం ట్రిటాన్, మరుగుజ్జు గ్రహం సెరెస్‌లపై జీవం ఉండేందుకు అవకాశాలు ఉన్నాయని చెప్తున్నారు.
- భూమిని పోలిన పరిస్థితులు, వాతావరణం ఉన్నచోట.. భూమ్మీది తరహాలోనే విడిగా తల, కాళ్లు, చేతుల వంటి అవయవాలు, పెద్ద మెదడుతో కూడిన జీవులు ఉండొచ్చని కేంబ్రిడ్జి యూనివర్సిటీ పాలియాంటాలజిస్ట్ సిమన్ కోన్వే మోరిస్ తెలిపారు. ఒకవేళ నక్షత్రానికి దూరంగా ఉండి, కాంతి తక్కువగా పడే గ్రహాల్లో అయితే కళ్లు బాగా పెద్దవిగా ఉంటాయన్నారు. అయితే ఆ జీవుల ఆకారం మనుషుల్లా ఉండొచ్చు, లేకపోవచ్చని పేర్కొన్నారు.

ప్రస్తుత పరిస్థితులను బట్టి.. ఒకవేళ సౌర కుటుంబంలోనే జీవాన్ని కనుగొన్నా, అవి ఏక కణ సూక్ష్మజీవులే అయి ఉంటాయని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లండన్ ప్రొఫెసర్ ఆండ్రూ కోట్స్ స్పష్టం చేశారు. కానీ విశ్వంలోని కోట్లాది నక్షత్ర మండలాల్లో చాలా చోట్ల ఏలియన్లు జీవించి ఉండే అవకాశం ఉందన్నారు.



భూమిలా ఉంటే..
భూమిపై ఉన్నట్టుగానే కాస్త అటూ ఇటూగా గ్రావిటీ, వాతావరణం, ఉష్ణోగ్రతలు ఉంటే.. ఏలియన్లు మనుషుల మాదిరిగానే ఉండే అవకాశాలు ఎక్కువ.




గ్రావిటీ తక్కువగా ఉంటే..
చిన్నగా ఉండే గ్రహాలు/ఉపగ్రహాల్లో గ్రావిటీ తక్కువగా ఉంటుంది. అలాంటి చోట తేలికగా, ఎక్కువ ఎత్తుతో, బలహీనమైన కండరాలతో కూడిన జీవులు ఉండేందుకు ఆస్కారం ఉంటుంది.




గ్రావిటీ ఎక్కువగా ఉంటే..
భూమికన్నా పరిమాణంలోపెద్దగా ఉండే గ్రహాల్లో గ్రావిటీ ఎక్కువగా ఉంటుంది. మిగతా పరిస్థితులు భూమిలా ఉన్నా, గ్రావిటీ ఎక్కువుంటే.. ఏలియన్లు ఎత్తు తక్కువగా, దృఢమైన కండరాలతో కూడి ఉంటాయి.

వాతావరణం తక్కువగా ఉంటే..
గ్రహం/ఉపగ్రహం సైజుతో సంబంధం లేకుండా, వాతావరణం తక్కువ సాంద్రత (డెన్సిటీ)తో ఉంటే.. తక్కువ బరువుతో, చాలా పెద్ద రెక్కలతో కూడిన ఏలియన్లు ఉండొచ్చు.



నిండా మంచుతో కప్పి ఉంటే..
గురుడి ఉపగ్రహం యూరోపా మాదిరిగా మొత్తంగా మంచుతో కప్పబడి, దాని దిగువన నీటి సముద్రాలు ఉంటే.. పీతలు, ఆక్టోపస్‌ల వంటి ఆకారాల్లో ఏలియన్లు ఉండేందుకు చాన్స్ ఎక్కువ.



-సాక్షి సెంట్రల్ డెస్క్

పొడిగా ఉండే గ్రహాలైతే..
శుక్రుడు, మార్స్ వంటి పొడిగా ఉండే వాతావరణ పరిస్థితులు ఉన్న గ్రహాలు/ఉపగ్రహాల్లో జీవం సూక్ష్మజీవుల తరహాలో ప్రాథమిక స్థాయిలో ఉండొచ్చు. వాతావరణం అనుకూలంగా మారితే పరిణామక్రమంలో ఎదిగి.. పెద్దస్థాయి జీవులుగా మారొచ్చు.



పార్టీ ఇచ్చిన పనిని అందరూ చేయాల్సిందే

'హాథ్ సే హాథ్'యాత్రలపై సమీక్ష నిర్వహించిన బోసురాజు



సాక్షి, హైదరాబాద్: పార్టీ ఇచ్చిన పనిని అందరూ చేయాల్సిందేనని, ఇందులో ఎవరికీ మినహాయింపు ఉండదని ఏఐసీసీ కార్యదర్శి బోసురాజు స్పష్టం చేశారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన నేతలు తమ తమ నియోజకవర్గాల్లో పార్టీ పనులు చేసుకుంటూనే తమకు కేటాయించిన అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇచ్చిన బాధ్యతలను నెరవేర్చాల్సిందేనని వెల్లడించారు. మంగళవారం గాంధీభవన్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులతో భేటీ అయిన బోసురాజు.. రాష్ట్రంలో జరుగుతున్న హాథ్ సే హాథ్ జోడో అభియాన్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ హాథ్ సే హాథ్ జోడోయాత్ర తమ నియోజకవర్గాల్లో కూడా నిర్వహిస్తున్నందున తమకు కేటాయించిన నియోజకవర్గాలకు వెళ్లడం కష్టంగా ఉందనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. దీంతో పార్టీ ప్రధాన కార్యదర్శులుగా ఎంపికైన నేతలు పార్టీకి సంబంధించిన అన్ని వ్యవహారాలు చక్కబెట్టాల్సిందేనని, తమ నియోజకవర్గాలతో పాటు బాధ్యతలిచ్చిన 2, 3 నియోజకవర్గాల్లో కూడా హాథ్ సే హాథ్ జోడో యాత్రలపై అక్కడకు వెళ్లి నివేదికలు తయారు చేయాలని స్పష్టంచేశారు. ఈనెల 6 లోపు తమకు కేటాయించిన స్థానాల్లో వెళ్లి రిపోర్టు చేయాలని, అక్కడ హాథ్ సే హాథ్ జోడో యాత్రలు జరుగుతున్న తీరుపై పార్టీకి సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్, ముఖ్య నేతలు సంభాని చంద్రశేఖర్, గడ్డం వినోద్, చెరుకు సుధాకర్, సంగిశెట్టి జగదీశ్వరరావులతో పాటు టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు వజ్రేశ్‌యాదవ్, విజయారెడ్డి, చరణ్ కౌశిక్ యాదవ్, చల్లా నర్సింహారెడ్డి, భూపతిరెడ్డి నర్సారెడ్డి, బాలలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

119 నియోజకవర్గాల్లోనూ పోటీకి సిద్ధం

- తెలంగాణలో బీజేపీనే ప్రత్యామ్నాయం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



సాక్షి, న్యూఢిల్లీ: వచ్చే ఎన్నికల్లో తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లోనూ పోటీకి సిద్ధంగా ఉన్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తెలిపారు. తమకు 119 నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు లేరంటూ బీఆర్‌ఎస్ చేస్తున్నది దుష్ప్రచారమేనని ఆయన మండిపడ్డారు. ఈ ఏడాది తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మంగళవారం ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులు బీఎల్ సంతోష్, తరుణ్‌ఛుగ్, సునీల్ బన్సల్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల సహ ఇన్‌చార్జి అరవింద్ మీనన్‌తో జరిగిన సమావేశంలో రాష్ట్ర నేతలతో కలసి బండి సంజయ్ పాల్గొన్నారు. అనంతరం పార్టీ నేతలు ఈటల రాజేందర్, జితేందర్‌రెడ్డి, గరికపాటితో కలిసి సంజయ్ మీడియాతో మాట్లాడారు.

హైదరాబాద్‌లో ప్రధాని బహిరంగ సభ: వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీనే ప్రత్యామ్నాయమని, ప్రజాసమస్యలపై ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని బండి సంజయ్ పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 11 వేల స్ట్రీట్ కార్నర్ సమావేశాలను నిర్వహించామన్న సంజయ్.. వచ్చే 6 నెలల్లోగా 119 నియోజకవర్గాల్లోనూ బహిరంగసభలు, ఆ తర్వాత జిల్లాకేంద్రాలు, చివరగా హైదరాబాద్‌లో భారీ బహిరంగసభ నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ సభకు ప్రధాని మోదీ రానున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో కేసీఆర్ అవినీతి పాలన: తరుణ్‌ఛుగ్
సమావేశం అనంతరం పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్ ఛుగ్ మీడియాతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలన, అవినీతి పాలన కొనసాగుతోందని ఆరోపించారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ కుటుంబ పాలన నుంచి విముక్తి కోరుకుంటున్నారని, కల్వకుంట్ల కుటుంబంపై తెలంగాణ ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు.



“ వన్య మృగం కన్నా కపటి, దుష్టుడు అయిన స్నేహితుడికి ఎక్కువ భయపడాలి. వన్యమృగం మీ శరీరాన్నే గాయపరచవచ్చు, కానీ దుష్ట స్నేహితుడు మీ మనసును గాయపరుస్తాడు.

– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, మార్చి, 1

సతతత హరిత వ్యూహాత్మకం

ఢిల్లీలోని చాణక్యపురిలో రోడ్డుపై దుకాణంలో తేనీరు సేవించిన జర్మనీ అధినేత! ఇది, ప్రధాని మోదీతో కలసి సంయుక్త మీడియా ప్రకటన మినహా జర్మనీ ఛాన్స్‌లర్ ఒలాఫ్ షోల్జ్ రెండు రోజుల భారత అధికారిక పర్యటనపై హడావిడి వార్తలు, ప్రకటనలు మీడియాలో కనిపించి ఉండకపోవచ్చు. అంతమాత్రాన షోల్జ్ భారత పర్యటన అప్రధానమనుకుంటే పొరపాటే. రాష్ట్రపతిని కలసి సంభాషించడం, ప్రధానిని కలసి చర్చించడం, ఔత్సాహిక వ్యాపారవేత్తలతో గోష్ఠి జరపడం – ఇలా ఫిబ్రవరి 25, 26ల్లో షోల్జ్ సుడిగాలిలా చుట్టేశారు. ఇప్పటికే జపాన్, చైనా, ఆసియాన్ దేశాల్లో పర్యటించిన ఆయన తమ దేశ ఇండో–పసిఫిక్ విధానంలో భాగంగా భారత్‌తో బంధం దృఢమైనదని తేల్చేశారు. ఉక్రెయిన్‌లో యుద్ధానికి ఏడాది నిండిన వేళ ఈ పర్యటన వ్యూహాత్మకంగా కీలకమనేది అందుకే.

పదహారేళ్ళ సుదీర్ఘ ఏంజెలా మెర్కెల్ పాలన తర్వాత 2021 డిసెంబర్‌లో జర్మనీ ప్రభుత్వాధినేత అయిన షోల్జ్ ఆ పైన మన దేశంలో పర్యటించడం ఇదే తొలిసారి. ఆ మాటకొస్తే, 2011 తర్వాత ఒక జర్మన్ నేత భారత్‌లో ప్రత్యేకంగా పర్యటించడం కూడా ఇదే ప్రథమం. అలా ఈ తాజా పర్యటనకు విశేష ప్రాధాన్యం ఉంది. జర్మన్ అధినేత వెంట వచ్చిన వ్యాపార ప్రతినిధి బృందంలో సీమెన్స్, శాప్ సంస్థలు ఉన్నాయి. ఐటీ, టెలికామ్ సహా కీలక రంగాల్లో భారత సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నాయి. స్వచ్ఛ ఇంధనం, వాణిజ్యం, నవీన సాంకేతిక పరిజ్ఞాన రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాల పటిష్ఠతే లక్ష్యంగా ప్రధాని మోదీతో షోల్జ్ విస్తృత స్థాయి చర్చలు జరిపారు. మరీ ముఖ్యంగా, యూరప్ తన సరఫరా వ్యవస్థలను చక్కదిద్దుతున్న వేళ షోల్జ్ చర్చలు కీలకమయ్యాయి.

సహజంగానే ఉక్రెయిన్ వ్యవహారం అజెండాలో ముందుంది. అయితే, రష్యా వ్యతిరేక వైఖరి తీసుకొనేలా ఒత్తిడి తెచ్చే కన్నా... అందరికీ కావాల్సిన మనిషిగా, మధ్యవర్తిత్వం నెరిపే వీలున్న దేశంగా భారత్‌తో జర్మనీ జత కడుతోంది. జీ20 సారథిగా భారత్ ఈ యుద్ధానికి త్వరగా తెరపడేలా చేసి, ఆర్థిక పునరుజ్జీవనం జరిపించాలని భావిస్తోంది. అందుకే పర్యటనను సాధనంగా ఎంచుకుంది. రష్యా రక్షణ ఉత్పత్తుల సరఫరాలపై భారత్ ఆధారపడినందున జలాంతర్గాముల సంయుక్త తయారీ లాంటి అంశాల్లో భారత్‌తో చేయి కలుపుతూ, సరఫరా వ్యవస్థల్లో మార్పుకు చూస్తోంది. ఈ భౌగోళిక – రాజకీయ సంక్షోభాన్ని కాస్త పక్కనపెడితే, నూతన ఆవిష్కరణలు, సాంకేతిక రంగాల్లో పరస్పర సహకారాన్ని పటిష్ఠం చేసుకొనేలా ఒక దార్శనిక పత్రాన్ని మోదీతో కలసి షోల్జ్ ఆమోదించారు. స్వచ్ఛ ఇంధన సాంకేతికత నుంచి కృత్రిమ మేధ (ఏఐ) దాకా పలు హామీలు ఇచ్చిపుచ్చుకున్నారు. రెండు అంతర్ ప్రభుత్వ పత్రాలతో పాటు, మూడు వ్యాపార ఒప్పందాల పైనా చేవ్రాలు జరిగింది.

నూతన ఆవిష్కరణల పత్రంలో ప్రధానంగా హరిత ఉదజని సహా ఇంధన, స్వచ్ఛ సాంకేతికతల్లో భాగస్వామ్యానికి అగ్ర తాంబూలం ఇచ్చారు. హరిత ఉదజని ఆర్థికంగా గిట్టుబాటయ్యేలా చూడడమే ఉమ్మడి దీర్ఘకాలిక లక్ష్యం. కొన్నేళ్ళుగా ఇరుదేశాల మధ్య సంబంధాలు కీలక రంగాల్లో జోరందుకున్నాయి. గత డిసెంబర్‌లో జర్మన్ విదేశాంగ మంత్రి భారత్‌ను సందర్శించారు. షోల్జ్ పర్యటనకు రంగం సిద్ధం చేశారు. గత ఏడాది కాలంలో మూడుసార్లు కలసిన మోదీ, షోల్జ్‌ల మధ్య మంచి స్నేహం నెలకొంది. నిరుడు మేలో 6వ ఇండియా– జర్మనీ అంతర్ ప్రభుత్వ సంప్రతింపులలో (ఐజీసీ) ఇరువురు నేతలూ తొలిసారి సమావేశమయ్యారు. ఆపైన జర్మనీ సారథ్యంలోని ‘జీ7’ సదస్సుకు మోదీని షోల్జ్ ఆహ్వానించారు. జూన్‌లో ఆ వార్షిక సదస్సులో మోదీ పాల్గొన్నారు. ఇక నవంబర్‌లో ‘జీ20’ సదస్సు వేళ ఇండొనేసియాలో ద్వైపాక్షిక చర్చలతో బంధం బలపడింది.

ప్రపంచాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న పలు సవాళ్ళను దీటుగా ఎదుర్కొనే విషయంలో భారత, జర్మనీల దృక్పథం చాలావరకు కలుస్తుంది. నియమానుసారమే అంతర్జాతీయ క్రమం సాగాలనీ, ఐరాస నిబంధనావళిలోని అంతర్జాతీయ న్యాయ ఆదేశిక సూత్రాలను గౌరవించాలనీ ఇరుదేశాల వైఖరి. ఈ అభిప్రాయాలతో పాటు ఇండో– పసిఫిక్ విధానంలో భాగంగా అంతర్జాతీయ అవసరాలు, అనివార్యతలు ఉభయ దేశాలనూ మరింత దగ్గర చేశాయి. యూరోపియన్ యూనియన్ (ఈయూ) – భారత్‌ల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్టీఏ), ఈయూలో భాగం కాని థర్డ్ కంట్రీల్లో అభివృద్ధి పథకాలపై చర్చల్ని త్వరితగతిన ఖరారు చేయాలని జర్మనీ గట్టిగా యత్నిస్తోంది. గతంలో ఆరేళ్ళు చర్చించినా, 2013లో తొలిసారి మన ఎఫ్టీఏ ప్రయత్నం విఫలమైంది. ఇప్పుడు షోల్జ్ సైతం ఎఫ్టీఏకు వ్యక్తిగతంగా కట్టుబడ్డారు. ఇవన్నీ ప్రపంచ వేదికపై పెరుగుతున్న భారత్ పలుకుబడికి నిదర్శనం.

జర్మనీ విదేశాంగ మంత్రి ఆ మధ్య అన్నట్టు, ‘ప్రపంచంలో అత్యధిక జనాభా గల దేశంగా చైనాను అధిగమిస్తున్న భారత్‌ను సందర్శిస్తే, ప్రపంచంలో ఆరోవంతును చూసినట్టే.’ అలాగే, ‘21వ శతాబ్దంలో ఇండో– పసిఫిక్‌లోనూ, అంతకు మించి అంతర్జాతీయ క్రమాన్ని తీర్చిదిద్దడంలో నిర్ణయాత్మక ప్రభావం భారత్‌దే.’ ఇక, మన దేశంలో దాదాపు 1800 జర్మనీ సంస్థలు క్రియాశీలంగా ఉన్నాయి. భారత్‌లో భారీ విదేశీ పెట్టుబడుల్లోనూ ముందున్న ఆ దేశం వేలల్లో ఉద్యోగ కల్పనకు కారణమవుతోంది. ఈ పరిస్థితుల్లో షోల్జ్ ఆత్మీయ స్నేహం, అవసరమైన మిత్రుడితో మోదీ అనుబంధం అర్థం చేసుకోదగినవి. 141 కోట్ల జనాభాతో అపరిమిత ఇంధన అవసరాలున్న వేళ, హరిత ఇంధనం సహా అనేక అంశాల్లో జర్మనీతో బంధం భవిష్యత్తుకు కీలకమైనది. ఈ సమయం, సందర్భాలను అందిపుచ్చుకోవడమే భారత్‌కు తెలివైన పని.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** శు.నవమి ఉ.6.33 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** మృగశిర ఉ.11.57 వరకు, తదుపరి ఆరుద్ర. **వర్జ్యం:** రా.9.05 నుండి 10.51 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.50 నుండి 12.34 వరకు, **అమృతఘడియలు:** రా.3.10 నుండి 4.56 వరకు.

సూర్యోదయం : 6.24
సూర్యాస్తమయం : 6.01
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

నైతిక పునాది లేని జాతీయవాదం

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

భారత్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పర్చడానికి విదేశీ విశ్వవిద్యాలయాలకు కేంద్ర ప్రభుత్వం తలుపులు తెరిచింది. ఈ క్యాంపస్‌ను ఏర్పర్చాలనుకునే విదేశీ విశ్వవిద్యాలయం గ్లోబల్ ర్యాకింగ్స్‌లో టాప్ – 500ల్లో ఉండాలి. స్పష్టంగా వీటిలోని కోర్సులను ప్రపంచస్థాయిలో పోటీపడే సిలబస్‌తో ఇంగ్లిష్‌లో నేర్పుతారు. కేంద్రం ఇంగ్లిష్‌లో తమ ఇచ్ఛప్రకారం కోర్సులను బోధించే విశ్వవిద్యాలయాలను అనుమతించడం ఆశ్చర్యంగా లేదా? ఇదే ప్రభుత్వం ఉన్నత విద్యా సంస్థల్లో హిందీని బోధనా భాషగా చేయాలనీ, సిలబస్ భారతీయ సంస్కృతిపై ఎక్కువగా ఆధారపడి ఉండాలనీ చెబుతూ వచ్చింది. ప్రశ్న ఏమిటంటే, భారతీయ విశ్వవిద్యాలయాల్లో హిందీలో చదివేవారు ఎవరు? విదేశీ విశ్వవిద్యాలయాల్లో ఇంగ్లిష్‌లో అధ్యయనం చేసేది ఎవరు?

మన విద్యా వ్యవస్థ ద్వంద్వ ప్రమాణాల వల్ల దెబ్బతింటోంది. తీవ్ర జాతీయవాది సైతం తమ పిల్లలకు ఇంగ్లిష్, విదేశీ యూనివర్సిటీ విద్య నేర్పించడాన్నే ఇష్టపడుతున్నారు. మరోవైపు సంస్కృతి, వారసత్వం, మాతృ భాష అంటూ రాగం ఎత్తుకుంటారు. ఒక కుటుంబానికి డబ్బుంటే, వారి పిల్లలు ప్రైవేట్ ఇంగ్లిష్ మీడియం స్కూల్స్‌లో చదవడానికి భారీగా ఖర్చు చేస్తారు. విదేశీ యూనివర్సిటీల్లో చదవడానికి అమెరికా లేదా ఇంగ్లండ్‌కు పోతారు. కానీ స్వదేశంలో అత్యున్నత విజ్ఞానాన్ని మన ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు బోధించాలని వీరు కోరుకోవడం లేదు.

కేంద్ర ప్రభుత్వం కొన్ని నెలల క్రితం భారత్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పర్చడానికి విదేశీ విశ్వవిద్యాలయాలకు (యేల్, హార్వర్డ్, ప్రిన్స్‌టన్) తలుపులు తెరిచింది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్‌పర్సన్ ఎం. జగదీశ్ కుమార్ జనవరి 5న నిర్వహించిన ఒక ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఈ ప్రకటన చేశారు. మీడియా నివేదికల ప్రకారం, ‘భారత్‌లో తన క్యాంపస్‌ను ఏర్పర్చాలనుకునే విదేశీ విశ్వవిద్యాలయం గ్లోబల్ ర్యాకింగ్స్‌లో టాప్– 500ల్లో ఉండాలి.’ అంటే వివిధ దేశాలకు చెందిన అగ్రశ్రేణి యూనివర్సిటీలు భారత్ లోని కొత్త క్యాంపస్‌లపై దృష్టి సారిస్తాయని దీనర్థం. స్పష్టంగా వీటిలోని అన్ని కోర్సులను ప్రపంచస్థాయిలో పోటీపడే సిలబస్‌తో ఇంగ్లిష్‌లో నేర్పుతారు.

బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం ఇంగ్లిష్‌లో తమ ఇచ్ఛప్రకారం కోర్సులను బోధించే విశ్వవిద్యాలయాలను అనుమతించడం ఆశ్చర్యం కలిగించడం లేదా? ఇదే ప్రభుత్వం ఉన్నత విద్యా సంస్థల్లో హిందీని బోధనా భాషగా చేయాలనీ, సిలబస్ భారతీయ సంస్కృతి, వారసత్వంపై ఎక్కువగా ఆధారపడి ఉండాలనీ పదే పదే చెబుతూ వచ్చింది. యూనివర్సిటీ సిలబస్‌లో నిర్బంధంగా వేద, పురాణ అధ్యయనాలను చొప్పించాలని కేంద్రం ప్రయత్నిస్తోంది. వివాదాస్పదమైన ప్రశ్న ఏమిటంటే, భారతీయ విశ్వవిద్యాలయాల్లో హిందీలో చదివేవారు ఎవరు, విదేశీ విశ్వవిద్యాలయాల్లో ఇంగ్లిష్‌లో అధ్యయనం చేసేది ఎవరు? విదేశీ విశ్వవిద్యాలయాలు వేద విజ్ఞానం, గణితం, మానవ శాస్త్రాలను ‘ప్రపంచ’ నాగరికతా ఆధారాలుగా హిందీలో బోధిస్తాయా?

‘భారతీయ క్యాంపస్‌లో విదేశీ విశ్వవిద్యాలయం అందించే విద్యా నాణ్యత, దాని సొంత దేశంలోని ప్రధాన క్యాంపస్‌లో అందించే విద్యానాణ్యతకు సమానంగా ఉంటుందని హామీ ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే భారతీయ క్యాంపస్‌లోని విద్యార్థులకు అందించే విద్యాపరమైన అవార్డులు సొంతదేశంలోని ప్రధాన క్యాంపస్‌లోని ఉన్నత విద్యాసంస్థలు అందించే విద్యాపరమైన అవార్డులకు సరిసమానంగా



ఉండటమే కాకుండా ఆ మేరకు తగిన గుర్తింపును కూడా ఇవ్వాల్సి ఉంటుంది’ అని యూజీసీ చైర్‌పర్సన్ జగదీశ్ కుమార్ పేర్కొన్నారు. భారత్‌లో విదేశీ విశ్వవిద్యాలయాలకు స్వయం ప్రతిపత్తి గురించి కూడా ఆయన నొక్కి చెప్పారు. క్యాంపస్‌లో విద్యా కార్యక్రమాలు, మౌలిక వసతుల విషయంలో తప్ప, నిర్వహణాత్మక అంశంలో యూజీసీ నుంచి ఎలాంటి జోక్యం ఉండబోదని అన్నారు.

జాతీయ విద్య వర్సెస్ గ్లోబల్ విద్యతో దేశాన్ని కుల, వర్గ ప్రాతిపదికన మరింతగా విభజించాలని మోదీ ప్రభుత్వం కోరుకుంటున్నట్లయితే, భారతీయ యూనివర్సిటీలలో విద్యా నాణ్యత, పట్టభద్రుల ఉపాధి విషయం ఏమిటి? ఇదే జరిగితే, భారత్ మరోసారి తన అంధకార గతం వైపు వెళ్లిపోతుంది. శూద్రులు, ఇతర వెనుకబడిన వర్గాలు (ఓబీసీలు), దళితులు, ఆదివాసీలు ఆధునిక విద్యా సంస్థల్లో ప్రవేశం పొందలేరు. రిజర్వేషన్ ప్రయోజనాలు ఇకపై శూన్యమైపోతాయి. ఉత్పాదక వర్గాల పిల్లలకు కేంద్ర ప్రభుత్వం విద్యా భారతిని చూపిస్తుంది. ఇది ఆరెస్సెస్ నిర్వహించే పాఠశాలల నెట్‌వర్క్. ఇలాంటి విద్యా నమూనా ద్వారా ఘనమైన ప్రాచీన నాగరికతను భారతీయులు అనుసరించాలని ఆరెస్సెస్, బీజేపీ కోరుకుంటున్నాయి. అదే సమయంలో ఆధునిక ఉత్పత్తి, ఆధునిక విజ్ఞానశాస్త్రం, వనరుల పంపిణీ, సమానత్వం వంటివాటిని భారతీయేతరమైనవిగా ఇవి చూస్తున్నాయి. వర్ణవ్యవస్థ కేంద్రకంగా ఉన్న మానవ సంబంధాలు, ఆశ్రమాల్లో నివసించడమే సమాజ ఆదర్శాలుగా మారిపోతాయి.

అదే సమయంలో విదేశీ, భారతీయ ప్రైవేట్ పాఠశాలలు, యూనివర్సిటీలు దేశంలోని కులీన వర్గాల, పాలక వర్గాల పిల్లలకు హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, యేల్ యూనివర్సిటీల సిలబస్‌తో ఇంగ్లిష్‌లో బోధనను అందిస్తాయి. దీనివల్ల వీరు పాశ్చాత్య దేశాలతో వాటికి వెలుపలి ప్రపంచంతో కూడా కనెక్ట్ అవుతారు. వీరే నిజమైన విశ్వగురువులుగా లేదా ప్రపంచ నేతలుగా మారతారు.

ఈ రకమైన విభజన వల్ల మన దేశంలోని సెక్యులర్, లిబరల్ ద్విజులు పెద్దగా కోల్పోయేది ఏమీ ఉండదు. తమ పిల్లలకు హిందీ మీడియం విద్యా భారతి సిలబస్‌ను నేర్పరని వీరందరికీ స్పష్టంగా తెలుసు. బోధనా పద్ధతులపై, బోధనా శాస్త్రంపై వీరి విమర్శ అటు భాష, ఇటు విషయంపై అస్పష్టతతోనే ఉంటుంది. కానీ వీరు సమానతా విద్య గురించి వల్లిస్తుంటారు.

కాంగ్రెస్ పార్టీకి చెందిన విద్యావేత్తలు ఈ విద్యా నమూనాతో పోరాడరు. గతంలో పేలవమైన విద్యా విధానాలను రూపొందించింది వీరే మరి. దీనివల్లే శూద్రులు, ఓబీసీలు, దళితలు, ఆదివాసుల్లో ఇంగ్లిష్ విద్య పొందిన మేధావులు అతి కొద్ది సంఖ్యలో మాత్రమే ఉండిపోయారు. ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీ మేధావుల విషయానికి వస్తే ఈ విధమైన విద్యాపరమైన విభజన వారికి పెద్ద సమస్య కాదు. ఎందుకంటే పలువురు ముస్లిం విద్యార్థులు మదరసాల్లో, క్రిస్టియన్ విద్యార్థులు మిషనరీ స్కూల్స్‌లో చదువుకుంటూ ఉంటారు. మదరసాలు, క్రిస్టియన్ స్కూళ్లు అంతరిస్తున్నాయనుకోండి! మరోవైపున విద్యావకాశాలకు దూరమైన శూద్రులు, ఓబీసీలు కూడా ఈ సమస్యను పెద్దగా పట్టించుకోవడం లేదు. హిందూ సామ్రాట్ గుర్తింపుతో మొట్టమొదటి బీసీ ప్రధానిగా చెప్పుకొంటున్న నరేంద్ర మోదీ తమను చారిత్రక బానిసత్వం నుంచి బయటపడేస్తారని వీరిలో చాలామంది భావిస్తున్నారు. భారతీయ ప్రాంతీయ పార్టీలు కూడా ప్రజారాసులకు ఇంగ్లిష్ మీడియం విద్యను అందించడాన్ని సీరియస్‌గా తీసుకోలేదు. ఎందుకంటే అది వారి సొంత భాషా దురహంకారానికి వ్యతిరేకమవుతుంది. ఇక ఓబీసీ, దళిత సంస్థల విషయానికి వస్తే విద్యా నాణ్యత కంటే రిజర్వేషన్ లో తమ వాటా గురించే ఆందోళన చెందుతున్నాయి.

నిరంకుశమైన 2020 వ్యవసాయ సంస్కరణ చట్టాలను ఉపసంహరించుకునేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం ద్వారా వ్యవసాయ ప్రజా బాహుళ్యం చిన్న విజయం సాధించగలిగింది. కానీ ఆరెస్సెస్, బీజేపీ విద్యా కుట్రతో తమ పిల్లలు మరింత ప్రమాదంలో పడనున్నారని వీరు గుర్తించడం లేదు. ప్రజారాసుల పిల్లలను చేర్చుకుంటామని హామీ ఇవ్వకుండానే అనేక విదేశీ విశ్వవిద్యాలయాలు చాలావరకు ప్రజల భూములను కొనివేయబోతున్నాయి. రైతుల పిల్లల విద్యాపరమైన శక్తిసామర్థ్యాన్ని విచ్ఛిన్నపర్చడానికి పాలక వర్గాలు పథకం వేస్తున్నాయి. ఈ విధానాల ద్వారా వీరి భవిష్యత్తు అంధకారం కానుంది. ప్రభుత్వ రంగంలో మాత్రమే ఉంటున్న రిజర్వేషన్లు పొందుతున్నవారేమో ఒకసారి ప్రైవేటీకరణ పూర్తి శక్తితో ముందుకొచ్చాక న్యూనతతో బాధపడక తప్పదు.


వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ప్రమాదకారి



అత్యంత ప్రమాదకరమైన నాయకుడు ఎవరంటే– తాను శక్తిమంతంగా ఉండటానికి సమాచారాన్ని దాచిపెట్టేవాడు.

– అంకుర్ వారికూ, కంటెంట్ క్రియేటర్

పింఛన్ భారం



పనిలో ఉన్న ప్రభుత్వోద్యోగుల కంటే ఇండియాలో పింఛన్‌దారులు ఎక్కువున్నారు. పింఛన్‌దారులు: సుమారు 77 లక్షలు. సర్వీసులో ఉన్నవారు: 50–60 లక్షలు.

– రవిసుతాంజనీ కుమార్, ఆంట్రప్రెన్యూర్

ఇండియాకే ప్రాధాన్యం



గతేడాది యూకే 28,36,490 వీసాలు ఇచ్చింది. అందులో 25 శాతం ఇండియాకు వచ్చాయి. ఏ దేశానికైనా ఇదే అత్యధికం. భారతీయులు 2021 కంటే 73 శాతం అధిక స్టూడెంట్ వీసాలు అందుకున్నారు. 130 శాతం అధిక వర్క్ వీసాలు అందుకున్నారు.

– అలెక్స్ ఎల్లిస్, ఇండియాలో బ్రిటిష్ హైకమిషనర్

పనిలో ఉంటారు



రోల్స్ రాయ్స్ కంపెనీకి చెందిన ఒక మార్కెటింగ్ హెడ్ ఏమన్నాడంటే– “మేము వాణిజ్య ప్రకటనలను రూపొందించము: ఎందుకంటే మా లక్షిత ప్రేక్షకులు టీవీ చూస్తూ కూర్చోరు.”

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

ఇదేనా వికాసం?



జమ్మూలోని ఎన్నో గ్రామాల్లో ఆరింటి తర్వాత దుకాణాలు మూసేస్తున్నారు. వేర్వేరు ఉగ్రదాడుల్లో తొమ్మిది మంది హత్యకు గురయ్యాక స్థానికులు భయంతో బతుకుతున్నారు. ‘లోయ’కు వికాసం తెస్తామని ఓ వైపు బీజేపీ చెబుతోంది. కానీ 2014 నుంచీ జనాలు ఇదే భయంతో బతుకుతున్నారు.

– షమా మహమ్మద్, కాంగ్రెస్ జాతీయ ప్రతినిధి

అన్యాయం జరగదు



జనగాంకు చెందిన యువ డాక్టర్ ప్రీతి మరణం చాలా దురదృష్టకరం. అది మనకు మేలుకొలుపు కావాలి. అభివృద్ధి చెందుతున్న సమాజానికీ, పరిణత సమాజానికీ మధ్య తేడా ఏమిటంటే– రెండోదానిలో చట్టం తన పని తాను చేసుకుపోతుంది. బాధితులకు అన్యాయం జరగనివ్వదు. నిశ్చయంగా, అలాగే చేస్తుంది. ఆమె కుటుంబానికి సానుభూతి.

– స్మితా సభర్వాల్, తెలంగాణ ఉన్నతాధికారి

పెద్ద బరువు



మీరు పిల్లల్ని కనవద్దని ఎప్పుడైతే గట్టిగా అనుకుంటారో– అదింక మీ భుజాల మీద పెద్ద బరువును తొలగించుకున్నట్టు. భవిష్యత్ తరం కోసం భారీ మొత్తాన్ని కూడబెట్టాలన్నది ఊహించండి! పిల్లలే వద్దనుకుంటే ఈ ఒత్తిడి లేదు. మన వారసత్వం కొనసాగాలన్న పట్టింపు లేదు. అబ్బో... ఎంత రిలీఫో!

– శ్రుతి చతుర్వేది, ఆంట్రప్రెన్యూర్

ఇన్‌బాక్స్

అసలు కారకులు ఎవరు?

నల్లగొండ మహాత్మా గాంధీ యూనివర్సిటీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న నవీన్‌ను అతి కిరాతకంగా అతని స్నేహితుడు హరిహర కృష్ణ హత్య చేయడం తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టించింది. ఇద్దరూ పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారే. నవీన్, హరిహర కృష్ణ ఇద్దరూ ఇంటర్మీడియట్ చదివే నాటి నుండి స్నేహితులు. వారిద్దరూ ఒకే అమ్మాయిని ప్రేమించడం వల్ల జరిగిన గొడవ... హత్యకు దారి తీసిందనేది స్థూలంగా హత్యోదంతం సారాంశం. హత్య చేసింది హరిహరకృష్ణే అయినా... నిజానికి ఈ హత్యకు నేపథ్యాన్ని కలుగజేసింది ప్రభుత్వం, సమాజమే అని అర్థమవుతుంది.

తెలంగాణ రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం, గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో న్యూ ఇయర్ లాంటి వేడుకలకు టార్గెట్లు పెట్టి ప్రభుత్వమే మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తోంది. విద్యార్థులే లక్ష్యంగా విద్యాసంస్థల దగ్గర భారీగా చట్టవ్యతిరేకంగా గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఇంజనీరింగ్, మెడిసిన్ చదివే విద్యార్థులే లక్ష్యంగా డ్రగ్స్ ముఠాలు అమ్మకాలు జరుపుతున్నాయి.

నవీన్, హరిహర కృష్ణ –ఇద్దరూ గంజాయి లాంటి మత్తుమందులకు అలవాటు పడ్డారనీ, మద్యం సేవిస్తారనీ తెలిసింది. హత్యాఘటన సమయంలో ఇద్దరూ మద్యం సేవించిన సంగతి తెలిసిందే. అలాగే వీరిపై తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడమూ కనిపిస్తోంది. అంటే ప్రభుత్వం, తల్లిదండ్రులూ; ఇంటర్నెట్ ప్రపంచం... లాంటి మరెన్నో కారణాలూ నవీన్ హత్యకు కారణాలుగా పేర్కొనవచ్చు. ఇప్పటికైనా ప్రభుత్వం మాదక ద్రవ్యాల సరఫరాపై గట్టి నిఘాపెట్టి ఆపాలి. మద్యాన్ని ఆదాయ వనరుగా చూడటాన్ని తెలంగాణ ప్రభుత్వం మానుకోవాలి. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై ఒక కన్ను వేసి ఉంచాలి. ఇంటర్నెట్‌కు బానిసలు కాకుండా కాపాడుకోవాలి. వీటిలో ఏ ఒక్కటి జరక్కపోయినా మరింతమంది హంతక హరిహరకృష్ణలు పుట్టుకొస్తూనే ఉంటారు.

– పి. మహేష్, పీడీఎస్‌యూ తెలంగాణ అధ్యక్షులు

ఇది కదా హైదరాబాద్ అభివృద్ధి!

అభిప్రాయం



బచ్చు శ్రీనివాస్

తెలంగాణతో బంధం తెంచుకొని ముల్లె మూట సర్దుకొని ఏపీకి వెళ్లిన ‘ఫార్టీ ఈయర్స్ ఇండస్ట్రీ’ చంద్రబాబు నాయుడు తెలంగాణలో అడుగుపెట్టిన ప్రతీసారీ హైదరాబాద్‌ను నేనే డెవలప్ చేశానని బీరాలు పలుకుతుంటారు. ఆ మాటలు అబద్ధం. హైదరాబాద్ అభివృద్ధి అంటే ఎట్లుంటదో ఆయన ఇప్పుడు కండ్లు తెరుచుకొని చూస్తే అర్థమవుతుంది.

వైట్ హౌస్‌ను తలపించేలా సర్వహంగులతో నిర్మితమైన తెలంగాణ కొత్త సచివాలయాన్ని చూసి ఆయన ముక్కున వేలు ఏసుకోవాల్సిందే. గ్రౌండ్ ప్లస్ సిక్స్ ఫ్లోర్‌లతో కూడిన ఈ భవనం, భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా దాదాపు 100 ఏండ్లు నిలిచేలా ప్రభుత్వం నిర్మించింది. ఈ అద్భుతమైన కట్టడానికి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టడాన్ని యావత్తు భారత జాతి హర్షిస్తున్నది. సెక్రటేరిట్ సమీపంలో సమున్నతంగా 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని రూ. 147 కోట్లతో తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్నది. సామాజిక న్యాయ స్ఫూర్తికి ప్రతీకగా నిర్మిస్తున్న అంబేడ్కర్ మహానీయుని విగ్రహం మార్చి నాటికి పూర్తి కానుంది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన అమరుల త్యాగాలకు గుర్తుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న అమరవీరుల స్మారక చిహ్నం ప్రపంచంలోనే గొప్ప కట్టడంగా నిలువనున్నది.

ప్రపంచంలో అత్యంత నివాసయోగ్యమైన నగరంగా ఈరోజు హైదరాబాద్ ఉన్నది. అంతర్జాతీయ స్థాయిలో మౌలిక వసతులు.. ఆకాశాన్నంటే భవనాల్లో ఐటీ కంపెనీలు, విదేశాల తరహాలో స్కైవేలు, హరితహారంతో పరుచుకున్న పచ్చందాలు; ఓ మణిహారంలా విస్తరించిన ఔటర్ రింగు రోడ్డు... మొత్తంగా చారిత్రక నగరం హైదరాబాద్ సీఎం కేసీఆర్ పాలనలో ప్రణాళికాబద్ధంగా, శరవే



గంతో అభివృద్ధి చెందుతున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా దాదాపు 20 వరకు కొత్తగా ఫ్లై ఓవర్లు నిర్మించింది. దుర్గం చెరువుపై కేబుల్ బ్రిడ్జ్ నిర్మాణంతో ఓ ల్యాండ్ మార్క్‌ను క్రియేట్ చేసింది. వ్యూహాత్మక రహదారి అభివృద్ధి (ఎస్ఆర్డీపీ) పథకం హైదరాబాద్‌లో మంచి ఫలితాలు ఇస్తున్నది.

పారిశ్రామికాభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టి సులభతర పారిశ్రామిక అనుమతి విధానాలు అమల్లోకి తేవటంతో నగరానికి పెట్టుబడులు ప్రవాహంలా వస్తున్నాయి. టీ హబ్ నిర్మాణం... ఐటీ రంగంలో పెట్టుబడులు, ఆవిష్కరణల దిశను మార్చివేసింది. హైదరాబాద్‌లో రూ. 72,240 కోట్ల వ్యయంతో అమెజాన్, మైక్రోసాఫ్ట్, ఎయిర్‌టెల్ తదితర సంస్థలు డాటా సెంటర్‌లను ఏర్పాటు చేస్తున్నాయి.

జీనోమ్ వ్యాలీని నేనే నిర్మించానని చంద్రబాబు చెప్పుకొంటారు. జీనోమ్‌వ్యాలీ ప్రస్థానాన్ని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు, ఆ తర్వాత అని విభజించవచ్చు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ప్రభుత్వం ఎనిమిదిన్నరేండ్లలో ఏకంగా 20 బిలియన్ డాలర్లకుపైగా పెట్టుబడులను ఈ వ్యాలీ కోసం ఆకర్షించింది. దేశంలో లైఫ్ సైన్సెస్ రంగంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఆర్ అండ్ డీ, క్లీన్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లు మాత్రమే కలిగి ఉన్న ఏకైక క్లస్టర్ జీనోమ్‌వ్యాలీ మాత్రమే. ఇది ప్రత్యక్షంగా సుమారు 20 వేల మందికిపైగా ఉపాధి కల్పిస్తున్నది.

హైదరాబాద్‌పై చంద్రబాబు మార్క్ అంటే హైటెక్ సిటీనే. కానీ నేడు హైదరాబాద్ అంటే అద్భుత సెక్రెటేరియట్ భవనం గల సిటీ, భారీ అంబేడ్కర్ విగ్రహం ఉన్న నగరం, అమరవీరులకు నిత్యం జ్యోతిపడుతున్న ప్రాంతం, కేబుల్ బ్రిడ్జి, పోలీస్ వ్యవస్థ ఆధునికీకరణకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఉన్న ప్రాంతం, బన్సీలాల్‌పేట్ మెట్లబావి, నాలెడ్జ్ సిటీ, టీహబ్, మైండ్ స్పేస్ జంక్షన్... ఇలా ఎన్నో ఐకాన్స్ ల్యాండ్ మార్కులుగా ఉన్న మహా నగరం. అభివృద్ధికి నిజమైన అడ్రస్ ఇవ్వాల హైదరాబాద్.

వ్యాసకర్త బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు
మొబైల్: 93483 11117

రాజధర్మం

కురుక్షేత్ర సంగ్రామం ముగిసింది. వీరస్వర్గం పొందిన వీరులకు యథోచితంగా శ్రాద్ధ కర్మలు జరిపించాడు ధర్మరాజు. తిరిగి కోటకి వెళ్లిన ధర్మరాజులో వైరాగ్యం ప్రవేశించింది. తన తమ్ములను పిలిచి ‘ప్రియమైన వారి నెందరినో చంపగా వచ్చిన రాజ్యం నాకు అక్కరలేదు. మీరే పరిపాలించుకోండి. నేను అడవులకు వెళ్లి మునులతో కలసి జీవిస్తాను’ అని అన్నాడు. ఆ నిర్ణయాన్ని విరమించుకోమని శ్రీకృష్ణాది ముఖ్యులు, పాండవ సోదరులు విన్నవించారు. ఆ సమయంలో ధర్మరాజు నుద్దేశించి ద్రౌపది పలికిన మాటలకు చక్కని ప్రాముఖ్యమివ్వవచ్చు.

‘‘అరణ్య వాసం, అజ్ఞాత వాసం చేసే రోజుల్లో మీ తమ్ముళ్లను ఓదారుస్తూ ‘దుర్యోధనుడిని చంపి భోగాలను అనుభవిస్తూ, వినోద విహారాలు చేద్దామని’ ఊరడించిన విషయం గుర్తు లేదా? అనుకున్నట్టే శత్రువు మరణించాక వచ్చిన రాజ్యాన్ని త్యాగం చేసి, అడవులకు పోతాననడం సబబుగా ఉందా? లోకాన్ని రక్షించమనీ, దిక్పాలకుల అంశతో ప్రజల్ని పాలించమనీ రాజుని సృష్టించాడు బ్రహ్మ. అలాంటి రాజయిన మీరు ధైర్య స్థైర్యాలను పోగొట్టుకుని పిరికివాడిలా మాట్లాడడం ధర్మమా?

జ్యోతిర్మయం

విషం పెట్టడం, ఇల్లు తగలబెట్టడం, రాజకీయ రహస్యాలను బయట పెట్టడం, ఇతరుల సంపదలు దొంగిలించడం చేసినవారిని వధించినప్పుడే రాజు పుణ్యాత్ముడవుతాడు. రాజ దండన పేదలకు, సజ్జనులకు, వేదాలకు, దేవతలకు కూడా రక్షగా ఉండాలి. పాపాత్ములను శిక్షించడం రాజధర్మం అవుతుంది కానీ ముక్కు మూసుకుని జపం చేసుకోవడం రాజధర్మం కాదు.

కౌరవులంతా తమ పాపాలు పండి నశించారే కానీ వారి చావుకు మీరు కారకులు కారు. కాబట్టి రాజ్యలక్ష్మిని చేజిక్కించుకుని చక్కని పరిపాలన ప్రజలకు అందించండి’’ అని పలికింది.

ద్రౌపది మాటలు విజ్ఞతతో కూడి, వివేకం రేకెత్తించి ధర్మరాజు నిర్ణయాన్ని మార్చుకునేలా చేశాయి. స్త్రీ తలచుకుంటే ప్రళయాన్ని సృష్టించగలదనీ, భర్తకు ఉపదేశం చేసి దారి మార్చుకునేలా చేయగలదనీ ఆనాడే నిరూపించింది ద్రౌపది.

– నారంశెట్టి ఉమామహేశ్వరరావు

కుటుంబంలో స్పర్థలతోనే అలీఖాన్ ఆత్మహత్య?



- భార్యతో ఇంటి వివాదం
- వారం క్రితమే పిస్టల్ తెచ్చుకుని...
- అసదుద్దీన్ వియ్యంకుడి ఆత్మహత్యపై దర్యాప్తు ముమ్మరం

హైదరాబాద్: ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ వియ్యంకుడు మజారుద్దీన్ అలీఖాన్(60) ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటనపై బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సోమవారం మధ్యాహ్నం బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఎమ్మెల్యే కాలనీలో తన నివాసంలో రివాల్వర్‌తో కాల్చుకొని ఆయన మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆత్మహత్యకు గల కారణాలపై కుటుంబ సభ్యులతో పాటు ఆ ఇంట్లో పని చేస్తున్న సిబ్బందిని విచారిస్తున్నారు. మజారుద్దీన్‌కు రెండు లైసెన్స్‌డ్ తుపాకులు ఉండగా వీటిని గత డిసెంబర్‌లో బంజారాహిల్స్‌లోని గన్ అఫైర్స్‌లో డిపాజిట్ చేశారు. అయితే ఇందులో ఒక పిస్టల్‌ను తిరిగి వారం క్రితమే రిలీజ్ చేసుకొని ఇంటికి తెచ్చుకున్నట్లుగా తెలుస్తోంది.

భార్యతో ఇంటి వివాదం..: ప్రస్తుతం ఉన్న ఇల్లు ఆయన భార్య అఫియా రషీద్ అలీఖాన్ పేరు మీద ఉండగా ఈ ఇంట్లో తాను మాత్రమే ఉంటానని భర్తతో పాటు కొడుకు, కోడలును బయటికి పంపించాలంటూ ఆమె సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. నెలన్నర క్రితం తీర్పు కాపీతో బంజారాహిల్స్ పోలీసుల బందోబస్తు మధ్య ఆమె ఇంట్లోకి వెళ్లారు. కానీ ఇంట్లో ఉన్న వాళ్లెవరూ బయటకు వెళ్లలేదు. ఇక ఇంట్లోకి వెళ్లిన ఒకటి, రెండు రోజులకే గొడవలు తీవ్రమై ఆమె కత్తితో చెయ్యి కూడా కోసుకున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. ఈ ఇంటి వివాదంతో పాటు భార్యా భర్తల మధ్య తరచూ మనస్పర్థలు వచ్చేవని, కుమారుడు పూర్తిగా తండ్రికి మద్దతుగా ఉండే వాడని చెబుతున్నారు.

ఒక రౌండ్ కాల్పులు...
మజారుద్దీన్ తన పిస్టల్‌తో ఒక రౌండ్ కాల్పులు జరుపుకున్నట్లుగా పోలీసుల దర్యాప్తులో తేలింది. బుల్లెట్ కుడివైపు కణతి నుంచి ఎడమ వైపు మీదుగా బయటపడి ఆ గదిలోనే క్లూస్ టీమ్‌కు లభించింది. పోలీసుల దర్యాప్తునకు కుటుంబ సభ్యులు అంతగా సహకరించడం లేదని తెలుస్తోంది. మృతుడి సోదరుడు జహీరుద్దీన్ అలీఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేస్తున్నారు.

గోదావరి-కావేరి అనుసంధానానికి రూ. 39,275 కోట్లు!

సమగ్ర ప్రాజెక్టు నివేదికలో ఎన్‌డబ్ల్యూడీఏ అంచనా
- ప్రాజెక్టు మొత్తం పొడవు 1,211 కి.మీలు
- 3 రాష్ట్రాల్లో మొత్తం 5.73 లక్షల హెక్టార్ల ఆయకట్టుకు లబ్ధి
- తెలంగాణలో 2.38 లక్షల హెక్టార్లకు 34.43 టీఎంసీలు
- రాష్ట్ర తాగునీటికి 3 టీఎంసీలు, పరిశ్రమలకు 5.19 టీఎంసీలు
- టాస్క్‌ఫోర్స్ సమావేశం ఎజెండాలో వెల్లడించిన కేంద్రం... ఇక అనుమతుల ప్రక్రియ ప్రారంభిస్తామని ప్రకటన



సాక్షి, హైదరాబాద్: గోదావరి-కావేరి (జీ-సీ) నదుల అనుసంధానం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.39,274.92 కోట్ల వ్యయం కానుందని నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) అంచనా వేసింది. ఈ మేరకు ప్రాజెక్టు సవివర నివేదిక (డీపీఆర్)ను రూపొందించింది. ఈ ప్రాజెక్టులో భాగంగా గోదావరితో కృష్ణాను, కృష్ణాతో పెన్నాను, పెన్నాతో కావేరి నదులను అనుసంధానిస్తామని ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించింది. ప్రాజెక్టు మొత్తం పొడవు 1,211 కి.మీగా ఉండనుందని పేర్కొంది. నదుల అనుసంధానంపై కేంద్రం ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ మార్చి 6న హైదరాబాద్‌లోని జలసౌధలో సమావేశమై గోదావరి-కావేరి అనుసంధానంపై చర్చించనుంది. ఈ సమావేశానికి సంబంధించిన ఎజెండా నోట్‌లో ఈ విషయాలను ఎన్‌డబ్ల్యూడీఏ వెల్లడించింది. భాగస్వామ్య రాష్ట్రాల అభిప్రాయాల మేరకు డీపీఆర్‌లకు తుదిరూపు ఇచ్చామని, ఇక ఈ ప్రాజెక్టుకు అనుమతుల ప్రక్రియను ప్రారంభిస్తామని పేర్కొంది.

ఏ బేసిన్‌కు ఎంత వాటా?: గోదావరి బేసిన్‌లో మిగులు జలాల లభ్యత లేదని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఇప్పటికే తేల్చిచెప్పింది. గోదావరిలో ఛత్తీస్‌గఢ్ వాటాగా ఉన్న 283 టీఎంసీల నుంచి ప్రస్తుతం ఆ రాష్ట్రం వాడుకోని 141 టీఎంసీలనే తరలిస్తామని ఎన్‌డబ్ల్యూడీఏ పేర్కొంటోంది. 141 టీఎంసీల్లో 45.1 టీఎంసీలను కృష్ణా బేసిన్‌లో, 35.3 టీఎంసీలను పెన్నా బేసిన్‌లో, 38.7 టీఎంసీలను కావేరి బేసిన్‌లో, 9.8 టీఎంసీలను మలప్రభ సబ్‌బేసిన్‌లో వాడుకోనుండగా 10.1 టీఎంసీలను చెన్నై నగరానికి, 2.2 టీఎంసీలను పుదుచ్చేరికి తరలిస్తామని ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించింది. రాష్ట్రాలవారీగా చూస్తే తెలంగాణకు 42.6 టీఎంసీలు, ఏపీకి 41.8 టీఎంసీలు, తమిళనాడుకి 38.6 టీఎంసీలు, కర్ణాటకకు 9.8 టీఎంసీలు, పుదుచ్చేరికి 2.2 టీఎంసీలను కేటాయించనున్నారు.

రాష్ట్రంలో 2.38 లక్షల హెక్టార్ల ఆయకట్టు
గోదావరి-కావేరి అనుసంధానంతో తెలంగాణ, ఏపీ, తమిళనాడులో మొత్తం 3,98,490 హెక్టార్ల కొత్త ఆయకట్టుకు సాగునీరు లభించడంతోపాటు 1,75,407 హెక్టార్ల ఆయకట్టు స్థిరీకరణ జరగనుంది. మొత్తం 5,73,897 హెక్టార్లకు ప్రయోజనం కలగనుంది. తెలంగాణలో 9.46 టీఎంసీలతో 80 వేల హెక్టార్ల కొత్త ఆయకట్టును సృష్టించడంతోపాటు 24.96 టీఎంసీలతో 1,58,236 హెక్టార్ల ఆయకట్టు స్థిరీకరణ జరపనున్నట్టు ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదనలు పేర్కొంటున్నాయి. రాష్ట్రానికి మొత్తం 34.43 టీఎంసీలతో 2,38,236 హెక్టార్లకు ప్రయోజనం కలగనుంది. మరో 3 టీఎంసీలను తాగునీటి అవసరాలకు, 5.19 టీఎంసీలను పారిశ్రామిక అవసరాల కోసం రాష్ట్రానికి కేటాయించనున్నారు.

ఏపీలో 2.19 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు
ఏపీలో 31.39 టీఎంసీలతో 2,19,271 హెక్టార్ల కొత్త ఆయకట్టుతోపాటు 0.6 టీఎంసీలతో 2727 హెక్టార్ల స్థిరీకరణను ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించింది. మొత్తం 31.99 టీఎంసీలతో 2,21,998 హెక్టార్లకు ఏపీలో లబ్ధి కలగనుంది. తాగునీటి అవసరాలకు 4.2, పారిశ్రామిక అవసరాలకు 5.65 టీఎంసీలను ఆ రాష్ట్రానికి కేటాయించింది. తమిళనాడులో 13.13 టీఎంసీలతో 99,219 హెక్టార్ల కొత్త ఆయకట్టు, 3.67 టీఎంసీలతో 14,444 హెక్టార్ల ఆయకట్టు స్థిరీకరణను ప్రతిపాదించింది. 9.35 టీఎంసీలను ఆ రాష్ట్ర తాగునీటి, 12.46 టీఎంసీలను పారిశ్రామిక అవసరాలకు కేటాయించింది.

రూ.2817.62 కోట్లతో బెడ్తి-వార్దా అనుసంధానం
కర్ణాటకలోని బెడ్తి-వార్దా అనుసంధానం ప్రాజెక్టుకు రూ.2,817.62 కోట్ల అంచనాలతో డీపీఆర్‌ను సిద్ధం చేసినట్లు ఎన్‌డబ్ల్యూడీఏ పేర్కొంది. గోదావరి-కావేరి, బెడ్తి-వార్దా అనుసంధానికి మొత్తం రూ.42,092.54 కోట్లు కానుందని ఎజెండా నోట్‌లో పేర్కొంది. 52 కి.మీల బెడ్తి-వార్దా అనుసంధానంతో 18.5 టీఎంసీలను తరలించి 1.05 లక్షల హెక్టార్ల ఆయకట్టుకు సాగునీరు అందించనున్నట్టు పేర్కొంది.

నదులవారీగా అనుసంధానం, ఖర్చు (రూ. కోట్లలో)

నదులు	కి.మీ.	వ్యయం
గోదావరి-కృష్ణా	299	14,765.69
కృష్ణా-పెన్నా	393	9893.05
పెన్నా-కావేరి	519	14,616.18

పేట్ల బురుజు ఆస్పత్రికి ప్రత్యేక స్థానం

ఎంపీ సంతోష్ కుమార్.. ఆస్పత్రి అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు



సాక్షి, హైదరాబాద్: తాను జన్మించిన పేట్ల బురుజు ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ హామీ ఇచ్చారు. ఈ ఆస్పత్రి అభివృద్ధికి ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి రూ.కోటి వెచ్చిస్తానని గతంలో తానిచ్చిన హామీ మేరకు మొదటి విడతగా రూ.50 లక్షలు అందజేస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు రూ.50 లక్షలు మంజూరు ఉత్తర్వులను మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావుతో, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.మాలతికి అందజేశారు.

భార్య సమాధి పక్కనే భర్త బలవన్మరణం

- ఆరు నెలల క్రితం భార్య మృతి
- రెండు నెలల క్రితం రెండో పెళ్లి
- మొదటి భార్యను మరచిపోలేక ఆత్మహత్య
- జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఘటన



రోదిస్తున్న తల్లి, కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్) తాటి రాజు(ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: ఆరునెలల క్రితం భార్య చనిపోగా కుటుంబ సభ్యుల ఒత్తిడి మేరకు రెండో వివాహం చేసుకున్నాడు కానీ మొదటి భార్య జ్ఞాపకాలను మరిచిపోలేక ఆమెను సమాధి చేసిన వద్దనే పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో సోమవారం రాత్రి జరగగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. రైల్వేకాలనీకి చెందిన తాటి రాజు(40) భార్య జ్యోతి అనారోగ్యంతో 6 నెలల క్రితం చనిపోయింది. వీరికి 17 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. ఇరవై ఏళ్ల కాపురంలో ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. భార్య మృతిని తట్టుకోలేక తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. అతని పరిస్థితిని గమనించిన కుటుంబ సభ్యులు తోడు కావాలని నచ్చజెప్పి రెండు నెలల క్రితం గుంటూరుపల్లికి చెందిన యశోదతో వివాహం చేశారు. ఈ మధ్య తరచూ మొదటి భార్య గుర్తుకు వస్తోందంటూ తల్లి రాజ్యలక్ష్మికి చెప్పుకుని బాధ పడ్డాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఘన్‌పూర్‌లోని శ్మశానవాటికలో భార్యను ఖననం చేసిన వద్దకు చేరుకుని క్రిమిసంహార మందు తాగి బర్నింగ్ ప్లాట్‌ఫారంపై పడిపోయాడు. సోమవారం బయటకు వెళ్లిన రాజు మంగళవారం ఉదయం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అన్ని చోట్లా వెతికారు. అనుమానంతో శ్మశానవాటిక వద్దకు వెళ్లి చూసేసరికి అక్కడ నిర్జీవంగా పడి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాఘవేందర్ తెలిపారు.

పశుసంవర్థక అభివృద్ధికి మరింత కృషి

- గ్రాండ్ స్టార్టప్ సదస్సులో కేంద్రమంత్రి పురుషోత్తం రుపాలా
- పాడి పరిశ్రమ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి: మంత్రి తలసాని



సదస్సును ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి పురుషోత్తం రుపాలా. చిత్రంలో కేంద్ర మంత్రులు బాల్యన్, మురుగన్, రాష్ట్ర మంత్రి తలసాని

సాక్షి, హైదరాబాద్: పశుసంవర్థక రంగం మరింత అభివృద్ధి సాధించేలా కృషి చేస్తామని కేంద్ర మత్స్య, పశు సంవర్థక, పాడి పరిశ్రమల శాఖల మంత్రి పురుషోత్తం రూపాలా అన్నారు. రైతులు, పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కలిగించే ఈ రంగాన్ని లాభదాయకంగా మార్చడానికి కేంద్రం అన్ని వర్గాలతో కలిసి పనిచేస్తుందని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర పశుసంవర్థక శాఖ, నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డు, స్టార్టప్ ఇండియా, సీఐఐ సహకారంతో కేంద్ర పశుసంవర్థ, పాడి పరిశ్రమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రాండ్ స్టార్టప్ సదస్సులో మంత్రి మాట్లాడారు. వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న పాడిపరిశ్రమ అభివృద్ధితో రైతులు తమ ఆదాయాన్ని గణనీయంగా పెంచుకోవడానికి వీలవుతుందన్నారు. పశుసంవర్థక రంగంలో పెట్టుబడులు మరింత పెరగాలని అభిప్రాయపడ్డారు. కేంద్రమంత్రులు బాల్యన్, మురుగన్ మాట్లాడుతూ శాస్త్రీయ చర్యలతో పశుసంవర్థక రంగంలో మార్పులు తీసురావడం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రపంచ మాంసం ఎగుమతుల రంగంలో భారతదేశం 8వ స్థానం, గుడ్ల ఎగుమతుల రంగంలో 3వ స్థానంలో ఉందని వివరించారు.

గణనీయంగా పెరిగిన గొర్రెల సంపద
రాష్ట్ర పశుసంవర్థక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో పాడి రంగానికి అనేక విధాలుగా చేయూతనిస్తున్నామని అన్నారు. గొల్ల, కురుమలకు గొర్రెల యూనిట్ల పంపిణీ చేయడంతో రాష్ట్రంలో గొర్రెల సంపద గణనీయంగా పెరిగిందని తెలిపారు. గ్రామాల్లో అత్యధికులు పాడి పరిశ్రమ, జీవాల పెంపకంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, వారికి మరింత చేయూతనివ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ సోమా భరత్ కుమార్, షీప్ ఫెడరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజ్ యాదవ్, పశుసంవర్థక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అధర్ సిన్హా, ఇతర ఉన్నతాధికారులు వర్ష జోషి, రాజేష్ కుమార్ సింగ్, లచ్చిరాం భూక్యా, పెద్ద ఎత్తున పాడి రైతులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో మరిన్ని అంతర్జాతీయ సదస్సులు జరగాలి

హెచ్‌సీవీబీకి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సూచన

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ స్థాయి సదస్సులు, ప్రదర్శనలు హైదరాబాద్‌లో ముమ్మరంగా నిర్వహించటం ద్వారా అంతర్జాతీయ పర్యాటకానికి హైదరాబాద్ కేంద్రంగా మారేలా చర్యలు తీసుకుంటున్నట్లు పర్యాటక శాఖమంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం హైదరాబాద్ కన్వెన్షన్స్ విజిటర్స్ బ్యూరో (హెచ్‌సీవీబీ) సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్ బ్రాండ్‌కు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పెరిగేందుకు హెచ్‌సీవీబీ ద్వారా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ కేంద్రంగా మరిన్ని అంతర్జాతీయ స్థాయి సదస్సులు, ఎగ్జిబిషన్లు నిర్వహించేలా నిర్వాహకులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, హెచ్‌సీవీబీ సీఈఓ గ్యారీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా హబ్‌గా తెలంగాణ
దేశంలోనే అత్యుత్తమ క్రీడా పాలసీని తెలంగాణలో అమలు చేయబోతున్నామని, రాష్ట్రం క్రీడా హబ్‌గా రూపాంతరం చెందుతుందని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. 45 దేశాలకు పైగా పాల్గొంటున్న ఇంటర్నేషనల్ స్నూకర్స్ అండ్ బిలియర్డ్స్ చాంపియన్‌షిప్‌ను హైదరాబాద్‌లో నిర్వహించేందుకు చెన్నైకి చెందిన ఇంటర్నేషనల్ క్యూ స్పోర్ట్స్ సంస్థ సీఈవో ఆర్పీ గణేశ్, సీవోవో సుధాకర్ తదితరులు శ్రీనివాస్‌గౌడ్‌తో సమావేశమయ్యారు. చాంపియన్‌షిప్‌ను ఇక్కడ నిర్వహించేందుకు సహకారం అందించాలని మంత్రిని కోరారు. దీనికి క్రీడా శాఖ పూర్తి సహకారం అందిస్తుందని శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు.

కొత్తగా 18 కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మంగళవారం 4570 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో 18 మంది వైరస్ బారిన పడ్డారు. దీంతో రాష్ట్రంలో ఇప్పటి వరకు నమోదైన మొత్తం కరోనా కేసుల సంఖ్య 8.41 లక్షలకు చేరింది. ఒక్కరోజులో కరోనా నుంచి 13 కోలుకోగా, ఇప్పటి వరకు కోలుకున్నవారి సంఖ్య 8.37 లక్షలకు చేరింది. ప్రస్తుతం 95 మంది ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నట్లు ప్రజారోగ్య సంచాలకుడు శ్రీనివాసరావు వెల్లడించారు.

అంతా ఆమె కోసమే చేశాడా?

సహజీవనం బయటపడటంతోనేనా?
- కొన్నాళ్లుగా రిలేషన్‌షిప్‌లో నిందితుడు హరి, యువతి
- ఈ విషయమై నవీన్, హరిహరకృష్ణ మధ్య వివాదం
- నవీన్‌ను గొంతు నులిమి హత్య చేసిన నిందితుడు
- ఆపైన ఎవరూ గుర్తుపట్టకూడదనే శరీరం ముక్కలు
- హరి స్నేహితుడు హసన్‌ను విచారించిన పోలీసులు
- నవీన్ విషయాన్ని హరి దగ్గర దాచిపెట్టిన యువతి
- ఒకరికి తెలియకుండా ఒకరితో...యువతి పాత్రపై ఆరా



నిందితుడు హరిహరకృష్ణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఇంజనీరింగ్ విద్యార్థి నవీన్ హత్య కేసులో వాస్తవాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. హత్య చేసిన తర్వాత నిందితుడు హరిహర కృష్ణ బ్రాహ్మణపల్లిలోని స్నేహితుడు హసన్ ఇంటికి వెళ్లి, ఆ రోజు రాత్రి అక్కడే గడిపినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో పోలీసులు హసన్‌ను విచారించారు. హత్యకు ముందు పెద్ద అంబర్‌పేటలో మద్యం తాగి.. అబ్దుల్లాపూర్‌మెట్ శివారు ప్రాంతాలకు వచ్చిన తర్వాత హరి యువతితో సహజీవనం విషయాన్ని నవీన్‌కు తెలిపాడని, ఈ విషయమై ఇద్దరి మధ్య తగాదా జరిగిందని హరే తనతో చెప్పాడని హసన్ పోలీసులకు వివరించినట్లు తెలిసింది. "దీంతో ఇద్దరి మధ్య తగువులాట జరిగింది, గొడవ పెద్దది కావటం, అప్పటికే నవీన్‌ను హతమార్చాలని నిర్ణయించుకున్న హరి మద్యం మత్తులో నవీన్ గొంతు నులుమి హత్య చేశాడు. నవీన్ మరణించాడని నిర్ధారించుకున్న తర్వాత హరి పైశాచికత్వంతో శరీర భాగాలను వేరు చేయాలని భావించాడు.. నవీన్ మృతదేహాన్ని ఎవరూ గుర్తించకూడదనే ఉద్దేశంతోనే చేతి వేళ్లు, పెదాలు, గుండె, మర్మాంగాలను కత్తితో కోసి, ధ్వంసం చేసినట్లు హరి తనతో వివరించాడని" హసన్ పోలీసులకు తెలిపాడు.

యువతి సెల్‌ఫోన్‌లో కీలక ఆధారాలు..
ఈ కిరాతక హత్య కేసులో యువతి పాత్రపై పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. యువతి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు పలు కీలక ఆధారాలను గుర్తించినట్లు సమాచారం. హత్య అనంతరం హరి.. నవీన్ శరీర భాగాలను వేరు చేసే వీడియో, ఫొటోలను యువతికి పంపించినట్లు పోలీసులు గుర్తించారు. ఆయా భయానక దృశ్యాలను చూసిన యువతి అస్వస్థతకు గురైనట్లు సమాచారం. ఆయా వివరాలను తల్లిదండ్రులతో కూడా పంచుకున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా.. తొలుత నవీన్‌తో ప్రేమ వ్యవహారాన్ని నడిపిన యువతి.. కొన్నేళ్ల తర్వాత నవీన్‌ను దూరం పెట్టింది. ఆ తర్వాత నిందితుడు హరిహర కృష్ణతో రిలేషన్‌షిప్ కొనసాగించింది. అయితే ఈ వ్యవహారం నవీన్‌కు తెలియకపోవటంతో.. తరుచూ యువతికి ఫోన్ చేయడం, సందేశాలు పంపించేవాడని పోలీసుల విచారణలో బయటపడింది. నవీన్ వ్యవహారాన్ని హరితో యువతి చెప్పకుండా గోప్యంగా ఉంచినట్లు పోలీసులు గుర్తించారు. ఎందుకు గోప్యత పాటించింది? దురుద్దేశం ఏమైనా ఉందా అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. అయితే హరి, నవీన్‌లు అప్పటికే స్నేహితులు. యువతితో హరి కలిసి ఉన్న క్రమంలో అమ్మాయికి నవీన్ పదే పదే ఫోన్ చేస్తుండటాన్ని గమనించిన హరి.. నవీన్ బతికి ఉంటే ఎప్పటికైనా ఇబ్బందేనని, ప్రేమించిన అమ్మాయి దూరం అవుతుందనే అక్కసుతోనే ఇంతటి దారుణానికి ఒడిగట్టి ఉంటాడని ఓ పోలీసు అధికారి తెలిపారు.

హరిని కస్టడీకి కోరిన పోలీసులు
రంగారెడ్డి కోర్టులు: కేసును లోతుగా విచారించేందుకు నిందితుడు హరిని ఎనిమిది రోజుల పోలీసు కస్టడీకి కోరుతూ మంగళవారం రంగారెడ్డి జిల్లా ఎస్సీఎస్టీ ప్రత్యేక న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేయగా న్యాయస్థానం కేసుని బుధవారానికి వాయిదా వేసిందని ఏసీపీ శేరి ప్రతాప్ రెడ్డి తెలిపారు. నిందితుడితో సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేయవలసి ఉందని, హత్యకు సంబంధించి నిందితుడికి మరెవరైనా సహకరించారా అనే కోణంలో విచారణ జరపాల్సి ఉందని ఏసీపీ చెప్పారు. మృతుడి సెల్ ఫోన్ ఆచూకీ తెలుసుకోవడంతో పాటు నిందితుడి సెల్ ఫోన్ని కూడా స్వాధీనపర్చుకోవాల్సి ఉందని తెలిపారు.

క్లుప్తంగా...

బైడెన్ మళ్లీ పోటీ చేస్తారు: జిల్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మరోసారి ఆ పదవికి పోటీపడనున్నారు. ఆయన ర్య జిల్ బైడెన్ సీఎన్ఎన్ వార్తా సంస్థకు ఈ మేరకు తెలిపారు. 80 ఏళ్ల బైడెన్ ఇప్పటికే అమెరికా అధ్యక్షుల్లో అత్యంత వయోధికునిగా రికార్డు సృష్టించారు. రెండేళ్లలో జరగనున్న అధ్యక్ష ఎన్నికల్లో మరోసారి బరిలో దిగే ఆలోచన ఉందని ఆయన కూడా ఇప్పటికే పలు మార్లు చెప్పారు. సీఎన్ఎన్‌తో మాట్లాడుతూ జిల్ ఇదే విషయాన్ని గుర్తు చేశారు. ఆయన నిర్ణయానికి తాను పూర్తిగా మద్దతిస్తున్నట్టు తెలిపారు. రెండోసారి పోటీపై బైడెన్ బహుశా మరో రెండు మూడు నెలల్లో అధికారిక ప్రకటన చేస్తారని భావిస్తున్నారు. అయితే డెమొక్రటిక్ పార్టీ సహచరుల్లో ప్రధానంగా ఆయన వయసు పైనే అభ్యంతరాలు నెలకొన్నాయి. దీనిపై రాయిటర్స్–ఇప్సోస్ తాజాగా నిర్వహించిన పోల్‌లో బైడెన్ పోటీ చేయొద్దని డెమొక్రాట్లలో ఏకంగా 52 శాతం మంది అభిప్రాయపడ్డారు! మరోవైపు రిపబ్లికన్ పార్టీ తరఫున రెండోసారి అధ్యక్ష బరిలో దిగాలని ఉవ్విళ్లూరుతున్న మాజీ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్‌కు కూడా ప్రస్తుతం 76 ఏళ్లు! పైగా పార్టీ అభ్యర్థిత్వం కోసం నిక్కీ హేలీ తదితరులు ఇప్పటికే ఆయనకు పోటీదారులుగా ఉన్నారు.

సన్నిహితులే పుతిన్‌ను చంపేస్తారు: జెలెన్‌స్కీ

కీవ్: రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను సొంతవాళ్లే అంతమొందిస్తారని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ జోస్యం చెప్పారు. ఉక్రెయిన్‌పై యుద్ధానికి ఏడాది పూర్తయిన సందర్భంగా ఇయర్ పేరిట విడుదలైన డాక్యుమెంట్‌లో జెలెన్‌స్కీ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా అధినేత పుతిన్ నాయకత్వం బీటలు వారటం మొదలైందని, సన్నిహితులే ఆయనకు వ్యతిరేకులుగా మారతారని జెలెన్‌స్కీ అందులో తెలిపారు. 'రష్యాలో పుతిన్ పాలన ముగిసే క్షణం తప్పక వస్తుంది. చుట్టూ ఉండే మృగాలే ఆ మృగాన్ని చంపేస్తాయి. ఇది నిజంగా జరుగుతుందా? జరుగుతుంది. కానీ, ఎప్పుడో తెలియదు'అని జెలెన్‌స్కీ అన్నట్లు న్యూస్‌వీక్ పేర్కొంది. ఏడాదిగా ఉక్రెయిన్‌తో యుద్ధం సాగిస్తున్న పుతిన్ పట్ల అంతరంగికుల్లోనే అసహనం మొదలైందన్న వార్తల నేపథ్యంలో జెలెన్‌స్కీ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

సీగల్‌కు రష్యా ఫ్రెండ్‌షిప్ అవార్డు



మాస్కో: ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని సమర్థించిన హాలీవుడ్ యాక్షన్ స్టార్ స్టీవెన్ సీగల్ (70)కు రష్యా 'ఆర్డర్ ఆఫ్ ఫ్రెండ్‌షిప్' అవార్డు ప్రకటించింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు సీగల్ గట్టి మద్దతుదారు. 2014లో క్రిమియా ఆక్రమణను కూడా సమర్థించారు. 2016లో ఆయనకు రష్యా తమ దేశ పౌరసత్వం కూడా ఇచ్చింది. అంతేగాక పుతిన్ వ్యక్తిగతంగా సీగల్‌కు రష్యా పాస్‌పోర్టు అందజేశారు! 2018 నుంచీ అమెరికా, జపాన్ దేశాల్లో రష్యా విదేశాంగ శాఖ ప్రత్యేక రాయబారిగా కూడా సీగల్ పని చేస్తున్నారు. అమెరికా మాజీ విదేశాంగ మంత్రి రెక్స్ టిల్లర్సన్, ఫిఫా అధ్యక్షుడు గియానీ ఇన్ఫాంటినో తదితరులకు కూడా ఆర్డర్ ఆఫ్ ఫ్రెండ్‌షిప్ అవార్డు ప్రకటించారు.

భింద్రన్‌వాలే 2.0 అమృత్‌పాల్ సింగ్

'సిద్ధాంతానికి చావుండదు. మా సిద్ధాంతమూ అంతే'
'మా లక్ష్యాన్ని మేధోపరంగా, భౌగోళిక రాజకీయపరంగా చూడాలి'
'ఖలిస్తాన్ ఉద్యమాన్ని అడ్డుకుంటే ఇందిరకు పట్టిన గతే అమిత్ షాకూ పడుతుంది'

– ఇవీ... తనను తాను ఖలిస్తాన్ ఉద్యమ నాయకుడిగా ప్రకటించుకున్న అమృత్ పాల్ సింగ్ వ్యాఖ్యలు! ఏదైనా 'చేస్తా'నని బహిరంగంగా చెప్పి మరీ చేస్తున్నాడు. ఎవరితను? అతని సారథ్యంలో ఖలిస్తాన్ ఉద్యమం మళ్లీ చాప కింద నీరులా విస్తరిస్తోందా...?

అమృత్‌పాల్ సింగ్ రాకతో ఏడాదిగా ప్రత్యేక ఖలిస్తాన్ ఉద్యమ వాణి బలంగా మళ్లీ వినిపిస్తోంది. అచ్చం ఆపరేషన్ బ్లూ స్టార్‌లో మరణించిన కరడుగట్టిన ఖలిస్తానీ తీవ్రవాది భింద్రన్‌వాలే మాదిరిగా నీలం రంగు తలపాగా చుట్టుకొని, తెల్లటి వస్త్రధారణతో మాటల తూటాలు విసురుతూ యువతను ఉద్యమం వైపు ప్రేరేపిస్తున్నాడు. ఇటీవలి దాకా ఎవరికీ పెద్దగా తెలియని అమృత్‌పాల్ కేంద్రంపై తరచూ విమర్శలతో ఉన్నట్టుండి చర్చనీయాంశంగా మారిపోయాడు.

పంజాబ్‌లో బాహాటంగానే విస్తరిస్తున్న ఖలిస్తానీ ఉద్యమం

- అనుచరుని విడుదల కోసం పోలీస్‌స్టేషన్‌పైకే దండయాత్ర!
- అమిత్ షాకూ ఇందిరాగాంధీ గతి పట్టిస్తామంటూ హెచ్చరికలు
- ఆప్ ప్రభుత్వ మద్దతూ ఉందంటూ అనుమానాలు



భింద్రన్‌వాలే

ఎవరీ అమృత్‌పాల్

29 ఏళ్ల అమృత్ పాల్ సింగ్ గతేడాది దాకా దుబాయ్‌లోనే రవాణా వ్యాపారంలో ఉన్నాడు. సంప్రదాయాలకు అంత విలువనిచ్చేవాడు కాదు. కానీ నటుడు దీప్ సిద్ధూ స్థాపించిన 'వారిస్ పంజాబ్ దే'సంస్థ సభ్యుడు. 2022 ఫిబ్రవరిలో దీప్ సిద్ధూ రోడ్డు ప్రమాదంలో మరణించడంతో సంస్థను తన గుప్పిట్లోకి తీసుకున్నాడు. పంజాబ్‌కు తిరిగి వచ్చి, అణగారిన ఖలిస్తానీ ఉద్యమానికి తన మాటలు, చేతలతో మళ్లీ ఊపిరిలూదుతున్నాడు. హింసామార్గాన్నే ఎంచుకున్న అమృత్‌పాల్ అచ్చం పాకిస్తాన్ ఐఎస్ఐ తరహాలో ఉద్యమాన్ని నడిపిస్తున్నాడన్న ఆందోళనలున్నాయి.

ఏమిటీ ఖలిస్తాన్ ఉద్యమం?

ఖలిస్తాన్ అంటే పంజాబీలో పవిత్రమైన భూమి. సిక్కులకు ప్రత్యేక దేశమే కావాలంటూ 1940లో ఖలిస్తాన్ ఉద్యమం ప్రారంభమైంది. భారత్‌లో పంజాబ్‌ను తమ మాతృభూమిగా ప్రకటించాలంటూ సిక్కులు ఇప్పటిదాకా ఎన్నో ఉద్యమాలు నడిపారు. 1970–80ల్లో తార స్థాయికి వెళ్లిన ఈ ఉద్యమాన్ని ప్రధాని ఇందిరాగాంధీ ఆపరేషన్ బ్లూ స్టార్‌తో అణచివేశారు. ఏకంగా అమృత్‌సర్ స్వర్ణ దేవాలయాన్ని కేంద్రంగా చేసుకొని సమాంతర ప్రభుత్వాన్నే నడిపిన ఖలిస్తానీ నేత భింద్రన్‌వాలేను స్వర్ణ దేవాలయంలోకి చొచ్చుకెళ్లి మరీ సైన్యం హతమార్చింది. అలా చల్లబడ్డ ఉద్యమం ఇప్పుడు విస్తరిస్తున్నట్టు కనిపిస్తోంది. అమృత్ పాల్ కూడా స్వర్ణ దేవాలయం కేంద్రంగానే మరింత కాక రాజేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. స్వర్ణ దేవాలయంపై దాడిని నిరసిస్తూ ఇందిరను ఆమె సిక్కు అంగరక్షకులే బలిగొన్న తరహాలో అమిత్ షా తమ టార్గెట్ అంటూ బహిరంగంగా బెదిరింపులకు దిగుతున్నారు!

ఖలిస్తానీ శక్తులు పుంజుకుంటున్నాయా?



పోలీసులతో బాహాబాహీ

తన అనుచరుడు లవ్‌ప్రీత్ సింగ్‌ను ఓ కిడ్నాపింగ్ కేసులో పోలీసులు అదుపులోకి తీసుకుంటే అమృతసర్‌లో అమృత్ పాల్ సృష్టించిన భయోత్పాతాన్ని అంతా దిగ్భ్రమతో చూశారు. కత్తులు, కటార్లే గాక అధునాతన తుపాకులు కూడా చేతబట్టుకొని వేలాది మంది సిక్కులు పోలీసుస్టేషన్లోకి చొరబడటమే గాక ఏకంగా పోలీసులతో బాహాబాహీకి దిగారు. దాంతో పంజాబ్ ఆప్ ప్రభుత్వం అతనికి వ్యతిరేకంగా సాక్ష్యాలు లేవంటూ విడుదల చేసిన పరిస్థితి! ఈ ఘటనతో దేశమంతా ఉలిక్కిపడింది. అంతకుముందు సాగు చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఉద్యమం చేసినప్పుడు ఢిల్లీలో ధర్నా సందర్భంగా ఏకంగా చారిత్రక ఎర్రకోటపైనే ఖలిస్తాన్ జెండా ఎగురవేశారు! వీధుల్లో వీరంగం వేశారు. ఖలిస్తానీ శక్తులు బలం పుంజుకుంటున్నాయనడానికి ఇవన్నీ తార్కాణాలే. ఏడాది కాలం జరిగిన రైతు ఉద్యమం వెనకా ఖలిస్తానీ వేర్పాటు వాదుల హస్తమే ఉందంటారు. ఖలిస్తానీ ఉద్యమ పునాదులపై పుట్టిన అకాలీదళ్ పార్టీ బలహీనపడిపోతున్న తరుణంలో అమృత్‌పాల్ రూపంలో కొత్త గళం బలంగా వినిపించడం ప్రారంభమైంది.

కెనడా కనెక్షన్

కెనడా, ఆస్ట్రేలియా, బ్రిటన్ వంటి దేశాల్లో సిక్కు జనాభా ఎక్కువ. దాంతో ఆయా దేశాల్లో ఖలిస్తానీ ఉద్యమ ప్రభావం బాగా కనిపిస్తుంటుంది. అక్కడి హిందూ ఆలయాలపై, గణతంత్ర వేడుకలు జరుపుకునే వారిపై దాడులు పరిపాటిగా మారాయి. ప్రధాని మోదీని టార్గెట్ చేస్తూ ఖలిస్తాన్ ఉద్యమకారులు రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తూనే ఉంటారు. కెనడాలోనైతే సిక్కు జనాభా మరీ ఎక్కువ. ప్రభుత్వంలోనూ సిక్కుల ప్రాబల్యముంది. ప్రత్యేక ఖలిస్తాన్ కోసం ఖలిస్తాన్ ఉద్యమ సంస్థ సిక్స్ ఫర్ జస్టిస్ (సీఎఫ్‌జే) కెనడాలో ఏకంగా రిఫరెండం నిర్వహించగా లక్షకు మందికిపైగా సిక్కులు ఓటింగ్‌లో పాల్గొన్నారు! దీన్ని ఆపాలని మోదీ ప్రభుత్వం కోరినా కెనడా ప్రభుత్వం ఒప్పుకోలేదు. అది తమ చట్టాల ప్రకారం ప్రజాస్వామ్యయుతంగానే జరుగుతోందంటూ అనుమతినిచ్చింది. భారత్ నుంచి పంజాబ్‌ను విడదీసి ప్రత్యేక దేశంగా ఏర్పాటు చేయాలని ఏకంగా ఐక్యరాజ్యసమితికే విజ్ఞప్తి చేయడానికి ఖలిస్తాన్ మద్దతు సంఘాలు యూఎన్‌ను సంప్రదించనున్నాయి!

ఆప్ పాత్రపై అనుమానాలు



పంజాబ్‌లో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ ఖలిస్తానీ వేర్పాటువాదులకు అనుకూలంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలున్నాయి. పెచ్చరిల్లిన హింసాకాండ, కాల్చి చంపడాల నేపథ్యంలో గన్ లైసెన్సులపై ఇటీవల సంపూర్ణ సమీక్ష నిర్వహిస్తున్న పంజాబ్ పోలీసులు ఎవరి దగ్గర ఆయుధాలు, తుపాకులున్నా వెంటనే కేసులు పెడుతున్నారు. కానీ బాహాటంగా ఆయుధాలు చేబూని తిరుగుతూ భయోత్పాతానికి దిగుతున్న అమృత్‌పాల్, అతని అనుచరులపై ఇప్పటిదాకా ఒక్క కేసూ నమోదవలేదు! ఏకంగా కేంద్ర హోం మంత్రికే చంపేస్తామంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నా ప్రభుత్వ పెద్దలను బాహాటంగా బెదిరిస్తున్నా చూసిచూడనట్టు వదిలేస్తున్నారు. దీని వెనక రాజకీయ కారణాలున్నాయనే అభిప్రాయాలున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఘన విజయానికి ఖలిస్తాన్ శక్తులే తోడ్పాటు అందించినట్టు విశ్లేషణలున్నాయి. అందుకే ఇప్పుడు వారి ఆగడాలపై ఆప్ నోరు మెదపడం లేదంటూ విపక్షాలు దుయ్యబడుతున్నాయి. ఇక పంజాబ్‌లో మిలిటెంట్ కార్యకలాపాల్లో దోషులుగా తేలి 30 ఏళ్లుగా జైళ్లలో మగ్గుతున్న బందీ సింగ్ (సిక్కు ఖైదీ)ల విడుదల కోసం వారి మద్దతుదారులు వేలాదిగా రోడ్డెక్కి నిరసనలకు దిగుతున్నారు. ఇలా ఈ మధ్య ఖలిస్తాన్ వేర్పాటువాదులు ఏదో ఒక కార్యక్రమంతో నిత్యం వార్తల్లో నిలుస్తున్నారు.

-సాక్షి, నేషనల్ డెస్క్

దిగువ కోర్టుకు వెళ్లండి

బెయిల్ పిటిషన్‌పై సిసోడియాకు సుప్రీంకోర్టు సూచన

మంత్రి పదవులకు సిసోడియా, సత్యేంద్ర రాజీనామా



సిసోడియా, జైన్ (ఫైల్)

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో అరెస్టయిన ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాకు చుక్కెదురైంది. ఆయన పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌పై మంగళవారం విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. సిసోడియా తరఫున సీనియర్ న్యాయవాది ఏఎం సింఘ్వి వాదించారు. 'మద్యం విధానానికి సంబంధించిన నిర్ణయాలు వేర్వేరు దశల్లో జరిగాయి, ఈ కేసులో డబ్బు రికవరీ కూడా లేనందున డిప్యూటీ సీఎం సిసోడియాను అరెస్ట్ చేయాల్సిన అవసరం లేదు'అని అన్నారు. మద్యం విధానానికి సంబంధించి లెఫ్టినెంట్ గవర్నర్ కూడా భాగస్వామిగా ఉన్నారని చెప్పారు. అయితే, ఈ పిటిషన్‌ను ఆర్టికల్ 32 కింద విచారణకు స్వీకరించలేమని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహల ధర్మాసనం పేర్కొంది. 'ఢిల్లీలో ఘటన జరిగిందనే కారణంతో, సిసోడియా నేరుగా అత్యున్నత న్యాయస్థానానికి రాకూడదు. సమస్య పరిష్కారం కోసం ఢిల్లీ హైకోర్టుతోపాటు ఇతర దిగువ కోర్టులకు కూడా వెళ్లేందుకు ఆయనకు అవకాశముంది'అని ధర్మాసనం తెలిపింది. దీంతో సింఘ్వి బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. ఎక్సైజ్ పాలసీలో అవకతవకల ఆరోపణలపై నమోదైన కేసులో సిసోడియాను సీబీఐ సోమవారం 5 రోజుల కస్టడీకి తీసుకున్న విషయం తెలిసిందే.

ఆప్ సర్కారుకు ఎదురుదెబ్బ

ఢిల్లీలో సీఎం కేజ్రీవాల్ సారథ్యంలోని ఆప్ ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మంగళవారం రాష్ట్ర కేబినెట్‌లోని మనీశ్ సిసోడియా, సత్యేందర్ జైన్‌లు మంత్రి పదవులకు రాజీనామా చేశారు. వీరి రాజీనామాలను ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఆమోదించారు. సిసోడియా పోర్ట్‌ఫోలియోలను రెవెన్యూ మంత్రి కైలాశ్ గహ్లోత్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి రాజ్‌కుమార్ ఆనంద్‌లకు కేటాయించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఆరోగ్య, పరిశ్రమల శాఖలకు మంత్రిగా ఉన్న సత్యేందర్ జైన్ మనీలాండరింగ్ కేసులో గత ఏడాది మే నుంచి తిహార్ జైలులో ఉన్నారు. శాఖలేవీ లేకుండానే ఆయన మంత్రిగా కొనసాగుతున్నారు. జైన్ కున్న శాఖలను కూడా సీఎం కేజ్రీవాల్ డిప్యూటీ సీఎం కూడా అయిన సిసోడియాకే కేటాయించారు. దీంతో, ఢిల్లీ ప్రభుత్వంలోని 33 శాఖలకు గాను ఆర్థిక, తదితర 18 శాఖలను నిర్వహిస్తున్న సిసోడియా కేబినెట్‌లో అత్యంత కీలకంగా ఉన్నారు. మద్యం పాలసీ కేసులో ఆదివారం సీబీఐ సిసోడియాను కస్టడీలోకి తీసుకుంది. తాజాగా వీరిద్దరూ కేబినెట్ నుంచి వైదొలగడం ఆప్ ప్రభుత్వానికి పెద్ద దెబ్బగా భావిస్తున్నారు.

ముందే వైదొలిగి ఉండాల్సింది: బీజేపీ

ఆమ్ ఆద్మీ పార్టీ కమిషన్లు, అవినీతి పార్టీ అని బీజేపీ విమర్శించింది. అవినీతి ఆరోపణలు వెలుగులోకి వచ్చిన మొదట్లోనే సిసోడియా, జైన్‌లు మంత్రి పదవులకు రాజీనామా చేసి ఉండాల్సిందని పేర్కొంది.

ఐక్యరాజ్య సమితి చర్చల్లో నిత్యానంద 'యూఎస్‌కే' ప్రతినిధి



ఐక్యరాజ్యసమితి: వివాదాస్పద ఆధ్యాత్మిక గురువు నిత్యానంద స్థాపించిన దేశం 'కైలాస' ఐక్యరాజ్య సమితి చర్చల్లో పాలుపంచుకుంది. జెనీవాలో సుస్థిర అభివృద్ధి అంశంపై ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కుల కమిటీ ఈ నెల 24న చర్చా కార్యక్రమం ఏర్పాటు చేసింది. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ కైలాస ప్రతినిధినంటూ విజయప్రియ నిత్యానంద అనే మహిళ ఈ చర్చలో పాల్గొని, ప్రసంగించారు. హిందూ మతాన్ని, ఆచార సంప్రదాయాలను ప్రచారం చేస్తున్న నిత్యానందను భారతదేశం ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. ఆయనకు రక్షణ కల్పించాలని కోరారు. యూఎస్‌కే తరఫున ఇయాన్ కుమార్ అనే వ్యక్తి కూడా చర్చల్లో పాల్గొన్నారు. అత్యాచారం, అపహరణ కేసుల్లో అరెస్ట్ వారెంట్ జారీ చేయడంతో 2019లో నిత్యానంద దేశ విడిచి పారిపోయిన విషయం తెలిసిందే. అజ్ఞాతంలో ఉంటూనే ఈక్వెడార్‌కు సమీపంలోని ఓ దీవిని తన సొంత కైలాస దేశమని, 200 కోట్ల మంది హిందువులకు ప్రాతినిధ్యం వహిస్తుందని ప్రకటించారు. ఐరాస గుర్తింపు పొందాలంటే భద్రతా మండలి, సర్వప్రతినిధి సభ ఆమోదం ముందుగా అవసరం. 193 దేశాల జాబితాలో యూఎస్‌కే లేదు. అయితే, జెనీవా చర్చలో పాల్గొన ద్వారా ఐరాస గుర్తింపు లభించిందనే తప్పుడు అభిప్రాయం కల్పించేందుకు యూఎస్‌కే ప్రయత్నించిందని పరిశీలకులు అంటున్నారు.

2047 నాటికి 'అభివృద్ధి చెందిన భారత్'

- లక్ష్య సాధనకు ఆధునిక సాంకేతికత దోహదం
- ప్రజలందరికీ డిజిటల్ విప్లవ ప్రయోజనాలు
- టెక్నాలజీతో పలు రంగాల్లో పెనుమార్పులు
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడి



న్యూఢిల్లీ: 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుకోవాలన్న లక్ష్య సాధనకు ఆధునిక సాంకేతికత దోహదపడతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. డిజిటల్ విప్లవ ప్రయోజనాలు ప్రజలందరికీ దక్కేలా కృషి చేస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా భారీస్థాయిలో ఆధునిక డిజిటల్ మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. 'అన్‌లీషింగ్ ద పొటెన్షియల్: ఈజ్ ఆఫ్ లివింగ్ యూజింగ్ టెక్నాలజీ' పేరిట మంగళవారం నిర్వహించిన వెబినార్‌లో ప్రధాని మోదీ మాట్లాడారు. చిన్న తరహా పరిశ్రమలపై భారంగా మారిన నిబంధనలను తొలగించాలని భావిస్తున్నట్లు తెలిపారు.

టెక్నాలజీతో పేదలకు లబ్ధి

అన్ని రంగాల్లో ఆధునిక టెక్నాలజీ వినియోగం పెరుగుతోందని నరేంద్ర మోదీ వెల్లడించారు. 5జీ, కృత్రిమ మేధ(ఏఐ)పై ఇప్పుడు అంతటా చర్చ జరుగుతోందన్నారు. సాంకేతికతతో విద్య, వైద్యం, వ్యవసాయం వంటి రంగాల్లో పెనుమార్పులు రాబోతున్నాయన్నారు. ఒకే దేశం, ఒకే రేషన్‌తోపాటు జన్ ధన్ యోజన, ఆధార్, మొబైల్ నెంబర్(జేఏఎం)కు టెక్నాలజీయే ఆధారమని అన్నారు. దీనివల్ల పేదలకు లబ్ధి చేకూరుతోందని హర్షం వ్యక్తం చేశారు. సామాన్యులు ఎదుర్కొంటున్న సమస్యల్లో ఏఐ ద్వారా పరిష్కరించగలిగిన పదింటిని గుర్తించాలని నిపుణులకు సూచించారు. 21వ శతాబ్దాన్ని టెక్నాలజీ ముందుకు నడిపిస్తుందని, దీన్ని ఎవరూ ఆపలేరని వ్యాఖ్యానించారు. ఆధునిక సాంకేతికత పరిజ్ఞానంతో ప్రజల జీవనాన్ని సులభతరం చేయడానికి ప్రతి బడ్జెట్‌లోనూ పెద్దపీట వేస్తున్నామని మోదీ పేర్కొన్నారు. ప్రజా జీవితంలో ప్రభుత్వ జోక్యాన్ని తగ్గిస్తున్నామన్నారు. ప్రభుత్వాన్ని ఒక అవరోధంగా పరిగణించవద్దని ప్రజలకు సూచించారు.

దక్షిణాదిలో మార్చి ఎండలు తక్కువే!

- వాతావరణ శాఖ అంచనా
- లా–నినా పరిస్థితులు మారే అవకాశం
- రుతుపవనాల నాటికి ఎల్–నినో!



సాక్షి, హైదరాబాద్: హమ్మయ్య! ఈ నెలలో దక్షిణాది రాష్ట్రాలు కొంచెం నిశ్చింతగా ఉండవచ్చు. ఎందుకంటారా? దేశం మొత్తమ్మీద మార్చి నెలలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉండబోతున్నాయి. కానీ, దేశ ద్వీపకల్ప ప్రాంతంలో మాత్రం వేడి సాధారణం నుంచి అంతకంటే తక్కువ ఉండనుంది. భారతీయ వాతావరణ విభాగం (ఐఎండీ) ఈ విషయం తెలిపింది. అయితే ఈ ఏడాది ఫిబ్రవరి మాత్రం ఎన్నడూ లేనంతగా, స్పష్టంగా చెప్పాలంటే 1877 సంవత్సరం నుంచి ఇప్పటివరకూ అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన నెలగా రికార్డు సృష్టించింది. వేసవి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఐఎండీ మంగళవారం వర్చువల్ పద్ధతిలో విలేకరుల సమావేశం నిర్వహించింది. మార్చి నుంచి మే నెల వరకూ వేసవి తీరుతెన్నులపై తన అంచనాలను వెలువరించింది. దీని ప్రకారం.. మార్చిలో గరిష్ట ఉష్ణోగ్రతలు దేశ ఈశాన్య, తూర్పు, మధ్య ప్రాంతాలతోపాటు వాయువ్య ప్రాంతాల్లో కొన్ని చోట్ల సాధారణం కంటే ఎక్కువగా ఉండనున్నాయి. మిగిలిన ప్రాంతాలు అంటే.. దక్షిణాది రాష్ట్రాల్లో మాత్రం తక్కువగా ఉంటాయి. కనిష్ట ఉష్ణోగ్రతల్లోనూ ఈ తేడా స్పష్టంగా కనిపిస్తుంది. దక్షిణాది రాష్ట్రాలు మినహా మిగిలిన అన్నిచోట్ల రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయని ఐఎండీ తెలిపింది. మార్చి నుంచి మే నెల మధ్యభాగంలో దేశ మధ్య ప్రాంతం వడదానికి అనుకుని ఉండే వాయవ్య ప్రాంతాల్లో వడగాడ్పులు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉండనుంది. మార్చిలో దేశంలోని మధ్య ప్రదేశంలో వడగాడ్పుల ప్రభావం అంతగా ఉండకపోవచ్చు.

సాధారణ స్థాయిలోనే వర్షాలు..

మార్చి నెలలో వర్షపాతం కూడా దేశం మొత్తమ్మీద సాధారణంగానే ఉండనున్నట్లు ఐఎండీ తెలిపింది. దీర్ఘకాలిక అంచనాలతో పోల్చినప్పుడు ఈ నెల వర్షాలు 83 –117 శాతం మధ్యలో ఉంటాయని తెలిపింది. దేశ వాయవ్య ప్రాంతాల విషయానికి వస్తే అక్కడ సాధారణం కంటే తక్కువ స్థాయి వర్షాలు నమోదు కావచ్చునని, సెంట్రల్ ఇండియా పశ్చిమ దిక్కున, ఈశాన్య, తూర్పు భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి ఉంటుందని వివరించింది. దేశ ద్వీపకల్ప ప్రాంతంలో మార్చి నెల వానలు సాధారణం లేదా అంతకంటే ఎక్కువ స్థాయిలో ఉంటాయని తెలిపింది.

ఎల్‌నినో, లానినాలపై ఇప్పుడే చెప్పలేం

ఈ ఏడాది రుతుపవనాల పరిస్థితులపై స్పష్టంగా చెప్పడం ప్రస్తుతానికి వీలుకాదని ఐఎండీ తెలిపింది. ''పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలోని ఉపరితల జలాల ఉష్ణోగ్రతల దృష్ట్యా లానినా పరిస్థితులున్నాయి. రానున్న రోజుల్లో ఇది బలహీనపడి ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడే అవకాశం కనిపిస్తోంది'' అని వివరించింది. రుతుపవనాల సీజన్‌కు ముందు ఈ పరిస్థితులు ఏర్పడవచ్చంది. అంతేకాకుండా... రుతుపవనాలపై ప్రభావం చూపగల హిందూ మహాసముద్ర ఉపరితల జలాల ఉష్ణోగ్రతలు కూడా సాధారణ స్థితిలోనే ఉండే అవకాశమున్నట్లు చెప్పారు.

హాలీవుడ్ సినిమాలు చూస్తే జైలుకే

సియోల్: హాలీవుడ్, ముఖ్యంగా దక్షిణ కొరియా సినిమాలు, టీవీ కార్యక్రమాల ప్రభావాన్ని తగ్గించేందుకు ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ కఠిన చర్యలను ప్రకటించారు. పిల్లలు హాలీవుడ్ సినిమాలు చూస్తున్నారని తెలిస్తే వారి తల్లిదండ్రుల్ని ఆరు నెలలపాటు నిర్బంధ లేబర్ క్యాంపులకు తరలిస్తామని హెచ్చరించారు. అంతేకాదు, సదరు పిల్లలు ఏకంగా ఐదేళ్ల జైలు శిక్ష అనుభవాల్సి ఉంటుందని కూడా ప్రకటించారని మిర్రర్ పత్రిక పేర్కొంది. దక్షిణ కొరియా పౌరుడిలా కనిపించాలని చూసినా 6 నెలల జైలు జీవితం తప్పదని పేర్కొంది. గతంలో ఈ నేరాలకు పాల్పడిన వారిని గట్టి హెచ్చరికలతో వదిలేసేవారు. తాజాగా, ప్రభుత్వం ఇన్మిబన్ అనే కార్యక్రమాన్ని ప్రకటించిందని మిర్రర్ తెలిపింది. అంటే ప్రతి ఒక్కరూ తమ పక్క ఇళ్లలో ఏం జరిగే వాటిపై ఓ కన్నేసి ఉంచాల్సి ఉంటుంది. డ్యాన్సులు, పాటలు పాడటం, మాట్లాడటంపైనా కిమ్ ప్రభుత్వం ఆంక్షలు విధించింది.

కెనడాలోనూ టిక్‌టాక్‌పై నిషేధం

అదే బాటన డెన్మార్క్?

టొరంటో: చైనాకు చెందిన టిక్‌టాక్‌పై కెనడా నిషేధం విధించింది. ప్రభుత్వం జారీ చేసిన మొబైల్ పరికరాలు వేటిలోనూ దాన్ని వాడకూడదని పేర్కొంది. ప్రభుత్వోద్యోగులెవరూ దీన్ని వాడొద్దని ఆదేశించింది. ప్రైవసీకి, భద్రతకు ఈ యాప్ వల్ల చాలా రిస్కుందని కెనడా చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ నిర్ధారించినట్టు ట్రెజరీ బోర్డ్ ప్రెసిడెంట్ మోనా ఫోర్టియర్ తెలిపారు. ఇది ప్రారంభమేనని, ముందు మరిన్ని చర్యలుంటాయని ప్రధాని జస్టిన్ ట్రూడో చెప్పారు. డెన్మార్క్‌లో ప్రభుత్వ మొబైళ్ల తదితరాల్లో టిక్‌టాక్‌ను నిషేధించాలని పార్లమెంటు పేర్కొంది.

అమెరికాలోనూ...

అమెరికా నెల రోజుల్లోపు ప్రభుత్వ మొబైళ్లు తదితర పరికరాల్లో నుంచి టిక్‌టాక్‌ను పూర్తిగా తొలగించాలని ఆదేశించింది. సమాచార భద్రత నిమిత్తమే ఈ చర్య తీసుకుంటున్నట్టు పేర్కొంది. అమెరికాలో సగానికి పైగా రాష్ట్రాలు ప్రభుత్వోద్యోగులను టిక్‌టాక్ వాడొద్దని ఇప్పటికే ఆదేశించాయి. అంతేగాక దేశమంతటా దాని వాడకాన్ని నిషేధించే అధికారాన్ని అధ్యక్షుడు జో బైడెన్‌కు కట్టబెట్టేందుకు ఉద్దేశించిన బిల్లును రిపబ్లికన్లు మంగళవారం ప్రతినిధుల సభలో ప్రవేశపెట్టనున్నారు. అమెరికా టీనేజర్లలో మూడింట రెండొంతులు టిక్‌టాక్ యూజర్లే! యూరోపియన్ యూనియన్ కార్యనిర్వాహక విభాగం కూడా సైబర్ సెక్యూరిటీ చర్యల్లో భాగంగా తమ ఉద్యోగులు టిక్‌టాక్ వాడటంపై గత వారమే తాత్కాలిక నిషేధం విధించింది. బైట్‌డ్యాన్స్ అనే చైనా కంపెనీకి చెందిన ఈ యాప్ ప్రపంచవ్యాప్తంగా యువతను ఎంతో ఆకట్టుకోవడం తెల్సిందే.

పులులకు 'ఎండదెబ్బ'

- పదేళ్లలో 1,062 పులుల మృత్యువాత
- వాటిలో వేసవి మరణాలే 348
- సంరక్షణకు చర్యలు తీసుకోండి
- రాష్ట్రాలకు కేంద్రం ఆదేశాలు



తస్మాత్ జాగ్రత్త

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో పెరుగుతున్న పులుల మరణాలు కలవర పరుస్తున్నాయి. ఈ ఏడాది రెండు నెలల్లోనే 34 పులులు మరణించాయి. ముఖ్యంగా ఎండాకాలం వాటి పాలిట మృత్యువుగా మారుతోంది. గత పదేళ్ల గణాకాలు కూడా అదే చెబుతున్నాయి. మార్చి నుంచి మే చివరి వరకు పులుల మరణాల సంఖ్య భారీగా ఉంటోంది. దాంతో ఈ వేసవిలో పులుల సంరక్షణ కోసం తక్షణ చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు జారీచేసింది.

2012–2022 మధ్య పదేళ్లలో దేశవ్యాప్తంగా 1,062 పులులు మరణించినట్లు నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ గణాంకాలు చెబుతున్నాయి. అత్యధికంగా మధ్యప్రదేశ్‌లో 270, మహారాష్ట్రలో 184, కర్ణాటకలో 150 పులులు మరణించాయి. ఆంధ్రప్రదేశ్‌లో 11, తెలంగాణలో తొమ్మిది పులులు మృత్యువాత పడ్డాయి. 2020లో 106, 2021లో 127, 2022లో 121 పులులు మరణించాయి. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిల్లోనే 34 ప్రాణాలు కోల్పోవడం విషాదం. వీటిలో మధ్యప్రదేశ్‌లో 9, మహారాష్ట్రలో 8 మరణాలు సంభవించాయి. గడిచిన పదేళ్ల రికార్డులు చూస్తే మార్చిలో 123, ఏప్రిల్‌లో 112, మేలో 113 మరణాలు నమోదయ్యాయి. అంటే పదేళ్లలో వేసవిలో ఏకంగా 348 పులులు చనిపోయాయి!

ఈ వేసవిలో ఉష్ణోగ్రతలు 50 డిగ్రీలు దాటొచ్చన్న అంచనాల నేపథ్యంలో పులుల సంరక్షణకు వెంటనే చర్యలు చేపట్టాలని రాష్ట్రాలకు కేంద్రం సూచించింది. రాత్రిళ్లు అభయారణ్యాల్లో సఫారీలను ఆపేయండి. అక్రమ నిర్మాణాలపై నిఘా పెంచండి'' అని పేర్కొంది.

వేసవిలో పులుల మరణాలకు ఇవీ కారణాలు...

- ఎండాకాలంలో నీరు, ఆహారం కోసం తమ ఆవాసాలను దాటి దూరంగా రావడం
- అభయారణ్యాలనుంచి బయటకు వచ్చేయడం
- ఆహారం కోసం పులుల మధ్య పోరాటాలు
- అడవుల్లో పచ్చదనం తగ్గడం, బఫర్ జోన్‌లు లేకపోవడం
- అటవీ భూముల నరికివేత, సమీప ప్రజల్లో అడవి జంతువులపై అసహనం, భయంతో కొట్టి చంపడం

రష్యాపై డ్రోన్ల వర్షం

- నిఘా విమానం ధ్వంసం
- మరో విమానానికి భారీ నష్టం
- మాస్కో సమీపంలోనూ దాడులు
- ఉక్రెయిన్ పనే: రష్యా

కీవ్: డ్రోన్ దాడులతో రష్యా ఉక్కిరిబిక్కిరైంది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం దాకా ఎడతెరిపి లేకుండా జరిగిన దాడుల్లో దేశంలో పలుచోట్ల మౌలిక సదుపాయాలకు స్వల్ప నష్టం వాటిల్లింది. ఇంతకాలం ఉక్రెయిన్ సరిహద్దుల సమీపానికే పరిమితమైన దాడులు ఏకంగా రాజధాని మాస్కో సమీపం దాకా చొచ్చుకొచ్చాయి. ఒక డ్రోన్ మాస్కోకు 100 కిలోమీటర్ల దూరంలో విధ్వంసం సృష్టించింది! పలు డ్రోన్లను రష్యా పేల్చేసింది. మరోవైపు హాకింగ్ దెబ్బకు రష్యా టీవీ, రేడియో ప్రసారాలకు చాలాసేపు అంతరాయం కలిగింది. డ్రోన్ల కలకలంతో సెయింట్ పీటర్స్‌బర్గ్ విమానాశ్రయాన్ని గంటలపాటు మూసేయాల్సి వచ్చింది! ఈ దాడులన్నీ ఉక్రెయిన్ పనేనంటూ రష్యా మండిపడింది. తమపై రష్యా పూర్తిస్థాయి యుద్ధానికి దిగిన నేపథ్యంలో ఎలాంటి దాడులకైనా పాల్పడే హక్కు తమకుందంటూ ఉక్రెయిన్ నర్మగర్భ వ్యాఖ్యలతో సరిపెట్టింది. రష్యా మిత్రదేశమైన బెలారస్‌లో ఓ వైమానిక స్థావరంపై జరిగిన డ్రోన్ దాడుల్లో రూ.2,737 కోట్ల విలువైన రష్యా నిఘా విమానంతో పాటు మరో సైనిక రవాణా విమానం, పలు వాహనాలు దెబ్బ తిన్నట్టు చెబుతున్నారు. ఇది స్థానిక ఉక్రెయిన్ మద్దతుదారుల పనేనని అనుమానిస్తున్నారు.

కుక్క కాటుకు వెయ్యి కుట్లు

▶ మొదటి పేజీ తరువాయి

దూరంగా తరిమేసింది. లిలీ తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే ఆమెను స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు చేతులెత్తేయడంతో బోస్టన్‌లోని మరో హాస్పిటల్‌లో చేర్చారు. చికిత్సకు చాలా డబ్బు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పడంతో లిలీ కుటుంబ మిత్రుడొకరు సోషల్ మీడియాలో 'గోఫండ్‌మీ' పేరిట పేజీని ఏర్పాటు చేసి, నిధులు సేకరించాడు. వైద్యులు లిలీకి చికిత్స పూర్తిచేశారు. ముఖంపై వెయ్యికిపైగా కుట్లు వేశారు. తన బిడ్డ దుస్థితిని చూసి శోకాన్ని ఆపుకోవడానికి తాను చాలా కష్టపడాల్సి వచ్చిందని లిలీ తల్లి డోరోతీ నార్టన్ చెప్పారు. లిలీ ముఖంలో కండరాలన్నీ దెబ్బతిన్నాయని, ఇప్పట్లో మాట్లాడలేదని, కనీసం నవ్వలేదని డాక్టర్లు వెల్లడించారు. పూర్తిగా కోలుకోవడానికి చాలా సమయం పడుతుందని అన్నారు.

సాక్షి
హైదరాబాద్
బుధవారం, 1, మార్చి, 2023



దంపతుల 'రాయల్' దందా!

హష్ ఆయిల్‌తో తయారైన రాయల్ బ్రాండ్ చాక్లెట్లు విక్రయిస్తున్న దంపతులతో పాటు సరఫరా చేసిన వ్యక్తినీ హెచ్–న్యూ అధికారులు పట్టుకున్నారు. -8లో



వాట్సాప్‌లో వివరాలు.. కొరియర్‌లో సర్టిఫికెట్లు

నకిలీ సర్టిఫికెట్ల దందాకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. -8లో

పరిశోధన సంచాలకులుగా వెంకటరమణ

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులుగా ఎం.వెంకటరమణను నియమిస్తూ అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు పరిశోధన సంచాలకులుగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ జగదీశ్వర్ పదవీ విరమణ చేయడంతో కొత్త పరిశోధన సంచాలకులుగా వెంకటరమణను నియమించారు.

న్యూస్‌రీల్

భార్య మృతిని తట్టుకోలేక భర్త ఆత్మహత్య

భరత్ కుమార్

బంజారాహిల్స్: భార్య మృతిని తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. టీఎస్‌ఆర్టీసీలో మెకానిక్‌గా పని చేస్తున్న సింప భరత్ కుమార్ (35) ఏడేళ్ల క్రితం మమతను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు. యూసుఫ్‌గూడ సమీపంలోని కార్మికనగర్‌లో నివసించే భరత్ కుమార్ గత జనవరి 31న భార్య మమతతో కలిసి బైక్‌పై వెళ్తుండగా భరత్‌నగర్ బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే చనిపోయింది. ఈ ఘటనలో భరత్‌కుమార్‌తో పాటు పిల్లలు క్షేమంగా బయటపడ్డారు. భార్య మరణాన్ని జీర్ణించుకోలేక కొంత కాలంగా భరత్ కుమార్ తీవ్ర మనస్తాపానికి గురవుతున్నాడు. మంగళవారం గదిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య మరణంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లుగా మృతుడి సోదరుడు రమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏసీబీకి చిక్కిన కీసర విద్యుత్ ఏఈ

అనిల్‌కుమార్

కీసర: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు కోసం కాంట్రాక్టర్ నుంచి రూ.12 వేలు లంచం తీసుకుంటూ కీసర విద్యుత్ ఉపకేంద్రం అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) అనిల్‌కుమార్ ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఏసీబీ అధికారుల కథనం ప్రకారం వివరాలు.. కీసరలోని విద్యుత్ ఉపకేంద్రంలో అనిల్‌కుమార్ ఏఈగా పని చేస్తున్నాడు. చీర్యాలలో ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ బాల్ నర్సింహ ఇటీవల 63 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు చేపట్టాడు. పని పూర్తయ్యాక ఏఈ అనిల్‌కుమార్ పరిశీలించి నివేదిక ఇస్తే కాంట్రాక్టర్‌కు డబ్బులు వస్తాయి. నివేదిక ఇచ్చేందుకు ఏఈ అనిల్‌కుమార్ కాంట్రాక్టర్ బాల్‌నర్సింహ నుంచి రూ.15 వేలు డిమాండ్ చేశాడు. చివరకు రూ.12 వేలకు ఒప్పందం కుదిరింది. మంగళవారం కీసరలోని తన కార్యాలయంలో నేరుగా కాంట్రాక్టర్ బాల్ నర్సింహ నుంచి రూ.12 వేలు తీసుకుంటడగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అల్వాల్‌లోని అతని ఇంటిలో సైతం సోదాలు నిర్వహించినట్లు ఏసీబీ డీఎస్పీ సూర్యనారాయణ తెలిపారు. నిందితుడిని బుధవారం ఏసీబీ కోర్టులో అప్పగించి చంచల్‌గూడ జైలుకు తరలిస్తామన్నారు.

పహాడీషరీఫ్‌లో పండ్ల మార్కెట్

పహాడీషరీఫ్: శ్రీశైలం ప్రధాన రహదారిపై ఉన్న పహాడీషరీఫ్‌లో త్వరలో నూతన పండ్ల మార్కెట్ కొలువుదీరనుంది. కోహెడ మార్కెట్ ఇంకా ప్రారంభం కాకపోవడం.. బాటసింగారంలో ఏర్పాటు చేసిన మార్కెట్ వ్యాపారులకు దూరంగా ఉండడంతో పహాడీషరీఫ్‌లో ప్రత్యామ్నాయ హోల్‌సేల్ మార్కెట్ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. పనులు సైతం చురుగ్గా కొనసాగుతున్నాయి. మామిడి సీజన్ ప్రారంభం, రంజాన్ మాసం తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని వచ్చే నెలలో మార్కెట్‌ను ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు.

పథకాల అమలును పరిశీలించిన ట్రైనీ ఐఏఎస్‌లు

సాక్షి, సిటీబ్యూరో: ముసోరీ ఐఏఎస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ట్రైనీ ఐఏఎస్ అధికారులు జీహెచ్‌ఎంసీలో అమలవుతున్న వివిధ పథకాల గురించి తెలుసుకునేందుకు మంగళవారం వచ్చారు. జీహెచ్‌ఎంసీలోని శానిటేషన్, యూసీడీ, యూబీడీ, అర్బన్ హౌసింగ్, ఇంజినీరింగ్ తదితర విభాగాల్లో జరుగుతున్న ఆయా కార్యక్రమాల గురించి కమిషనర్‌తోపాటు ఆయా విభాగాల అడిషనల్ కమిషనర్లు ట్రైనీ ఐఏఎస్ అధికారులకు వివరించారు.





ప్రకృతి రమణీయతకు ఆటపట్టు. సాంస్కృతిక సౌరభాలకు నెలవు. కళలకు కాణాచి. గ్లోబల్ వెడ్డింగ్ డెస్టినేషన్‌కు కేరాఫ్ అడ్రస్ కేరళ. హైదరాబాదీలు వారి వేడుకలకు గమ్యస్థానంగా కేరళను ఎంచుకుంటున్నారు. ఆ రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని ది పార్క్ హోటల్ వేదికగా ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కథాకళి, కత్తి యుద్ధం తదితర సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. - సాక్షి, సిటీబ్యూరో

కుక్కలున్నాయి జాగ్రత్త!

బెడదను అరికడదాం.. దాడులను నిలువరిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్

- కుక్కకాటు ఘటనలు పునరావృతం కానివ్వకుండా చూస్తాం
- ఇందుకోసం ప్రత్యేకంగా ఓ కమిటీని వేస్తాం
- ఇక ప్రతియేటా కుక్కల గణన
- స్టెరిలైజేషన్లకు మానిటరింగ్ కమిటీ
- అంబర్‌పేట కుక్కకాటు బాధిత బాలుడి కుటుంబానికి పరిహారం
- కార్పొరేటర్లు, స్వచ్ఛంద సంస్థలతో సమావేశం

సాక్షి, సిటీబ్యూరో: వీధికుక్కల బారి నుంచి ప్రజలను కాపాడేందుకు స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, జంతు ప్రేమికులు ముందుకు రావాలని మేయర్ విజయలక్ష్మి కోరారు. కుక్కల బెడద నివారణపై జీహెచ్‌ఎంసీలో ఒక్కో పార్టీ నుంచి ముగ్గురు కార్పొరేటర్లతో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వెటర్నరీ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వీధి కుక్కల నివారణకు శానిటేషన్ వర్కర్ల నుంచి ఏఎంఓహెచ్‌లు, డీసీలు, కార్పొరేటర్ల వరకు అందరికీ బాధ్యత ఉంటుందన్నారు. కుక్కకాటు ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేకంగా అఖిలపక్ష కమిటీ వేస్తామని సభ్యుల డిమాండ్లపై స్పందిస్తూ ప్రకటించారు. అందుకు ఆయా పార్టీల నుంచి ఇద్దరేసి పేర్లను ఇవ్వాలని సూచించారు.

స్టెరిలైజేషన్లు పెంచుతాం..

ప్రస్తుతం రోజుకు జరుగుతున్న 150 స్టెరిలైజేషన్లను ఆధునిక పరిజ్ఞానంతో 450కి పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చెత్త సమస్యలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ అంశంలో నిర్లక్ష్యం కనబరిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్పొరేటర్ల డిమాండ్లపై స్పందిస్తూ కుక్కలను పట్టుకునేందుకు వెళ్లినప్పుడు స్థానిక కార్పొరేటర్ సంతకంతో ధ్రువీకరణ పొందాలన్నారు. కార్పొరేటర్లకు తెలియకుండా కుక్కల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని రద్దు చేయరాదన్నారు.



మానిటరింగ్ కమిటీ ఏర్పాటు

రేబిస్ సోకకుండా కుక్కలకు టీకాలు, స్టెరిలైజేషన్ కార్యక్రమాలపై మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేస్తామని కమిషనర్ లోకేశ్‌కుమార్ తెలిపారు. యానిమల్ కేర్ సెంటర్లను సందర్శించి కల్పించాల్సిన సదుపాయాలు తెలియజేయాల్సిందిగా కార్పొరేటర్లను కోరారు. ఇకపై ప్రతియేటా కుక్కల గణన చేస్తామని తెలిపారు. మటన్, చికెన్ షాపుల వ్యర్థాలు బహిరంగంగా వేయకుండా కవర్లను అందజేస్తామన్నారు. కుక్కలతో పాటు కోతుల బెడద తగ్గించేందుకు పశువులను గోశాలలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వీధికుక్కలను పెంచుకోవడానికి ముందుకు వచ్చినవారికి ఫ్రీ లైసెన్సు, రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. వాటికి అవసరమైన చికిత్సను త్వరితగతిన అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

కార్పొరేటర్లకు సమాచారం ఇవ్వాలి..

సమావేశానికి హాజరైన ఆయా పార్టీల కార్పొరేటర్లు మాట్లాడుతూ.. ఎన్జీఓల సమన్వయంతో వీధికుక్కల బెడద సమస్య పరిష్కారానికి కృషి చేయాలని, క్షేత్రస్థాయిలో వెటర్నరీ అధికారులను పెంచాలన్నారు. స్టెరిలైజేషన్ల కోసం కుక్కలను పట్టుకునేటప్పుడు స్థానిక కార్పొరేటర్లకు తెలియజేయాలని, కుక్క కరిచినప్పుడు సమీప అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రేబిస్ నిరోధక ఇంజెక్షన్లు లభించేలా తగిన చర్యలు తీసుకోవడంతోపాటు దాని గురించి ప్రచారం చేయాలని కోరారు. మరణించిన బాలుని కుటుంబానికి ఆర్థిక సహాయంతోపాటు ఒకరికి ఉద్యోగం కల్పించాలని, డబుల్‌బెడ్‌రూమ్ ఇల్లు ఇవ్వాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, వివిధ స్వచ్ఛంద సంస్థల సభ్యులు, యానిమల్ వెల్ఫేర్ సొసైటీల పాల్గొన్నారు. సమావేశంలో సభ్యుల వాదోపవాదాలతో గందరగోళం జరిగింది. కుక్కలకు స్టెరిలైజేషన్, యాంటీ ర్యాబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాలు కాగితాల్లో లెక్కలకు, వాస్తవానికి పొంతన లేదని దృష్టికి తెచ్చారు.

3 నెలల పాటు స్పెషల్ డ్రైవ్

వీధికుక్కలపై వెల్లువెత్తుతున్న విమర్శలతో మూడునెలలపాటు వాటిని పట్టుకునే స్పెషల్ డ్రైవ్‌కు సిద్ధమైన అధికారులు అద్దె వాహనాలు తీసుకోనున్నారు. ఇప్పటికే సర్కిల్‌కు ఒకటి చొప్పున ఉన్న 30 వాహనాలకు తోడు అదనంగా 20 వాహనాలను తీసుకోనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఇందుకుగాను రూ. 1.18 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ వాహనాల్లో వీధికుక్కలెక్కువగా ఉన్న చార్మినార్, సికింద్రాబాద్ జోన్లలో నాలుగేసి వాహనాలను, ఎల్‌బీనగర్, ఖైరతాబాద్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి జోన్లలో మూడేసి వాహనాలను వినియోగించనున్నట్లు తెలిపారు.

బాలుడి కుటుంబానికి పరిహారం..

ఇటీవల అంబర్‌పేటలో కుక్కల దాడిలో మృతిచెందిన బాలుని కుటుంబానికి మేయర్ అధికారం మేరకు రూ.2 లక్షలతో పాటు తనకు వచ్చే నెల గౌరవ వేతనాన్ని ఇవ్వనున్నట్లు మేయర్ తెలిపారు. డిప్యూటీ మేయర్‌తో పాటు ఈ సమావేశానికి హాజరైన 17 మంది కార్పొరేటర్లు తమ ఒక నెల గౌరవ వేతనం ఇస్తామని తీర్మానించారు. జీహెచ్‌ఎంసీ తరఫున రూ.6 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేయనున్నట్లు మేయర్ తెలిపారు. దీంతో పాటు ప్రభుత్వానికి నివేదిక పంపి బాధిత కుటుంబానికి సహాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు.

సర్కారు బడుల్లో పాఠాలెలా?

మొన్నటి వరకు పదోన్నతులు.. బదిలీలు

- ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం
- సగానికిపైగా టీచర్లు విధులకు డుమ్మా
- 70 శాతం కూడా పూర్తికాని సిలబస్
- అయోమయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు

సాక్షి, సిటీబ్యూరో: సర్కారు బడుల్లో వార్షిక పరీక్షలు సమీపిస్తున్నా.. 70 శాతం సిలబస్ మించని పరిస్థితి నెలకొంది. ఉన్నత తరగతులతో పాటు ప్రాథమిక, ప్రాథమికోన్నత తరగతుల్లో సైతం సిలబస్ పూర్తి కాని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పదో తరగతి, మిగితా తరగతుల పరీక్ష షెడ్యూలు జారీ అయింది. ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి, మిగతా తరగతుల పరీక్షలు 16 నుంచి ప్రారంభ కానున్నాయి. సర్కారు బడుల్లో గత రెండు మూడు నెలలుగా తరగతుల నిర్వహణ అంతంత మాత్రంగా తయారైంది. మొన్నటి వరకు పదోన్నతులు, బదిలీలలో నిమగ్నమైన టీచర్లు.. ప్రస్తుతం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో బిజీగా మారారు. ఏకంగా పాఠశాలకు సెలవులు పెట్టకుండానే విధులకు హాజరు కాకపోవడం విస్మయానికి గురిచేస్తోంది.



ప్రత్యేక తరగతులపై నిర్లక్ష్యమే

- పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్న విద్యాశాఖ ఆదేశాలు ఆచరణల అమలు లేకుండాపోయింది. సబ్జెకుల పునశ్చరణ ఏమోగాని సిలబస్ పూర్తి కాని పరిస్థితి నెలకొంది. కనీసం పదో తరగతి ప్రత్యేక తరగతుల బోధనలో సైతం కొందరు ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- వాస్తవంగా పలు పాఠశాలల్లో ప్రధాన సబ్జెకుల సిలబస్ పూర్తి కాలేదని విద్యార్థులు చెబుతున్నారు. ఒకవైపు సబ్జెక్టు టీచర్ల కొరత వెంటాడుతుండగా.. మరోవైపు ఉన్న సబ్జెక్టు టీచర్లు సైతం విధులకు డుమ్మా ఆందోళనకు గురిచేస్తోంది. ప్రాథమిక, ప్రాథమికోన్నత తరగతులకు సంబంధించి కొన్ని పాఠశాలల్లో వివిధ సబ్జెకుల సిలబస్ 50 శాతం మించనట్లు తెలుస్తోంది. 6 నుంచి 9వ తరగతి వరకు గణితం, ఇంగ్లిష్ సైన్స్ సోషల్ సిలబస్ పరిస్థితి కూడా అంతంత మాత్రంగా తయారైంది.

మళ్లీ అవకాశం రాదని..

సుదీర్ఘకాలం తర్వాత బదిలీలు, పదోన్నతులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో మళ్లీ అవకాశం రాదని టీచర్లు తీవ్ర ప్రయత్నాలకు శ్రీకారం చుట్టారు. మొన్నటి వరకు టీచర్లు పదోన్నతులు, బదిలీల పేరుతో స్కూళ్లకు వెళ్లకుండా డీఈఓ, విద్యాశాఖ కమిషనర్ కార్యాలయాల చుట్టూ చక్కర్లు కొడుతూనే ఉన్నారు. తాజాగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతుండటంతో ప్రచారంలో పాల్గొంటూ స్కూల్స్‌కు చుట్టపు చూపుగా వచ్చి పోతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. పాఠశాలలను పర్యవేక్షించాల్సిన డిప్యూటీ ఐఓఎస్‌లు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండం డుమ్మా టీచర్లకు మరింత కలిసి వస్తోంది.

ఆకాశ దారిలో.. హాయిగా..

తుదిదశకు చేరుకున్న ఉప్పల్ స్కైవాక్

- రూ.25 కోట్లతో చేపట్టిన ప్రాజెక్టు
- ఏప్రిల్‌లో ప్రారంభానికి హెచ్‌ఎండీఏ సన్నాహాలు
- పరిశీలించిన హెచ్‌ఎండీఏ కమిషనర్



ఉప్పల్ స్కైవాక్‌ను పరిశీలిస్తున్న అర్వింద్‌కుమార్

సాక్షి, సిటీబ్యూరో: గజిబిజి గందరగోళం లేదు. ఉరుకులు, పరుగులు అవసరం లేదు. ఏ వైపు నుంచి ఏ వాహనం దూసుకొస్తుందోననే భయంతో ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని రోడ్డు దాటాల్సిన పని అంతకంటే లేదు. రోడ్డుకు ఇటువైపు నుంచి అటువైపునకు హాయిగా, ప్రశాంతంగా చేరుకోవచ్చు. ఉప్పల్ రింగురోడ్డు వద్ద హెచ్‌ఎండీఏ చేపట్టిన 660 మీటర్ల స్కైవాక్ ప్రాజెక్టు తుది దశకు చేరుకుంది. అన్ని వైపులా ట్రాక్ నిర్మాణం పూర్తయింది. ట్రాక్‌కు రెండు వైపులా వుడ్ రెయిలింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఏప్రిల్‌లో స్కైవాక్‌ను ప్రారంభించేందుకు హెచ్‌ఎండీఏ సన్నాహాలు చేపట్టింది. హెచ్‌ఎండీఏ కమిషనర్ అర్వింద్ కుమార్, చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు మంగళవారం ప్రాజెక్టును సందర్శించి అన్ని వైపులా కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పురోగతిపై ఇంజినీరింగ్ నిపుణులతో కమిషనర్ మాట్లాడారు. ట్రాక్ మార్గంలో నడిచి స్కైవాక్ సదుపాయాన్ని గమనించారు. స్కైవాక్ మార్గానికి 9 లిఫ్టులను, 3 ఎస్కలేటర్లను ఏర్పాటు చేశారు. ఏప్రిల్‌లో అందుబాటులోకి రానున్న ఈ స్కైవాక్ రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగులతో ఉప్పల్ రింగురోడ్డులో కాంతులీననుంది.

మెహిదీపట్నం స్కైవాక్‌లో ప్రతిష్టంభన..

మెహిదీపట్నం చౌరస్తాలో చేపట్టిన స్కైవాక్ పనుల్లో ప్రతిష్టంభన చోటుచేసుకుంది. స్కైవాక్ కోసం సమీపంలోని మిలిటరీ స్థలంలో కొంతభాగాన్ని తీసుకోవాల్సి వచ్చింది. అందుకు మిలిటరీ అధికారులు అంగీకరించకపోవడంతో పనులు నిలిచిపోయాయి. త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందని, పనులను తిరిగిప్రారంభిస్తామని హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.



చివరి దశకు చేరిన ఉప్పల్ స్కైవాక్ పనులు

చకచకా..

ఎయిర్‌పోర్టు మెట్రోకు పెగ్ మార్కింగ్



సాక్షి, సిటీబ్యూరో: ఎయిర్‌పోర్ట్ మెట్రో పనులు చకచకా సాగుతున్నాయి. రాయదుర్గం మెట్రో స్టేషన్ వరకు నిర్మించనున్న ఎయిర్‌పోర్టు మెట్రో కోసం ఇప్పటికే సర్వే పూర్తి చేసిన సంగతి తెలిసిందే. గ్రౌండ్ లెవల్‌లో మెట్రోలైన్ అలైన్‌మెంట్‌కు పెగ్ మార్కింగ్‌ను ప్రారంభించినట్లు హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. రోడ్డుపై సంప్రదాయ ఇంజినీరింగ్ పెగ్ మార్కులే కాకుండా, రాత్రి సమయంలో కనిపించేందుకు విధంగా రెట్రో రిఫ్లెక్టివ్ షీట్‌తో కూడిన అల్యూమినియం బోర్డులను సెంట్రల్ మీడియన్ లో ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇవి చైనేజీని సూచిస్తాయన్నారు. అంటే ఎయిర్‌పోర్ట్ మెట్రో ప్రారంభ స్థానం నుంచి ఆ బోర్డు పెట్టిన ప్రదేశం వరకు దూరాన్ని అది సూచిస్తుందని వివరించారు. ప్రతి 100 మీటర్లకు 0.1 కి.మీ., 0.2 కి.మీ.చొప్పున చిన్న సైజు బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ప్రతి అర కిలోమీటరుకు ఒకటి చొప్పున కొద్దిగా పెద్ద సైజులో ఉండే బోర్డులను పెడుతున్నారు. బోర్డులు రాయదుర్గం నుంచి బయోడైవర్సిటీ జంక్షన్ వరకు, ఖాజాగూడ రోడ్డులోని ఐటీ టవర్స్ నుంచి నానక్ రాంగూడ జంక్షన్ వరకు, సెంట్రల్ మీడియన్‌లో ఏర్పాటు చేస్తున్నారు. నానక్ రాంగూడ జంక్షన్ నుంచి టీఎస్‌పీఏ జంక్షన్ వరకు సర్వీస్ రోడ్డు విస్తరణ చేపట్టిన దృష్ట్యా వాటిని ఫుట్‌పాత్ వైపు ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతానికి ఈ స్ట్రెచ్‌లో సెంట్రల్ మీడియన్ లేదు. ఎయిర్‌పోర్ట్ మెట్రో పిల్లర్లు ఓఆర్ఆర్ మార్గంలో నానక్ రాంగూడ జంక్షన్, టీఎస్‌పీఏ జంక్షన్‌ల మధ్య ఉన్న సర్వీస్ రోడ్డు సెంట్రల్ మీడియన్‌లో ఉంటాయని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.

చిరుధాన్యాల్లో ఖనిజాలు పుష్కలం



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ రత్నావతి

- ఐఐఎంఆర్– ఐసీఏఆర్ హైదరాబాద్ ఇన్‌చార్జి డైరెక్టర్ రత్నావతి

రాయదుర్గం: జొన్నలు, బజ్రా, రాగి, ఇతర మిల్లెట్లలో ఖనిజాలు, ప్రొటీన్లు పుష్కలంగా ఉంటాయని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ హైదరాబాద్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ రత్నావతి పేర్కొన్నారు. మంగళవారం గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ సైన్సెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఆమె మాట్లాడారు. మిల్లెట్లు, జొన్నలు, బజ్రా రాగి వంటివి కేన్సర్ నిరోధక, యాంటీ ఆక్సిడెంట్, యాంటీ డయాబెటిక్ లక్షణాలను కలిగి ఉన్నాయన్నారు. చిరుధాన్యాల ప్రాముఖ్యలను ఆమె వివరించారు. మిల్లెట్స్ ఉత్పత్తి, ఇతర దేశాలకు ఎగుమతి చేయడంపై ప్రభుత్వ ప్రణాళికలను ఆమె వివరించారు. ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ.. అభివృద్ధిలో శాస్త్ర సాంకేతికతను మరింతగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలో త్వరలో మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ, మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ, ఇతర విభాగాలలో మాస్టర్స్ ప్రోగ్రాంలను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ ప్రొఫెసర్ అనిల్‌కుమార్ చౌదరి, ఉర్దూ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు సల్మాన్‌ఖాన్, అలీమ్ బాషా, షకీల్ అహ్మద్, ఎస్‌మక్బూల్ అహ్మద్, డాక్టర్ సౌరభ్ కె వర్మ, డాక్టర్ సుభాష్‌కౌల్, డాక్టర్ విష్ణుడి రాజ్‌పుత్, సిరాజుద్దీన్, డాక్టర్ ఇరాఖాన్, ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్, 140 మంది విదేశాల మేధావులు ఆన్‌లైన్ సదస్సులో పాల్గొన్నారు.

స్నేహితుడు మోసం చేశాడని.. డీఆర్‌డీఓ సైంటిస్టు ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రాణస్నేహితుడని నమ్మితే నిండా ముంచడంతో మనోవేదనకు గురైన ఓ సైంటిస్టు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ రవికుమార్ కథనం ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన వనం రమేశ్ నాదర్‌గుల్‌లోని లింబ్రా ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్నాడు. హైదరాబాద్ డీఆర్‌డీఓలో సైంటిస్టుగా పనిచేస్తున్నాడు. వనం రమేశ్, రవికుమార్ స్నేహితులు. రవిని బాగా నమ్మిన రమేశ్ ఏదడిగినా కాదనేవాడు కాదు. దీన్ని ఆసరాగా చేసుకున్న రవికుమార్.. తాను వ్యాపారం చేయడానికి పెట్టుబడిగా రమేశ్ నుంచి రూ.20 లక్షలు తీసుకున్నాడు. తర్వాత ఈఎంఐ తానే చెల్లిస్తానని చెప్పి రమేశ్ ఇల్లుపై రూ.80 లక్షలు రుణం తీసుకున్నాడు. అనంతరం ఈఎంఐ చెల్లించడం మానేశాడు. చివరకు ఇంటిని రిజిస్ట్రేషన్ చేస్తే తానే ఈఎంఐ చెల్లిస్తానని చెప్పడంతో రవికుమార్ పేరిట ఇల్లు కూడా రిజిస్ట్రేషన్ చేశాడు. అయినా రవి మారకపోగా...చివరకు ఇల్లు తనదని, ఖాళీ చేయమని హెచ్చరించడం ప్రారంభించాడు. అయినా రమేశ్ పట్టించుకోకపోవడంతోఅఫ్జల్ అనే వ్యక్తి పేరు మీద ఇంటిని రిజిస్ట్రేషన్ చేశాడు. ఇంట్లో నుంచి వెళ్లకపోవడంతో నోటీసులు పంపాడు. నా ఇల్లుకు నోటీసులు పంపడం ఏమిటని తీవ్ర మనోవేదనకు గురైన వనం రమేశ్ (38).. మంగళవారం ఇంట్లో ఉరి వేసుకొనిఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య శిరీష పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆదిబట్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దంపతుల 'రాయల్' దందా!

- చాక్లెట్స్ రూపంలో హష్ డ్రగ్ విక్రయం
- రాజస్థాన్ నుంచి ఇక్కడకు వస్తున్న మాల్
- ముగ్గురి అరెస్టు



సాక్షి, సిటీబ్యూరో: గంజాయి సంబంధిత పదార్థమైన హష్ ఆయిల్‌తో తయారైన రాయల్ బ్రాండ్ చాక్లెట్లు విక్రయిస్తున్న భార్యభర్తలతో పాటు సరఫరా చేసిన వ్యక్తినీ హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్-న్యూ) అధికారులు పట్టుకున్నారు. వీరి నుంచి 110 హష్ బాల్స్, చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నామని డీసీపీ చక్రవర్తి గుమ్మి మంగళవారం వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన దుదారామ్ చౌదరి, శాంతి దేవి భార్యభర్తలు. కొన్నేళ్ల క్రితం నగరానికి వసలవచ్చిన ఈ జంట హఫీజ్‌పేటలో స్థిరపడింది. కిరాణా దుకాణం నిర్వహిస్తున్న వీరికి తమ రాష్ట్రం నుంచే వచ్చి గ్యాస్ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్న మహేంద్ర కుమావత్‌తో పరిచయం ఉంది. తరచు రాజస్థాన్ వెళ్లి వచ్చే కుమావత్ అక్కడ నుంచే ఈ రాయల్ బ్రాండ్ సరుకు తీసుకువచ్చి దుదారామ్, శాంతిలకు సరఫరా చేస్తున్నాడు. వీటిని తమ దుకాణంలో దాచి ఉంచుతున్న భార్యభర్తలు నిత్యం ఖరీదు చేసే కస్టమర్లకు ఒక్కోటి రూ.100కు విక్రయిస్తున్నారు. దీనిపై హెచ్-న్యూ ఇన్‌స్పెక్టర్ పి.రమేష్ రెడ్డికి సమాచారం అందింది. ఆయన నేతృత్వంలో ఎస్సై సి.వెంకటరాములుతో కూడిన బృందం దాడి చేసి ముగ్గురినీ అరెస్టు చేసింది. తదుపరి చర్యల నిమిత్తం వీరితో పాటు స్వాధీనం చేసుకున్న 110 చాక్లెట్లు మియాపూర్ పోలీసులకు అప్పగించారు. గతంలో శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులు ఇదే ఆరోపణలపై దుదారామ్‌పై ఒకటి, కుమావత్‌పై రెండు కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు.

ఫుల్‌బాడీ మసాజ్ అన్నారు.. లోపలికి వెళ్లాక దోచేశారు!

- పోలీసుల పేరు చెప్పి బెదిరింపులు
- డబ్బు లాక్కుని బయటకు గెంటేసిన మసాజ్ సెంటర్ నిర్వాహకులు

హిమాయత్‌నగర్: బాడీ మసాజ్ చేయించుకునేందుకు మసాజ్ సెంటర్‌కు వెళ్లిన ఓ యువకుడికి ఆ మసాజ్ సెంటర్ నిర్వాహకులు చుక్కలు చూపించారు. 'మీకు కావాల్సిన అమ్మాయిని ఎంచుకోండి, మీకు కావాల్సిన రీతిలో మసాజ్ చేస్తారు' అని నమ్మించారు. అతని జేబులోని డబ్బు తీసుకుని లోపలికి వెళ్లిన రెండే రెండు నిమిషాల్లో పోలీసులు వస్తున్నారంటూ భయభ్రాంతులకు గురిచేసి యువకుడిని గెంటేసిన సంఘటన హిమాయత్‌నగర్‌లో చోటు చేసుకుంది. మంగళవారం మధ్యాహ్నం హిమాయత్‌నగర్ ప్రధాన రహదారిపై ఉన్న ఓ స్పా సెంటర్‌కు నాంపల్లికి చెందిన యువకుడు వెళ్లాడు. ఫుల్‌బాడీ మసాజ్ నిమిత్తం రిసెప్షన్‌లో రూ.3 వేలు చెల్లించాడు. ఆ తర్వాత తనకు నచ్చిన అమ్మాయిని సెలెక్ట్ చేసుకుని మసాజ్ రూమ్‌లోకి ఇద్దరూ వెళ్లారు. 'సార్ మీకు ఫుల్ సర్వీస్ కావాలంటే మరో రూ.3 వేలు ఇవ్వాలంటూ' యువతి కోరింది. దీనికి ఒప్పుకున్న ఆ యువకుడు మరో రూ.3 వేలు యువతికి ఇచ్చాడు. యువతి చేతిలో డబ్బు పడగానే పోలీసులు రైడ్ కోసం వస్తున్నారంటూ బెదిరించి తనను బయటకు పంపేశారంటూ బాధితుడు 'సాక్షి'కి తెలిపాడు. కాగా ఈ రకమైన దందాలు పలు మసాజ్ సెంటర్లలో జరుగుతున్నప్పటికీ పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

వాట్సాప్‌లో వివరాలు.. కొరియర్‌లో సర్టిఫికెట్లు!

- హైదరాబాద్-ఢిల్లీ మధ్య నకిలీ సర్టిఫికెట్ల దందా
- విదేశాలకు వెళ్లే విద్యార్థులే టార్గెట్‌గా విక్రయాలు
- వ్యవస్థీకృతంగా నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా
- ఏడుగురిని అరెస్టు చేసిన సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్
- సూత్రధారి చిక్కితే మరిన్ని వివరాలు వెలుగులోకి



నకిలీ సర్టిఫికెట్ల వివరాలు వెల్లడిస్తున్న దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: టెన్త్, ఇంటర్, డిప్లమో, డిగ్రీ, పీజీ... ఎనీ సబ్జెక్ట్, ఎనీ గ్రూప్, ఎనీ పర్సంటేజ్... అయితే పాస్ లేదంటే బ్యాక్‌లాగ్స్ క్లియరెన్స్... సూత్రధారికి వాట్సాప్‌లో వివరాలు షేర్ చేస్తే చాలు కొరియర్‌లో సర్టిఫికెట్లు పంపించేస్తాడు... అమెరికా, లండన్ దేశాలకు విద్యాభ్యాసం చేసే వాళ్లనే టార్గెట్‌గా చేసుకుని ఈ పంథాలో నకిలీ సర్టిఫికెట్ల దందా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాకు దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు చెక్ చెప్పారు. కన్సల్టెన్సీల నిర్వాహకులతో సహా ఏడుగురిని అరెస్టు చేశామని, పరారీలో ఉన్న సూత్రధారిగా ఉన్న ఢిల్లీ వాసి సునీల్ కపూర్ చిక్కితే మరిన్ని కీలకాంశాలు వెలుగులోకి వస్తాయని డీసీపీ చక్రవర్తి తెలిపారు. సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ సీహెచ్ రూపేష్‌తో కలిసి మంగళవారం పురానీ హవేలీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పూర్తి వివరాలు వెల్లడించారు. బజార్‌ఘాట్‌కు చెందిన మహ్మద్ హబీబ్ బీటెక్ పూర్తి చేసి టోలిచౌకిలోని ఓ కన్సల్టెన్సీలో పని చేశాడు. అప్పట్లో సునీల్ కపూర్ విద్యా సంస్థల మార్కెటింగ్ కోసం వస్తుండేవాడు. ఇలా పరిచయమైన వీళ్లు..తేలిగ్గా డబ్బు సంపాదించడం కోసం విదేశాలకు వెళ్లే విద్యార్థులకు అవసరమైన నకిలీ సర్టిఫికెట్లు సరఫరా చేయాలని పథకం వేశారు. స్టడీ వీసా పొందడానికి అవసరమైన అర్హతలు, మార్కులు లేని వారితో పాటు అసలు ఉన్నత విద్య అభ్యసించని వాళ్లనే వీళ్లు ఆకర్షించడం మొదలెట్టారు. హబీబ్ 2015లో మలక్‌పేట ప్రాంతంలో ఫై ఎబ్రాడ్ కన్సల్టెన్సీ పేరుతో సంస్థను ఏర్పాటు చేశాడు. నకిలీ సర్టిఫికెట్లు కేసుల్లోనే గతంలో బహదూర్‌పుర, సరూర్‌నగర్ పోలీసులకు చిక్కి జైలుకు వెళ్లాడు. బెయిల్‌పై వచ్చినా తన పంథా మార్చుకోకుండా కొనసాగించాడు. అబిడ్స్‌లో ఎడ్యువైజ్ ఓవర్సీస్ కన్సల్టెన్సీ నిర్వహించే అబ్దుల్ రవూఫ్‌తో పాటు ఏజెంట్లుగా వ్యవహరించిన షానవాజ్ ఖాన్, మహ్మద్ జుబేర్, సల్మాన్ ఖాన్, మహ్మద్ అబ్దుల్ సత్తార్‌లతో పాటు తన సోదరుడైన మహ్మద్ ఇర్ఫాన్‌తో కలిసి ముఠా కట్టాడు. మిగిలిన వాళ్లు సర్టిఫికెట్ల అవసరమైన వారిని గుర్తిస్తుండగా వారికి ఇర్ఫాన్ కౌన్సెలింగ్ ఇస్తుంటాడు. వీరి వివరాలను హబీబ్ వాట్సాప్ ద్వారా సునీల్‌కు షేర్ చేసేవాడు. వీటి ఆధారంగా తయారయ్యే నకిలీ సర్టిఫికెట్లు అతడు కొరియర్‌లో ఇక్కడకు పంపేవాడు. ఇంటర్ నుంచి పీజీ వరకు వివిధ సర్టిఫికెట్లను రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు అమ్మి ఆ సొమ్ము అందరూ పంచుకుంటున్నారు. వీసా జారీ సమయంలో కొన్ని ఎంబసీలు యూనివర్సిటీలకు మెయిల్ పెట్టి సర్టిఫికెట్ వివరాలు సరి చూస్తాయి. అలా వెళ్లే మెయిల్స్‌కు సమాధానం ఇవ్వడానికి సునీల్ కొందరు వర్సిటీ ఉద్యోగులతోనూ ఒప్పందాలు చేసుకున్నాడు. ఇలా వీళ్లు ఇప్పటి వరకు 70 సర్టిఫికెట్లు అమ్మగా... వీరిలో 30 మంది విదేశాలకు వెళ్లిపోయారు. ఈ గ్యాంగ్‌పై సమాచారం అందుకున్న సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర నేతృత్వంలో ఎస్సైలు షేక్ బుర్హాన్ అలీ, ఎన్.శ్రీశైలం, వి.నరేందర్, కె.నర్సింహులు వలపన్ని సునీల్ సహా మిగిలిన వారిని అరెస్టు చేశారు. పరారీలో ఉన్న సునీల్ చిక్కితే ఈ కేసులో మరిన్ని కీలక విషయాలు తెలుస్తాయని చక్రవర్తి తెలిపారు. ఈ గ్యాంగ్ నుంచి పోలీసులకు తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమ, సింబయోసిస్ ఇంటర్నేషనల్ డీమ్డ్ (పుణే), ఛత్రపతి సాహుజీ మహరాజ్ (కాన్పూర్), బెంగళూరు, ఉస్మానియా, అన్నా, రాజస్థాన్ యూనివర్సిటీలతో పాటు రాజస్థాన్ నర్సింగ్ కౌన్సిల్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ (మహారాష్ట్ర), సెకండరీ అండ్ హయ్యర్ సెకండరీ ఎడ్యుకేషన్ (పుణే), అన్వర్ ఉల్ ఉలూమ్ కాలేజ్ (మేడిపల్లి), తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు, కౌన్సిల్ ఫర్ ది ఇండియన్ స్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్ పేర్లతో కూడిన 500 నకిలీ సర్టిఫికెట్లు స్వాధీనం చేసుకున్నారు. వీరి నుంచి ఖరీదు చేసిన సర్టిఫికెట్లతో విదేశాలకు వెళ్లిన వారిని వెనక్కు రప్పించడానికి ఆయా వర్సిటీలు, ఎంబసీలకు లేఖలు రాయనున్నారు.

కొత్వాల్ కేసరి కుస్తీ పోటీల్లో పాల్గొనండి

చార్మినార్: హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో మార్చి 3వ తేదీ నుంచి 5 వరకు నిర్వహించనున్న 'కొత్వాల్ కేసరి కుస్తీ చాంపియన్‌షిప్-2023' పోటీలకు అన్ని ఏర్పాట్లు చేపట్టామని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య తెలిపారు. సిటీ కాలేజీ సమీపంలోని కులీ కుతుబ్ షా స్టేడియంలో జరిగే ఈ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో అర్హులైన వారందరూ పాల్గొనవచ్చని చెప్పారు. శారీరక దారుఢ్యంతో పాటు ఇప్పటికే శిక్షణ పొందిన వస్తాదులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చునన్నారు. మార్చి 2వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వేయింగ్‌లో పాల్గొడానికి వచ్చే ఔత్సాహికులు తమ వెంట కలర్ పాస్‌పోర్టు సైజ్ ఫోటోలను తీసుకు రావాలన్నారు. గెలుపు ఓటములతో సంబంధం లేకుండా హాజరైన వారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. సీనియర్స్ విభాగంలో 50 కేజీ, 57, 65, 74, 86, 97 కేజీల విభాగాలు ఉంటాయన్నారు. అలాగే మహిళా విభాగంలో 50-57 కేజీలు, 60-68 కేజీలు, టైటిల్ వెయిట్ కేటగిరిలో 80-120 కేజీలు ఉంటాయన్నారు. విజేతలకు క్యాష్ అవార్డు, మెరిట్ సర్టిఫికెట్‌తో పాటు మెడల్‌ను అందజేస్తామన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన రెజ్లింగ్ అకాడమీలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆ వదంతులతో సర్వేలకు ఇబ్బంది

సహకరించాలన్న క్రైమ్స్ డీసీపీ

సాక్షి, సిటీబ్యూరో: కేంద్ర హోం మంత్రిత్వ శాఖ లేదా ఆయుష్ పేరుతో కొందరు సంచరిస్తూ మోసాలకు పాల్పడుతున్నారనే వదంతులతో కూడిన సందేశం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీని ప్రభావం క్షేత్రస్థాయిలో సర్వే చేసే విభాగాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని క్రైమ్స్ డీసీపీ శబరీష్ మంగళవారం తెలిపారు. ఇటీవల కాలంలో గణాంకాలు రూపొందించడానికి కేంద్ర గణాంక మంత్రిత్వ శాఖకు చెందిన సిబ్బంది క్షేత్ర స్థాయిలో సర్వే చేస్తూ ఇంటింటికీ తిరుగుతున్నారు. అయితే ప్రచారంలో ఉన్న నకిలీ సందేశం కారణంగా ప్రజలు వీరినీ మోసగాళ్లగానే భావించి సహకరించట్లేదు. అకారణంగా ఇలాంటి సందేశాలను కొందరు సృష్టించి, వైరల్ చేస్తున్నారని శబరీష్ తెలిపారు. ఈ నేపథ్యంలోనే వాట్సాప్ సహా సోషల్ మీడియాలో వైరల్ అయ్యే వదంతులను నమ్మవద్దని ఆయన ప్రజలను కోరారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళకు తీవ్రగాయాలు



గాయాలకు గురైన శాంతమ్మ

సంతోష్‌నగర్: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ మహిళ కాలు విరిగిన సంఘటన మంగళవారం కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిధాని ధాతునగర్ ప్రాంతానికి చెందిన శాంతమ్మ (56) గాంధీఆసుపత్రిలో నర్సుగా విధులు నిర్వహిస్తోంది. మంగళవారం విధులు ముగించుకొని ఇంటికి బయలు దేరింది. మిధాని చౌరస్తా మూలమలుపు వద్ద నుంచి శాంతమ్మ రోడ్డు దాటుతుండగా బండ్లగూడ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు (టీఎస్06 జెడ్191) ఢీకొనగా..శాంతమ్మ కింద పడిపోయింది. దీంతో బస్సు ముందు చక్రం ఎడమ కాలుపై నుంచి వెళ్లడంతో విరిగిపోయింది. శాంతమ్మను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు డ్రైవర్ నల్లరాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

మద్యం మత్తులో వీరంగం

- డ్రంక్ అండ్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ యువకుడు
- పోలీసులపై చిందులేస్తూ ఘర్షణ
- ట్రాఫిక్ ఎస్‌ఐ ఫిర్యాదుతో కేసు నమోదు



ట్రాఫిక్ పోలీసులతో వాగ్వివాదానికి దిగిన గౌరవ్

బంజారాహిల్స్: 'నా పేరు గౌరవ్... హైకోర్టులో అడ్వకేట్‌ను..నువ్వు ఆఫ్ట్రాల్ కానిస్టేబుల్‌వు..నన్నే ఆపుతావా..? ఎంత ధైర్యం నీకు' అంటూ మద్యం మత్తులో ఓ యువకుడు ఊగిపోతూ ట్రాఫిక్ పోలీసులపై దురుసుగా ప్రవర్తించాడు. తీవ్ర పదాలతో దుర్భాషలాడాడు. ఈ ఘటనలో పోలీసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే... సోమవారం అర్ధరాత్రి బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని పార్క్‌హయత్ హోటల్‌సమీపంలో బంజారాహిల్స్ ట్రాఫిక్ ఎస్‌ఐ ఉపేందర్ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తుండగా ఓ యువకుడు పీకల దాకా మద్యం సేవించి కారు (ఏపీ 10క్యూ 1035) నడుపుతూ పోలీసులకు చిక్కాడు. బ్రీత్ ఎనలైజర్ పరీక్షలో 94 పాయింట్లు రావడంతో డ్రంక్ అండ్ డ్రైవ్ కింద ఆ యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కారు దిగాలని సూచించగా తనకు హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు తెలుసంటూ బిల్డప్ ఇవ్వడమే కాకుండా పోలీసులను దుర్భాషలాడుతూ కారు దిగేందుకు నిరాకరించారు. పోలీసులపైనే దాడికి యత్నించాడు. ఎస్‌ఐని కాలితో తన్నేందుకు యత్నించాడు. ఎంతగా పోలీసులు రిక్వెస్ట్ చేసినా వినిపించుకోకుండా పోలీసులపై తిట్లదండకాన్ని ఉపయోగించాడు. పోలీసులు ఆరా తీయగా సదరు యువకుడు అంబర్‌పేట్‌కు చెందిన చిల్ల గౌరవ్ (23)గా నిర్ధారణ అయింది. ఒక ఓటీటీ సంస్థలో పని చేస్తున్నట్లుగా గుర్తించారు. పోలీసులను దుర్భాషలాడి విధులను ఆటంక పరిచిన ఘటనలో నిందితుడిపై ఎస్‌ఐ ఉపేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఐపీసీ సెక్షన్ 353, 332, 341, 504, 185 ఎంవీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిగత కక్షతోనే వాహనాలు దహనం

- ఆదివారం మాదన్నపేట పరిధిలో ఉదంతం
- 36 గంటల్లో ఛేదించిన సౌత్ ఈస్ట్ జోన్ టీమ్స్
- ఇద్దరు జువైనల్స్‌తో సహా ముగ్గురి పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: మాదన్నపేట పరిధిలో ఆదివారం తెల్లవారుజామున దగ్ధమైన వాహనాల కేసును సౌత్ ఈస్ట్ జోన్ పోలీసులు ఛేదించారు. 36 గంటల్లోనే కొలిక్కి తెచ్చామని, ఇద్దరు జువైనల్స్ సహా ముగ్గురిని పట్టుకున్నామని డీసీపీ సీహెచ్ రూపేష్ మంగళవారం వెల్లడించారు. డీసీపీ చక్రవర్తి గుమ్మితో కలిసి పురానీ హవేలీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బహదూర్‌పురలో నివసించే ఆటోడ్రైవర్ మీర్ మహబూబ్ అలీ అలియాస్ సోహైల్ పక్క ఇంట్లో గతంలో మీర్ మజర్ అలీ అబేద్ నివసించే వాడు. రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి అయిన ఈయన ప్రస్తుతం మాదన్నపేటలో ఉంటున్నారు. వీళ్లు పక్కపక్క ఇళ్లల్లో ఉండగా సోహైల్‌కు మజర్ కుమార్తెకు మధ్య ప్రేమాయణం నడిచింది. ఈ విషయం తెలిసిన మజర్ తీవ్రంగా పరిగణించడంతో సోహైల్‌తో గొడవలు అయ్యాయి. అదే కారణంగా మజర్ అక్కడ నుంచి మాదన్నపేటకు మకాం మార్చారు. అయినప్పటికీ వీరి ప్రేమాయణం కొనసాగగా విషయం తెలుసుకున్న మజర్ తన కుమార్తెకు వేరే వ్యక్తితో వివాహం జరిపించారు. దీంతో ఆగ్రహం చెందిన సోహైల్ ఆదివారం తెల్లవారుజామున మరో ఇద్దరు మైనర్లతో కలిసి వాహనంపై మాదన్నపేటకు వచ్చారు. తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ వినియోగించి మజర్ ఇంట్లో పార్క్ చేసి ఉన్న మూడు వాహనాలను తగులబెట్టారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న మాదన్నపేట పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ వ్యవహారం వెనుక వర్గవైషమ్యాలు ఉన్నాయని పుకార్లు చెలరేగాయి. దీంతో కేసుకు కీలక ప్రాధాన్యం ఇచ్చిన అధికారులు నాలుగు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేయించారు. సీసీ కెమెరాల్లో రికార్డు అయిన ఫీడ్‌తో పాటు సాంకేతిక ఆధారాలను బట్టి ముందుకు వెళ్లిన స్పెషల్ టీమ్స్ 36 గంటల్లో కేసు ఛేదించి ముగ్గురినీ పట్టుకున్నారు. ఇలాంటి అంశాల్లో బయటకు వచ్చే పుకార్లు నమ్మవద్దని, పోలీసులను సంప్రదించి విషయాలు నిర్ధారించుకోవాలని డీసీపీ సీహెచ్ రూపేష్ కోరారు.

బ్యాడ్మింటన్ ఆడుతూ గుండెపోటుకు గురై...



పరమేష్ యాదవ్

అడ్డగుట్ట: బ్యాడ్మింటన్ ఆడుతూ గుండెపోటుకు గురై వ్యక్తి మృతి చెందిన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..మల్కాజ్‌గిరి ప్రాంతానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి పరమేష్ యాదవ్ (39) ప్రతిరోజు బ్యాడ్మింటన్ ఆడడానికి లాలాపేటలోని ప్రొ.జయశంకర్ ఇండోర్ స్టేడియంకు వస్తుంటాడు. రోజుమాదిరిగానే స్టేడియానికి వచ్చి మంగళవారం రాత్రి 7.30 గంటల సమయంలో బ్యాడ్మింటన్ ఆడుతూ ఒక్కసారిగా కుప్పకూలాడు. అపస్మారకస్థితికి చేరిన పరమేష్‌ను స్థానికుల సహాయంతో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని పోలీసులు తెలిపారు.

కాలం చెల్లిన వస్తువులపై రీ స్టిక్కరింగ్

- తయారీ స్థావరంపై పోలీసుల దాడి
- ముగ్గురు వ్యక్తుల అరెస్టు.. పరారీలో నిర్వాహకులు
- రూ 6.45 లక్షల విలువైన తినుబండారాలు, కాస్మొటిక్స్ స్వాధీనం

మేడిపల్లి: కాలంచెల్లిన (ఎక్స్‌పైర్డ్) వస్తువులు, తినుబండారాల ప్యాకెట్లు, కాస్మొటిక్స్‌పై రీస్టిక్కరింగ్ చేసి తేదీలు మార్చి విక్రయిస్తున్న ముఠాపై ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. మేడిపల్లి పోలీసుల కథనం ప్రకారం..నగరానికి చెందిన అభయ్‌జైన్, కమల్‌జైన్, సంగీత జైన్‌లు బోడుప్పల్ రెడ్డీస్ కాలనీలో ఓ అపార్ట్‌మెంట్ 2వ అంతస్తులో హరియంట్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో బిజినెస్ కేంద్రాన్ని నెలకొల్పారు. ఇక్కడ గుట్టు చప్పుడు కాకుండా కాల వ్యవధి తీరిన వస్తువులపై రీస్టిక్కరింగ్ చేయడం..వాటిని మార్కెట్‌కు తరలించి విక్రయించడం చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న మల్కాజిగిరి ఎస్‌ఓటీ పోలీసులు ఆ స్థావరంపై దాడి చేశారు. అక్కడ పనిచేస్తున్న ముగ్గురు వ్యకులు ఉమాకాంత్, నరేష్, నవీన్‌లను అదుపులోకి తీసుకుని రూ.6.45 లక్షల విలువైన వివిధ రకాల తినుబండారాలను, కాస్మొటిక్ వస్తువులను స్వాధీనం చేసుకుని మేడిపల్లి పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిర్వాహకులు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.



క్లుప్తంగా

542 మందికి కంటి పరీక్షలు



ఎన్బీటీనగర్ బస్తీ దవాఖానాలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని రోడ్ నెం.12 ఎన్బీటీనగర్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరంలో మంగళవారం 102 మందికి పరీక్షలు చేశారు. 29 మందికి అద్దాలు పంపిణీ చేసి మరో 23 మందిని శస్త్ర చికిత్స కోసం సిఫార్సు చేశారు. పంజగుట్ట ప్రతాప్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో, బంజారాహిల్స్ రోడ్ నెం.14 వెంకటేశ్వరనగర్ కమ్యూనిటీహాల్‌లో, షేక్‌పేట రాజీవ్ గాంధీ కమ్యూనిటీహాల్‌లో, ఫిలింనగర్ ఎఫ్ఎన్‌సీసీ ఆవరణలో, ఫిలింనగర్ గౌతంనగర్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన శిబిరాల్లో మొత్తం 542 మంది పరీక్షలు చేయించుకోగా 137 మందికి అద్దాలు పంపిణీ చేశారు. 38 మందిని శస్త్ర చికిత్స కోసం సిఫార్సు చేసినట్లు డీఎంసీ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు.

కుక్కలకు నీళ్ల తొట్టెలు ఏర్పాటు చేయాలి

రహమత్‌నగర్: వీధి కుక్కలను శత్రువులుగా చూడొద్దని జంతు ప్రేమికుడు, హ్యాపీ ఫ్రెండ్లీ యానిమల్స్ షెల్టర్ వ్యవస్థాపకుడు రమేశ్ విజ్ఞప్తి చేశారు. వాటి నుంచి రక్షణ చర్యలు తీసుకుంటూనే కుక్కలను ప్రేమతో చూడాలని ఆయన సూచించారు. రహమత్‌నగర్ ఎస్పీఆర్‌హిల్స్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ.. కుక్కలు కావాలని ఎవరినీ గాయపర్చవని, కొన్ని ప్రత్యేక సందర్భాల్లోనే అలా వ్యవహరిస్తాయన్నారు. కుక్కల కోసం వేసవి కాలంలో నీళ్ల తొట్టెలు ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

నేత్ర పర్వంగా చక్రస్నానం



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయంలో జరుగుతున్న వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజైన మంగళవారం ఉదయం స్వామివారికి చక్రస్నానం వేడుక నిర్వహించారు. వందలాది మంది భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని పునీతులయ్యారు. సాయంత్రం జరిగిన ధ్వజారోహణ కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ఉదయం సుప్రభాతం, తోమాల, అర్చన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ ఎల్ఏసీ చైర్మన్ భాస్కర్‌రావు, ఉపాధ్యక్షులు వెంకట్‌రెడ్డి, కోమటిరెడ్డి లక్ష్మి, సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, బోజిరెడ్డి, విజయ్‌కుమార్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం



ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని జ్ఞానీ జైల్‌సింగ్ నగర్‌లో మంగళవారం ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు సి.రోహిన్‌రెడ్డి పర్యటించారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా ఆయన ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అధికారం ఇస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

'నాయీబ్రాహ్మణులంతా సాచి సినిమా చూడాలి'



బింధుప్రేమను సత్కరిస్తున్న చంద్రశేఖర్

రహమత్‌నగర్: సాచి సినిమా నాయి కులవృత్తికి అద్దం పట్టేలా ఉంటుందని జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌నాయి అన్నారు. శ్రీరాం నగర్‌లో సోమవారం రాత్రి సాచి సినిమా కథానాయిక బింధుప్రేమనాయికి ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంగళి కుల వృత్తిపై తొలిసారి రూపొందించిన సాచి సినిమా మంచి గుర్తింపు పొందాలని ఆయన ఆకాంక్షించారు. నాయీబ్రాహ్మణులంతా తప్పని సరిగా ఈ సినిమా చూడాలని కోరారు.

ఫైర్ సేఫ్టీ ఎక్విప్‌మెంట్ ఉండాల్సిందే..!

- ఫైర్ సేఫ్టీపై వ్యాపారులకు అధికారుల అవగాహన
- వ్యాపార సముదాయాల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచన



కార్యక్రమంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ జీవీ ప్రసాద్

బంజారాహిల్స్: ఎంతో కష్టపడి సంపాదించుకున్న డబ్బు, వస్తువులు, నివాసాలను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ఫైర్ సేఫ్టీ ఎక్విప్‌మెంట్ ఉంచుకోవాలని ఫైర్ సేఫ్టీ అధికారులు పేర్కొన్నారు. సికింద్రాబాద్‌లో జరిగిన అగ్ని ప్రమాదం తర్వాత ఫైర్, జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ అధికారులు ఒక బృందంగా ఏర్పడి ఫైర్ సేఫ్టీపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా జీహెచ్ఎంసీ సీఎంటీసీ భవనంలో మంగళవారం బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని హోటళ్ల యజమానులు, వివిధ వ్యాపార సంస్థల ప్రతినిధులు, యజమానులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ జీవీ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి వ్యాపారి విధిగా మంటలను అదుపు చేసే సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. 20 రోజుల క్రితం బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని పలు భవనాలను జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ అధికారులతో కలిసి పరిశీలించామని, ఫైర్ సేఫ్టీ లేని భవనాలకు నోటీసులు అందజేసినట్లు తెలిపారు.

వినియోగంపై శిక్షణ ఇస్తాం..

100 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్వహించే ప్రతి దుకాణంలో, కార్యాలయంలో ఫైర్ ఎక్విప్‌మెంట్ ఉండాలని అధికారులు తెలిపారు. మంటలను ఆర్పేందుకు వాడే వస్తువులు అందరికీ అందుబాటు ధరల్లోనే ఉంటాయని చెప్పారు. ఫైర్ సామగ్రిని కొనుగోలు చేసి తమ దృష్టికి తీసుకొస్తే సిబ్బందిని పంపించి వాటిని ఎలా వాడాలో శిక్షణ ఇస్తామన్నారు. ఫర్నిచర్ షాపులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లు, కిచెన్లలో తప్పనిసరిగా మంటలను ఆర్పేందుకు అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వాస్తవానికి ఫైర్‌సేఫ్టీ నిబంధనల్లో ఫైర్ సిలిండర్ ఉండాలనే నిబంధన ఉన్నప్పటికీ చాలా మంది దీనిని పట్టించుకోవడం లేదని, ఇకపై ఇలాంటి చర్యలను ఉపేక్షించేది లేదని వారు హెచ్చరించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు..

కొన్ని రోజుల పాటు స్థానికంగా ఉండే వ్యాపారులకు అవగాహన కల్పిస్తామని డీఆర్ఎఫ్ ఎస్ఎఫ్‌వో షౌకత్ అన్నారు. అయినప్పటికీ వారు ఫైర్ సేఫ్టీ ఎక్విప్‌మెంట్ లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే నోటీసులు అందజేసి చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. నిబంధనలు అతిక్రమించి కార్యకలాపాలు నిర్వహిస్తే వారి వస్తువులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. సెల్లార్లలో వ్యాపారాలు చేయడం నిషేధమని, ఆ స్థలాలను వాహనాల పార్కింగ్ కోసం మాత్రమే వినియోగించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఫిలింనగర్ ఫైర్ సేఫ్టీ అధికారి జీబీ చంద్రశేఖర్‌బాబు, టౌన్‌ప్లానింగ్ సెక్షన్ అధికారి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కుంగిన రోడ్డు మరమ్మతులకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



పనులు ప్రారంభించిన దృశ్యం

హిమాయత్‌నగర్: నెల రోజుల క్రితం కుంగిన రోడ్డుకు మరమ్మతులు చేసేందుకు ఎట్టకేలకు అధికారులు స్పందించారు. కుంగిన రోడ్డుపై రాకపోకలు సాగిస్తూ స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు సోమవారం హిమాయత్‌నగర్ ప్రధాన రహదారిపై ఉన్న మినర్వా హోటల్ వద్ద మరో గుంత ఏర్పడింది. ఈ సమస్యలను ప్రస్తావిస్తూ మంగళవారం 'హిమాయత్‌నగర్‌లో మరో గుంత' అనే శీర్షికతో 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన జీహెచ్ఎంసీ యంత్రాంగం ఎట్టకేలకు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టింది. సుమారు రూ.25లక్షలతో కుంగిన రోడ్డును కొత్తగా నిర్మించేందుకు సమాయత్తమైంది. దీనికి సంబంధించిన పనులు సైతం ప్రారంభించారు. నెలరోజుల్లో పనులు పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు ఏఈ దివ్యతేజ తెలిపారు.

ఆధునిక ఆవిష్కరణలపై సదస్సు

బంజారాహిల్స్: కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్‌లో అత్యాధునిక ఆవిష్కరణలు–దాని అప్లికేషన్లు 2023 అంశంపై కేఎల్ డీమ్డ్ టూ బి యూనివర్సిటీ క్యాంపస్‌లో మూడు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. అత్యాధునిక శాస్త్రీయ ఫలితాలు, విద్యా సంస్థలు, పరిశ్రమల మధ్య సంబంధాలను ప్రోత్సహించడం, విద్యావేత్తలు, పారిశ్రామిక నిపుణులు, విద్యార్థుల్లో అవగాహన మెరుగుపర్చడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమని యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ వెల్లడించారు. సాంకేతిక ప్రపంచంలో విప్లవాత్మకతను తీసుకొచ్చే కృత్రిమ మేథస్సు, యాంత్రిక అభ్యాసం, ఐవోటీ, సంబంధిత రంగాల్లో భాగస్వామ్య పరిశోధనలు, అత్యాధునిక ఆవిష్కరణలకు ఉన్న అవకాశాలపై చర్చించినట్లు ఆయన తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 28 మందికి జరిమానా

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మోతాదుకు మించి మద్యం తాగి పట్టుబడిన 28 మందిని మంగళవారం నాంపల్లిలోని నాలుగవ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. వీరికి ఒక్కొక్కరికి రూ.2100 చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న మరో 28 మందిని జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు పదవ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం లైసెన్స్ లేకుండా వాహనం నడుపుతున్న వీరికి న్యాయమూర్తి జరిమానా విధించారు. వారి నుంచి రూ.21,200 జరిమానా రూపంలో వసూలు చేశారు.

రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న విశ్వేశ్వర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

పంజగుట్ట: రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఎర్రమంజిల్ రామకృష్ణానగర్‌లో బీజేపీ స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ నియంతృత్వ పాలన పట్ల ప్రజలు విసిగిపోయారని, ఎన్నికలు వస్తే బీజేపీకి ఓటు వేసేందుకు వారు సిద్ధంగా ఉన్నారన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేసిందేమీ లేదని, ఎక్కడ చూసినా డ్రైనేజీలు పొంగి మురుగునీరు ప్రవహిస్తుందని, గోతుల రోడ్లు దర్శనమిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ సామాన్యుడు తన సమస్య ఎమ్మెల్యే వద్ద చెప్పుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఖైరతాబాద్ ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించాలని కార్యకర్తలకు ఆయన సూచించారు.

ప్రపంచం చూపు భారత్ వైపు..

వెంగళరావునగర్: ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తుందని, జాతీయ వాదానికి కట్టుబడి ఉన్న ఏకైక పార్టీ బీజేపీ అని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ హైలాంకాలనీలో సోమవారం రాత్రి ప్రజా గోస-బీజేపీ భరోసా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలతో ప్రజలు విసుగు చెందారన్నారు. ఈ ప్రాంతంలో అనేక సమస్యలు ఉన్నాయని, తమ పార్టీ అధికారంలోకి రాగానే వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ మహిళా మోర్చా సభ్యురాలు డాక్టర్ పద్మ వీరపనేని, నాయకులు ప్రదీప్‌కుమార్, లంకెల దీపక్‌రెడ్డి, కిలారి మనోహర్, కుంభాల గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

నాగేశ్వరరావుకు సేవారత్న అవార్డు



పంజగుట్ట: వైద్య శిబిరాల నిర్వహణ, పేద విద్యార్థులకు తోడ్పాటు అందించడం, స్థానిక సమస్యలపై స్పందించి పరిష్కారానికి చొరవ చూపుతున్న నవ్యశ్రీ సామాజిక సేవా సమితి వ్యవస్థాపకుడు కె.నాగేశ్వరరావును సేవారత్న జాతీయ అవార్డు 2023కి ఎంపిక చేసినట్లు బహుజన సాహితీ అకాడమీ ప్రకటించింది. ఈ మేరకు నాగేశ్వరరావుకు మంగళవారం అకాడమీ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ అవార్డు ధ్రువీకరణపత్రం అందజేశారు. ఈ అవార్డును మార్చి 12వ తేదీన తిరుపతిలో నిర్వహించే బహుజన రైట్స్ ఆరవ సౌత్ ఇండియన్ సమావేశంలో ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. అవార్డుకు తనను ఎంపిక చేయడం ఎంతో సంతోషకరమని, ఈ స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తానని నాగేశ్వరరావు చెప్పారు.

'పార్లమెంట్ భవనానికి అంబేడ్కర్ పేరు పెట్టాలి'

లిబర్టీ: నూతన పార్లమెంట్ భవనానికి అంబేడ్కర్ పేరు పెట్టాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముడి మార్టిన్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దళితుల అభ్యున్నతి, సంక్షేమం కోసం పాటుపడుతున్నామని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ భవనానికి అంబేడ్కర్‌పై పేరు పెట్టి నిబద్ధత నిరూపించుకోవాలన్నారు. దళితుల అభ్యున్నతి, ఆర్థికాభివృద్ధి కోసం పనిచేసి అంబేడ్కర్ చరిత్రలో నిలిచిపోయారని చెప్పారు.

నేడు మహిళలకు ఆటల పోటీలు

రహమత్‌నగర్: ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బోరబండ సైట్ 4, 5 మైదానంలో బుధవారం ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ పార్టీ డివిజన్ మహిళా నాయకులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి ఈ నెల తొమ్మిదిన ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఉదయం ప్రారంభమయ్యే ఈ పోటీల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మెడికో ప్రీతికి కాంగ్రెస్ నేతల నివాళి



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

బంజారాహిల్స్: సీనియర్ల వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన మెడికో ప్రీతి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ తెలంగాణ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రీతి చిత్రపటంతో కూడిన బ్యానర్‌ను నందినగర్ నుంచి ర్యాలీగా తీసుకొచ్చి ర్యాగింగ్ భూతాన్ని తరిమికొడదామంటూ నినాదాలు చేశారు. అనంతరం ప్రీతి చిత్రపటం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి, కాంగ్రెస్ నేతలు బల్లు రాథోడ్, బంజారాహిల్స్ డివిజన్ అధ్యక్షుడు ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలు తీసుకురావాలి..

లిబర్టీ: ర్యాగింగ్ పేరుతో వేధింపులకు గురిచేసే వారిని కఠినంగా శిక్షించేందుకు నూతన చట్టాలు తీసుకురావాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు కే.బి.శ్రీధర్ ప్రభుత్వాన్ని కోరారు. సీనియర్ సైఫ్ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన ప్రీతికి లిబర్టీ ప్లాజాలోని పార్టీ కార్యాలయంలో కొవ్వత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసుదేవ్‌రావు, అరుణ రెడ్డి, నింది కొండలరావు, వెంకటేష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

లాభాల పేరుతో లూటీ

హిమాయత్‌నగర్: లాభాల పేరుతో నగరవాసికి సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. తొలి రోజుల్లో లాభాలు చూపిన నేరగాళ్లు నమ్మకం కలిగించి లూటీ చేశారు. వెంగళరావునగర్‌కు చెందిన ఓ వ్యక్తికి కొద్ది రోజుల క్రితం టెలిగ్రామ్ ద్వారా ఒకడు పరిచయమయ్యాడు. తాను ఇన్వెస్టర్‌ని అంటూ తక్కువ సమయంలో లక్షలు సంపాదిస్తున్నట్లు చెప్పాడు. బాధితుడికి ఓ లింక్ పంపించి రిజిష్టర్ చేసుకోమని చెప్పగా అతడు చెప్పినట్లు చేశాడు. ఆ తర్వాత రెండు, మూడు పర్యాయాలు చిన్న మొత్తానికి రెండింతలు లాభాలు ఇచ్చారు. ఆపై లెవెల్స్ రీచ్ కావాలంటూ పలు దఫాలుగా రూ.6లక్షల 88 వేలు కాజేశారు. దీంతో బాధితుడు మంగళవారం సిటీ సైబర్ క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్‌కు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలు

ఫిలింనగర్: బంజారాహిల్స్ రోడ్ నెం.2 ఇందిరానగర్‌లోని సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం ఉదయం క్షీరాధివాసం, సాయంత్రం ధాన్యాధివాసం, పుష్పాధివాసం, శయ్యాధివాసం పూజలను ఘనంగా నిర్వహించారు. బస్తీవాసులు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బియ్యం, ఇతర ధాన్యాలను తీసుకొచ్చి ధ్వజస్తంభం వద్ద పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మోటుపల్లి కిరణ్‌కుమారాచార్యులు, ఎస్.బాలరాజు, మోటుపల్లి శేషశైలాచార్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించొద్దు



అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

వెంగళరావునగర్: తల్లిదండ్రులు తమ బిడ్డలపై ఉన్న ప్రేమతో మైనర్‌లకు వాహనాలు ఇస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. మధురానగర్ కాలనీలోని విజ్ఞాన జ్యోతి హైస్కూల్‌లో మంగళవారం బేగంపేట టీటీఐ ఆధ్వర్యంలో ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన వారికి తల్లిదండ్రులు లైసెన్స్ ఇప్పించాలని, ఆ తర్వాతే వాహనాలు ఇవ్వాలని సూచించారు. వారికి వాహనం ఇచ్చే ముందుగా ట్రాఫిక్‌పై పూర్తి అవగాహన కల్పించాలని చెప్పారు. దేశానికి సేవ చేయాల్సిన యువత ప్రమాదాలకు గురై అంగవైకల్యం పొందడం, మృతిచెందడం, పోలీసు స్టేషన్లలో ఉండటం వంటి ఘటనలు దురదృష్టకరమన్నారు.

పరిశోధనలపై విద్యార్థులకు అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

ఖైరతాబాద్: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కళాశాల, ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సంయుక్తంగా పరిశోధన విధానంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. లక్డీకాపూల్‌లోని ఐఐఎంసీ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ విభాగానికి చెందిన 12 మంది అధ్యాపకులు పాల్గొని స్టూడెండ్స్‌కు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ కళాశాలల నుంచి 631 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. డిగ్రీ స్థాయిలో ప్రాజెక్ట్ వర్క్ ప్రారంభించిన ఐఐఎంసీ కళాశాలలో ప్రతి సంవత్సరం ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గ్యార్వీ షరీఫ్ వేడుకలు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం.14లోని నందినగర్‌లోని ఖుష్బూ విద్యానికేతన్ స్కూల్ సమీపంలోని చిల్లా వద్ద మంగళవారం గ్యార్వీ షరీఫ్ వేడుకలు నిర్వహించారు. 80 సంవత్సరాలుగా ఈ చిల్లా వద్ద గ్యార్వీ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని నిర్వాహకులు తెలిపారు. ప్రార్థనల అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



నేషనల్ సైన్స్ డే



ఖైరతాబాద్ ప్రభుత్వ పాఠశాలలో..

బంజారాహిల్స్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఫెయిర్ దోహదపడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారిని రోహిణి అన్నారు. నేషనల్ సైన్స్‌డే సందర్భంగా మంగళవారం బంజారాహిల్స్ రోడ్ నెం.12 ఎన్బీటీనగర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో హెచ్‌సీఎల్, నిర్మాణ్ సంస్థలు సంయుక్తంగా సైన్స్ ఫెయిర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులతో పోటీ పడి రాణిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. ప్రతిఏటా జిల్లాలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు పదికి పది జీపీఏ సాధిస్తుండడం మంచి పరిణామమన్నారు. ఏడు పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొని 80కి పైగా నమూనాలను ప్రదర్శించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో నిర్మాణ్ సంస్థ సీఈవో మయూర్, సీవోవో అనూరాధ, వీహెచ్ఎల్ సీవోవో రామ్ శ్రీనివాస్, హెచ్‌సీఎల్ సీనియర్ పీఎం మహేందర్, ఐబీఎం ప్రతినిధి నవీన్, ఉపాధ్యాయులు ల్గొన్నారు.

గతి ప్రభుత్వ పాఠశాలలో..

బంజారాహిల్స్ రోడ్ నెం.7లోని గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నేషనల్ సైన్స్ డే సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. వాయు కాలుష్యం, వాతావరణ కాలుష్యం, రక్త నమూనాలు పరీక్షించే విధానం, పట్టణీకరణ అంశాలపై విద్యార్థులు నమూనాలు రూపొందించారు.

ఖైరతాబాద్‌లో..

ఖైరతాబాద్: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఖైరతాబాద్‌లోని నిషుల్క్ ప్రభాత్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు రూపొందించిన నమూనాలతో సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. హైడ్రాలిక్ మెషిన్, వాటర్ ఫౌంటెయిన్, రోబోటిక్ సెక్యూరిటీ, హైడ్రాలిక్ లిఫ్ట్, విండ్ మిల్, ఫొటో సింథటిక్ తదితర 18 రకాల నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. భవిష్యత్ తరాలకు సైన్స్ ఎంతో అవసరమని, సైన్స్ లేకుంటే మానవ మనుగడ ప్రశ్నార్థకమవుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.కరుణాకర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో సైన్స్ ఇన్‌చార్జి సౌజన్య, ఉపాధ్యాయులు గాయత్రి, విద్య, శ్రీలత, సరిత, ప్రశాంతి, మంజుల, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు రూపొందించిన నమూనాలను పరిశీలిస్తున్న డీఈవో రోహిణి

మహాత్మానగర్‌లో..

రహమత్‌నగర్: మహాత్మానగర్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలో ఎస్ఎస్‌బీనగర్, హనుమాన్ స్టోన్ కట్టర్స్ కాలనీల ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ, చారిత్రక కట్టడాలు, అణుశక్తి తదితర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు ప్రసూన్న, ఉపాధ్యాయులు శ్రీనివాస్, కుమార్ తదితరులు ప్రశంసించారు.

క్లుప్తంగా...

4న సీఎం జగన్ సమక్షంలో కీలక ఒప్పందాలు

- రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని ప్రాథమిక అంచనా
- ఏపీ మంత్రి అమర్‌నాథ్ వెల్లడి



సాక్షి, విశాఖపట్నం: గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)–2023లో భాగంగా మార్చి 4న ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో కీలక పారిశ్రామిక ఒప్పందాలు జరగనున్నాయని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. విశాఖలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన జీఐఎస్–2023కు సంబంధించిన వివరాలు తెలిపారు. ఏపీలో ఏయే రంగాల్లో పెట్టుబడులకు ఎంతమేర అవకాశాలున్నాయి, రాష్ట్రంలో ఉన్న వనరులు, సౌకర్యాలు మొదలైన అంశాలన్నింటినీ ఈ సదస్సు ద్వారా ప్రపంచానికి చాటిచెబుతామన్నారు. 14 రంగాల్లో పెట్టుబడులకు సంబంధించి ఎంవోయూలు జరుగుతాయని చెప్పారు. రెండురోజుల పాటు సదస్సులో కీలక ఒప్పందాలు జరగనున్నాయన్నారు. 24 దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్న ఈ సదస్సుకు ప్రపంచస్థాయి ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఈ జీఐఎస్ ద్వారా రూ.2 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు వస్తాయని ప్రాథమికంగా అంచనా వేస్తున్నామని, అంతకుమించి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయని చెప్పారు.

35 లక్షల మంది విద్యార్థులకు సన్నబియ్యం భోజనం

సాక్షి, హైదరాబాద్: దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతి రోజు 35 లక్షల మంది విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం అందిస్తోందని పౌరసరఫరాల సంస్థ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ తెలిపారు. మంగళవారం ఆయన వికారాబాద్ జిల్లా శివారెడ్డిపల్లిలోని మైనార్టీ రెసిడెన్షియల్ హాస్టల్‌లో సన్న బియ్యం నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. బియ్యం నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవీందర్‌సింగ్ మాట్లాడుతూ దేశంలో సన్నబియ్యంతో విద్యార్థులకు భోజనాన్ని అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. తెలంగాణలో 28,632 ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ద్వారా 25 లక్షల మంది విద్యార్థులకు, అలాగే 4,237 ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలోని 9.65 లక్షల మంది విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు ఏడాదికి 1.50 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పౌరసరఫరాల సంస్థ ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు.



గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న ఏపీ సీఎం వైఎస్ జగన్

175 నియోజక వర్గాల్లో పోటీ చేసే దమ్ముందా?

- పొత్తులు లేకుండా గెలిచే ధైర్యముందా?
- చంద్రబాబు, దత్తపుత్రుడికి ఇదే మా చాలెంజ్
- తెనాలి సభలో ఏపీ సీఎం వైఎస్ జగన్

చంద్రబాబుకు, దత్తపుత్రుడికి సవాల్ విసురుతున్నా.. 175 నియోజకవర్గాలకు 175 చోట్ల ఒంటరిగా పోటీ చేసి గెలిచే ధైర్యం ఉందా? ఆ ధైర్యం వాళ్లకు లేదు.. ఎందుకంటే జీవితంలో ఏ రోజూ వారు ప్రజలకు మంచి చేయలేదు కాబట్టి. కానీ మీ బిడ్డకు ఆ ధైర్యం ఉంది.. కారణం మేం మంచి చేశాం కనుకనే. చేసిన మంచి గురించి చెప్పుకుని మళ్లీ అధికారంలోకి వస్తానన్న నమ్మకం, ధైర్యం మీ బిడ్డకు ఉంది. రాబోయే రోజుల్లో కుట్రలు ఇంకా ఎక్కువ కనిపిస్తాయి. రాజకీయాల్లో అన్యాయాలు పెరుగుతాయి. అన్నీ గమనించండి. నిర్ణయం తీసుకునేటప్పుడు మాత్రం బాగా ఆలోచించండి. మీ ఇంట్లో మంచి జరిగిందా? లేదా? అన్న ఒకే ఒక్కటి ప్రామాణికంగా తీసుకోండి. మీ ఇంట్లో మంచి జరిగితే మీ బిడ్డకు మీరే సైనికులుగా తోడుగా నిలబడండి. – సీఎం వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: వచ్చే ఎన్నికల్లో యుద్ధం కరువుతో ఫ్రెండ్‌షిప్ ఉన్న చంద్రబాబుకు, వరుణ దేవుడి ఆశీస్సులున్న మనందరి ప్రభుత్వానికి మధ్య జరుగుతుందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఐదేళ్ల పాలనలో ప్రజలకు ఒక్క మంచి పని కూడా చేయని చంద్రబాబు ఇక చెప్పుకునేందుకు ఏమీ లేకపోవడంతో దుష్ట చతుష్టయంతో కలసి దుష్ప్రచారాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన 98.5 శాతం హామీలను నెరవేర్చి ఈ రోజు సంతృప్తిగా ఓటు అడగడానికి వస్తున్నామని, ఎమ్మెల్యేలు ప్రతి గడపనూ సందర్శిస్తున్నారని చెప్పారు. మంగళవారం గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డు వద్ద నిర్వహించిన బహిరంగ సభలో వైఎస్సార్ రైతు భరోసా, మాండూస్ తుపాన్ బాధిత రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని బటన్ నొక్కి జమ చేసిన అనంతరం సీఎం జగన్ ప్రసంగించారు.

దుష్ట చతుష్టయానికి కడుపు మంట

''వ్యవసాయం దండగన్న చంద్రబాబుకు, రైతుకు ఇచ్చిన ప్రతి మాటా తప్పిన చంద్రబాబుకు, ఆయన భజన బృందానికి, దుష్ట చతుష్టయానికి మన ప్రభుత్వంపై కడుపు మండుతోంది. అయినా కడుపు మంటకు మందు లేదు. అసూయకు అసలే మందు లేదు. మనది పేదల ప్రభుత్వం. మనది రైతన్నల ప్రభుత్వం. రైతులను వంచించిన చంద్రబాబు ఒకవైపున, అన్నదాతలకు అండగా నిలుస్తున్న మనందరి ప్రభుత్వం మరోవైపున నిలిచి ఇవాళ యుద్ధం జరుగుతోంది'' అని సీఎం అన్నారు.

నారాయణకు సీఐడీ నోటీసులు

అమరావతి భూకుంభకోణం కేసులో దూకుడు



సాక్షి, అమరావతి: చంద్రబాబు హయాంలో అమరావతిలో చోటుచేసుకున్న భూ కుంభకోణాలపై దర్యాప్తులో సీఐడీ అధికారులు దూకుడు పెంచారు. నారా, నారాయణ అవినీతి బంధం గుట్టును ఇప్పటికే రట్టుచేసిన అధికారులు ఆ దిశగా విచారణను మరింత వేగవంతం చేశారు. అమరావతిలో భూదోపిడీకి సంబంధించి నాటి ముఖ్యమంత్రి చంద్రబాబును ఏ–1గా, మున్సిపల్ మంత్రిగా చేసిన పొంగూరు నారాయణను ఏ–2గా సీఐడీ అధికారులు గతంలోనే కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. తాజాగా అమరావతి మాస్టర్ ప్లాన్‌లో స్టార్టప్ ఏరియా ఎంపిక, ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌ల రూపకల్పనలో అక్రమాలపై నారాయణ, ఆయన కుటుంబ సభ్యులు, సన్నిహితులు తమ ముందు విచారణకు హాజరుకావాలని మంగళవారం నోటీసులు జారీచేశారు. సీఐడీ అధికారులు కొన్ని నెలల క్రితం హైదరాబాద్‌లోని నారాయణ నివాసాల్లో సోదాలు.. ఇటీవలే హైదరాబాద్‌లోని నారాయణ కుమార్తెల నివాసాల్లోనూ సోదాలు నిర్వహించారు. అమరావతి స్టార్టప్ ఏరియా, ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌లో అక్రమాలకు సంబంధించి కీలక ఆధారాలు సేకరించారు. నారాయణ విద్యా సంస్థలకు చెందిన ఎన్‌స్పైరా మేనేజ్‌మెంట్ సర్వీసెస్ నుంచి రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు నిధులు మళ్లించి.. ఆ సంస్థల ఉద్యోగులను బినామీలుగా చేసుకుని అసైన్డ్ భూములు కొల్లగొట్టినట్లు ఆధారాలు వెలుగు చూశాయి. ఈ నేపథ్యంలో.. నారాయణ, ఆయన భార్య పి. రమాదేవి, కుమార్తెలు పి. సింధూర, పి. శరణి, అల్లుడు పునీత్ కొత్తప్ప, అల్లుని సోదరుడు వరుణ్‌కుమార్ కొత్తప్ప, రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ అంజనీకుమార్, ఎన్‌స్పైరా మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ఉద్యోగి ప్రమీల ఈనెల 6, 7 తేదీల్లో విచారణకు హాజరుకావాలని సీఆర్‌పీసీ 41ఏ కింద వారికి సీఐడీ నోటీసులు జారీచేసింది.

విద్యార్థిని హత్య కేసులో 143 రోజుల్లోనే తీర్పు

ప్రేమోన్మాదికి జీవిత ఖైదు

కాకినాడ లీగల్: ఓ విద్యార్థినిని పాశవికంగా హత్య చేసిన కేసులో ప్రేమోన్మాదికి కేవలం 143 రోజుల్లోనే శిక్ష పడింది. నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ కాకినాడ మూడో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి పి.కమలాదేవి మంగళవారం తీర్పు చెప్పారు. తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు మండలం బాలవరానికి చెందిన గుబ్బల వెంకట సూర్యనారాయణ కూరాడలో మేనమామ ఇంట్లో ఉండేవాడు. అదే గ్రామంలో కె.దేవిక తన అమ్మమ్మ ఇంట్లో ఉంటూ కాకినాడ పీఆర్ కళాశాలలో డిగ్రీ చదువుకునేది. దేవికను ప్రేమించానంటూ సూర్యనారాయణ వెంటపడేవాడు. ఇతని వేధింపులు భరించలేక దేవిక విషయాన్ని బంధువులకు చెప్పింది. పెద్దలు యువకుడ్ని మందలించి పంపించేశారు. అయినా అతడు తన చేష్టలు ఆపలేదు. గతేడాది అక్టోబర్ 8న కాండ్రేగుల – కూరాడ మధ్య కాపు కాశాడు. యాక్టివా మోపెడ్‌పై వస్తున్న దేవికను ఆపి నడిరోడ్డుపై కత్తితో 18 సార్లు కిరాతకంగా పొడిచాడు. ఆమె అక్కడికక్కడే చనిపోయింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సాక్ష్యాధారాలు సేకరించి 7 రోజులలోనే కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కాకినాడ మూడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో కేసు విచారణ త్వరితగతిన జరిగింది. నేరం రుజువు కావడంతో సూర్యనారాయణకు జీవిత ఖైదు విధిస్తూ జడ్జి పి.కమలాదేవి తీర్పు చెప్పారు.

కన్విక్షన్ బేస్డ్ ట్రయల్ కేసుల మానిటరింగ్ వ్యవస్థతో సత్ఫలితాలు

విద్యార్థిని పాశవిక హత్య ఘటనపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలించిపోయారు. వెంటనే మృతురాలి కుటుంబానికి సీఎం సహాయ నిధి నుంచి రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. త్వరితగతిన విచారణ జరపాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు నిరంతరం దర్యాప్తును పర్యవేక్షించారు. ఇందుకు కన్విక్షన్ బేస్డ్ ట్రయల్ కేసుల మానిటరింగ్ వ్యవస్థ చక్కగా పనిచేసింది. కేసు నమోదు చేసిన 143 రోజుల్లో విచారణ చేసి నిందితుడికి శిక్ష పడేలా చేశారు. కేసు విచారణ విషయంలో ప్రభుత్వం బాగా స్పందించిందని, నిందితుడికి కఠిన శిక్ష పడిందని మృతురాలి తల్లి నాగమణి అన్నారు.

కేంద్ర నిర్ణయం బట్టి రాష్ట్రం స్పందన

- యాసంగి ధాన్యం సేకరణపై సీఎం నిర్ణయం
- సీఎం కేసీఆర్‌తో మంత్రి గంగుల కమలాకర్ భేటీ
- యాసంగి సీఎంఆర్, ఢిల్లీలో కేంద్ర మంత్రి పీయూష్ సమావేశంపై చర్చ

సాక్షి, హైదరాబాద్: వచ్చే యాసంగి ధాన్యం సీఎంఆర్ విషయంలో కేంద్రం నిర్ణయించే లక్ష్యానికి అనుగుణంగా స్పందించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. యాసంగిలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎంత మేర ముడి బియ్యంగా, ఉప్పుడు బియ్యంగా తీసుకుంటారనే స్పష్టత వచ్చిన తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేయాలని స్పష్టంచేశారు. కేంద్ర ఆహార శాఖమంత్రి పీయూష్ గోయల్ నేతృత్వంలో బుధవారం ఢిల్లీలో అన్ని రాష్ట్రాల పౌరసరఫరాల శాఖ మంత్రులు, అధికారులతో సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి రాష్ట్రం తరపున పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, పౌరసరఫరాల సంస్థ జీఎం రాజిరెడ్డి హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి గంగుల కమలాకర్ మంగళవారం రాత్రి సీఎంతో ప్రగతిభవన్‌లో భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఈ యాసంగిలో సేకరించే ధాన్యం లక్ష్యం, సీఎంఆర్‌గా ఎఫ్‌సీఐకి ఇచ్చే బియ్యం గురించి వివరించారు. ఏప్రిల్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా రేషన్ దుకాణాల ద్వారా కూడా బలవర్ధక బియ్యం (ఫోర్టిఫైడ్ రైస్) ఇవ్వాలని నిర్ణయించిన నేపథ్యంలో యాసంగి ధాన్యాన్ని ముడి బియ్యంగా మిల్లింగ్ చేసి ఇవ్వడంలో ఉన్న ప్రతికూలతలపై చర్చించినట్లు సమాచారం. యాసంగి ధాన్యం బాయిల్డ్ రైస్‌గా మిల్లింగ్ చేస్తే తప్ప రైతాంగానికి మేలు జరగదనే విషయంపై మరోసారి చర్చించినట్లు తెలిసింది. గత యాసంగి సీజన్‌కు సంబంధించి ఇంకా 5 లక్షల మెట్రిక్ టన్నుల మేర బియ్యాన్ని సీఎంఆర్ కింద ఎఫ్‌సీఐకి బకాయి ఉన్న విషయాలను కూడా సీఎంకు వివరించారని తెలిసింది.



భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి ప్రవాసాంధ్ర ఆర్యవైశ్య అసోసియేషన్ సువర్ణ తాపడ వాహనాలను వితరణగా అందజేసింది. రూ.75 లక్షల వ్యయంతో తమిళనాడులోని కుంభకోణంలో ఈ వాహనాలను తయారు చేశారు. –భద్రాచలం

భారత వర్సిటీల్లో 16వ స్థానంలో హెచ్‌సీయూ

రాయదుర్గం: దేశంలోని యూనివర్సిటీల్లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) 16వ స్థానంలో నిలిచింది. ఈ మేరకు నేచర్ ఇండెక్స్ మంగళవారం ర్యాంకింగ్స్ ప్రకటించింది. ప్రస్తుతం భారతీయ విశ్వవిద్యాలయాల్లో హెచ్‌సీయూ అత్యున్నత స్థానంలో కొనసాగడం సంతోషించదగ్గ విషయమని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ బీజేరావు హర్షం వ్యక్తం చేశారు.



నగర వార్తలు

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



ధర్మతేజ (ఫైల్)

అడ్డగుట్ట: తాను ప్రేమించిన అమ్మాయికి మరొకరితో నిశ్చితార్థం కావడంతో మనస్తాపానికిలోనైన బీటెక్ విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తుకారాంగేట్ సాయినగర్ ప్రాంతానికి చెందిన ధర్మతేజ(21) పోచంపల్లిలోని సెయింట్ మేరీస్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. ఇంటర్మీడియట్ చదివే సమయంలో అతను ఓ అమ్మాయిని ప్రేమించాడు. వారం రోజుల క్రితం సదరు యువతికి మరో యువకుడితో నిశ్చితార్థం జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన ధర్మతేజ సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. డ్యూటీ నుంచి తిరిగివచ్చిన అతడి తల్లి తలుపు కొట్టినా స్పందన లేకపోవడంతో కిటికీలో నుంచి చూడగా ధర్మతేజ ఉరికి వేలాడుతూ కనిపించాడు. తలుపులు బద్దలుగొట్టి లోపలికి వెళ్లి చూడగా అప్పటికే అతను మృతి చెందాడు. తుకారాంగేట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ప్రీతి ఘటనపై న్యాయ విచారణ జరిపించాలి

- ప్రగతిభవన్ ముట్టడికి యత్నం
- మహిళా కాంగ్రెస్ నేతల అరెస్టు

పంజగుట్ట: మృత్యువుతో పోరాడి ఓడిపోయిన వైద్య విద్యార్థిని ప్రీతి కేసును సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రగతిభవన్ ముట్టడించేందుకు యత్నించారు. కాంగ్రెస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతారావు ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నేతలు ఒక్కసారిగా ప్రగతిభవన్ వద్దకు దూసుకువచ్చారు. బారికేడ్ల ఎదుట బైఠాయించి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వీరిని అడ్డుకున్న పోలీసులు సునీతారావుతో పాటు 9 మందిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రీతి తండ్రి సమస్యను పోలీసుల దృష్టికి తీసుకెళ్లిన వెంటనే వారు జోక్యం చేసుకుని ఉంటే ఈ ఘోరం జరిగి ఉండేది కాదన్నారు.



గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

కవాడిగూడ: గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనంతో పాటు న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో కార్మికులు సమ్మెకు సిద్ధంగా ఉన్నారని సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబా అన్నారు. గత ప్రభుత్వాలు కూడా వారి సమస్యలను పరిష్కరించకుండా మోసం చేశాయని, ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదే వైఖరి అవలంబిస్తే కార్మికులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, స్పెషల్ స్టేటస్ కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, యూనియన్ గౌరవ అధ్యక్షులు గ్యార పాండు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.గణపతిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి తునికి మహేష్, పి.వినోద్ తదితరులు చిట్యాల ఐలమ్మ స్వగ్రామం పాలకుర్తి నుంచి ఈ నెల 12న చేపట్టిన పాదయాత్ర ముగింపు సందర్భంగా మంగళవారం ఇందిరా పార్కు వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సాయిబాబా మాట్లాడుతూ కార్మికులను పర్మనెంట్ చేసేంత వరకు పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. గతంలో గ్రామ పంచాయతీ కార్మికులను విస్మరించిన పాలకులకు ఏ విధంగా బుద్ధి చెప్పారో అదే విధంగా ప్రస్తుత పాలకులకు గుణపాఠం చెప్పాలన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ స్పందించాలని కోరారు. పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన గ్రామ పంచాయతీల్లో నియమించిన కార్మికులతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఆరోపించారు. కార్మికులను పర్మనెంట్ చేయాలని, వేతనాలు పెంచాలని, స్పెషల్ స్టేటస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చుక్కా రాములు, పాండు, చాగంటి వెంకటయ్య, గణపతిరెడ్డి, మహేష్, వినోద్, రూదమ్మ, జె.వెంకటేష్, ఎస్.రమ, భూపాల్, జయలక్ష్మి, రాజారావు, మల్లికార్జున్, ఈశ్వర్‌రావు, మధు, శ్రీకాంత్, రమేష్, సోమన్న, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దివ్యాంగుల వీల్‌చైర్ క్రికెట్ టోర్నీ



దివ్యాంగ క్రికెట్ జట్టు సభ్యులు

అంబర్‌పేట: వీల్ చైర్‌లో క్రికెట్ ఆడి దివ్యాంగులు క్రీడాస్ఫూర్తిని చాటారు. వీల్ చైర్‌లో కూర్చునే బ్యాటింగ్ చేసి బంతిని బౌండరీ దాటించారు. అలాగే బౌలింగ్ చేసి వికెట్లు తీశారు. మంగళవారం అంబర్‌పేట వాటర్‌వర్క్స్ క్రికెట్ స్టేడియంలో వీల్ చైర్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్ర దివ్యాంగుల ట్రై సిరీస్ క్రికెట్ టోర్నమెంట్ జరిగింది. ఈ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 120 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తెలంగాణ జట్టు 14 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 121 పరుగులు చేసి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ సిరీస్‌ను తెలంగాణ జట్టు కైవసం చేసుకుంది. తెలంగాణ జట్టుకు సమీయుద్దీన్ కెప్టెన్‌గా వ్యవహరించగా, ఆంధ్ర జట్టుకు తాతాజీ కెప్టెన్‌గా వ్యవహరించారు. విజేతలకు ముఖ్య అతిథులుగా హాజరైన పవర్‌టెక్ ట్రాన్స్‌ఫార్మర్ సంస్థ ఎండీ స్వామిగౌడ్, సామాజిక కార్యకర్త శిప్రా గాంధీ తదితరులు బహుమతుల అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు శ్రీధర్ రాయల్, కార్యదర్శి ఫారూఖ్ హమీద్ పాల్గొన్నారు.



బీసీ బంధు పథకం అమలు చేయాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: రాష్ట్రంలో బీసీ బంధు పథకాన్ని ప్రవేశపెట్టి ప్రతి బీసీ కుటుంబానికి రూ.10లక్షలు మంజూరు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్‌ఆర్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీష్‌రావును బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, భూపేష్ సాగర్‌లతో కలిసి బీసీ బంధు పథకంపై చర్చించినట్లు తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని కోరారు. బీసీల బడ్జెట్ పెంచుతామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన మంత్రి దృష్టికి తెచ్చారు. బీసీ కార్పొరేషన్‌కు రూ.4 వేల కోట్లు మంజూరు చేయాలని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని, పెరిగిన ధరల ప్రకారం మెస్ చార్జీలు, స్కాలర్‌షిప్‌లను పెంచాలని, విదేశీ విద్య పథకం కింద అర్హులందరికీ స్టైఫండ్ ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రితో చర్చించి బీసీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

దేశాభివృద్ధిలో సర్వే ఆఫ్ ఇండియా పాత్ర కీలకం



ఓపెన్ డేను ప్రారంభిస్తున్న అడిషనల్ సర్వేయర్ జనరల్ పీవీ శ్రీనివాస్ తదితరులు

ఉప్పల్: శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశాభివృద్ధికి సర్వే ఆఫ్ ఇండియా ఎంతో కృషి చేస్తుందని సర్వే ఆఫ్ ఇండియా అడిషనల్ సర్వేయర్ జనరల్ పీవీ శ్రీనివాస్ అన్నారు. ఉప్పల్ సర్వే ఆఫ్ ఇండియాలో మంగళవారం జాతీయ సైన్స్ డేను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఓపెన్ డేను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన టెక్నాలజీతో వివిధ కోర్సుల్లో రెవెన్యూ, ఫారెస్ట్, డిఫెన్స్ ఎస్టేట్ అకాడమీ, సర్వే సెటిల్‌మెంట్, ల్యాండ్ రికార్డు తదితర విభాగాల ఉద్యోగులు, అధికారులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. డ్రోన్ టెక్నాలజీతో దేశవ్యాప్తంగా గ్రామాలను కలుపుతూ సమగ్రమైన మ్యాప్‌లను రూపొందించేందుకు 'స్వామిత్ర' ప్రాజెక్టుకు అవసరమైన శిక్షణ సైతం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం స్కూల్స్, కళాశాల, ఇంజినీరింగ్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఈ సందర్భంగా 20కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రింటింగ్, డిజిటలీకరణ, పురాతన మ్యాపింగ్ మిషన్, జీఐఎస్, జీపీఎస్ టోటల్ స్టేషన్ లెవలింగ్ తదితర స్టాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆంధ్ర, తెలంగాణ రీజియన్ డైరెక్టర్ ఎస్‌వీ సింగ్, సదరమ్ ప్రింటింగ్ గ్రూప్ డైరెక్టర్ టీపీ మల్లిక్, జీఐఎస్ అండ్, ఆర్‌ఐ డైరెక్టర్ బీసీ.ఫరీద, డిప్యూటీ సర్వేయర్ జనరల్ వరుణ్‌కుమార్, పంకజ మిశ్రా, కేవీ–1, కేవీ–2 ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ మన జీవితంలో భాగం



మసాబ్ ట్యాంక్: సైన్స్, మాథ్స్ మన జీవితంలో భాగమై ఉంటాయని ప్రభుత్వ బీ ఈడీ కాలేజీ ప్రిన్సిపాల్ ఉషారాణి అన్నారు. మంగళవారం కాలేజీలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో గ్లోబల్ వార్మింగ్ అనేది ప్రధాన సమస్యగా మారిందని, దానిని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. టెక్నాలజీ నానాటికి అభివృద్ధి చెందుతుందన్నారు. ఒక రోబో టీచర్ మాథ్స్, సైన్స్ పాఠాలు బోధిస్తోందని తెలిపారు. భావి టీచర్లుగా ఇలాంటి కొత్త టెక్నాలజీ అప్ గ్రేడ్ చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. ప్రొఫెసర్ డాక్టర్ రమాదేవి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు న్యూటన్ నియమం, టెస్లా సూత్రం, బెర్నలిస్ సూత్రం, రక్తపరీక్ష, గుండె, ఊపిరితిత్తుల పని తీరు, హాలోగ్రామ్, అరటి పండు డీ ఎన్ ఏ టెస్ట్ తదితర ప్రయోగాలను నిర్వహించారు. మూఢ నమ్మకాలపై విద్యార్థులు శివరాం, అన్వేష్, ప్రేంచంద్, పవిత్ర, శ్వేత, భాగ్యశ్రీ చేసిన స్కిట్ అలరించింది. కార్యక్రమంలో గెస్ట్ లెక్చరర్స్ థామస్, అజీముద్దీన్, రామిరెడ్డి, సయ్యద్ అస్గర్, విజయలక్ష్మి, కోమలవల్లి, బీఈడీ, ఎంఈడీ విద్యార్థులు పాల్గొన్నారు.

లిపిడెమో చికిత్సలో రెన్యూవియన్...



రెన్యూవియన్ పరికరాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

సాక్షి, సిటీబ్యూరో: ఓజస్ ఈస్తెటిక్స్ ఆధ్వర్యంలో దక్షిణ భారత దేశంలోనే మొదటి సారిగా రెన్యూవియన్ వైద్య పరికరాన్ని విడుదల చేసింది. ఓజస్ ఈస్తటిక్స్ మంగళవారం మాదాపూర్‌లోని జూబ్లీ రిడ్జ్ హోటల్‌లో వేదికగా లిపెడెమో మెడికల్ కండిషన్‌పై (స్త్రీలను ప్రభావితం చేసే బంధన కణజాల రుగ్మత) ఈ–బుక్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో భాగంగా అధునాతన రెన్యూవియన్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి వినయ్‌కుమార్ పువ్వల, ఎఫ్‌బిఐ మిస్ ఇండియా 2023 అనీషాబుసా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వినయ్ మాట్లాడుతూ... రెన్యూవియన్ పరికరం వ్యాధికి, సౌందర్యానికి మధ్య వారధిగా పనిచేస్తుందన్నారు. దక్షిణాదిన ఈ సేవలను ప్రారంభించడం కోసం ఓజస్ ఈస్తెటిక్స్ యుఎస్‌ఏలోని రెనివియన్‌తో జతకట్టిందన్నారు. ఓజస్ ఈస్తెటిక్స్ వ్యవస్థాపకులు డాక్టర్ నాగేష్,డాక్టర్ సీతాలక్ష్మి, జిత్రి లేజర్స్ ఫౌండర్ సురేష్ పాల్గొన్నారు.

కామన్ రిక్రూట్‌మెంట్ బిల్లును ఆమోదించండి

గవర్నర్‌కు బోయినపల్లి వినోద్‌కుమార్ విజ్ఞప్తి



ఉస్మానియా యూనివర్సిటీ: విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక ఉద్యోగాల భర్తీకి ఏర్పాటు చేసిన కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు బిల్లును ఆమోదించాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీలో ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (ఔటా) ఆధ్వర్యంలో ×వర్సిటీల అధ్యాపకుల సమస్యలు ఉన్నత విద్యలో సవాళ్లు× అంశంపై ఏర్పాటు చేసిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన వినోద్‌కుమార్ మాట్లాడుతూ బిల్లులో సందేహాలు ఉంటే వాటిని నివృత్తి చేసి మార్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వర్సిటీల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇప్పటికే అనుమతించిన 1062 అధ్యాపక పోస్టులతో పాటు మరో వెయ్యి పోస్టుల భర్తీకి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వర్సిటీ అధ్యాపకుల ఉద్యోగ విరమణ వయస్సుతో పాటు హెల్త్‌కార్డులు తదితర సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా ఔటా నాయకులు వినోద్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వర్సిటీల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ జిల్లాలోని ముఖరా అనే చిన్న పల్లెను చూస్తే సినిమాల్లోనే ఇలాంటి పల్లె ఉంటుంది అనిపిస్తుంది. మూడేళ్లలో దీనిని ఇలా తీర్చిదిద్దింది సర్పంచ్ మీనాక్షి గాడ్గె. అందుకే ఆమెకు రాష్ట్రపతి నుంచి ఆహ్వానం అందింది. ఎందుకో చదవండి...


ముఖరా గ్రామ పంచాయతీ కార్యాలయం
ముఖరా గ్రామంలోని ఒక వీధి

ఇది మీనాక్షి ఊరు


మీనాక్షి

నూట అరవై కుటుంబాలు 700 జనాభా ఉన్న ఆ చిన్న ఊరు ఎంత ముచ్చటగా ఉంటుందంటే ప్రతి ఊరు ఇలాగే ఉంటే బాగుండు అనిపిస్తుంది. మూడేళ్ల క్రితం వరకూ అది అన్నింటిలాగే ఒక మామూలు పల్లె. మూడేళ్లలో దేశ వ్యాప్తంగా వార్తల్లో నిలిచే స్థాయికి ఎదిగింది. దానికి కారణం సర్పంచ్ మీనాక్షి గాడ్గె. ఆమె కృషి, పట్టుదల ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముఖరా గ్రామాన్ని అద్భుతమైన గ్రామంగా తీర్చిదిద్దాయి.

నూతన గ్రామపంచాయతీ

ఒకప్పుడు అనుబంధ గ్రామంగా ఉన్న ముఖరా 2019లో నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడింది. సర్పంచ్ పదవి బీసీ మహిళకు రిజర్వ్ అయ్యింది. గ్రామ కమిటీ అధ్యక్షుడుగా ఉన్న సుభాష్ గాడ్గె తన భార్య మీనాక్షిని సర్పంచ్‌గా పోటీ చేయమని ప్రోత్సహించాడు. అక్షరాస్యత అంతంత మాత్రమే ఉన్న ఆ గ్రామంలో ఇంటర్ వరకూ చదివి అందరితో స్నేహంగా ఉండే మీనాక్షి ఆ పదవికి తగినదేనని ఊరంతా భావించింది. ఏకగ్రీవంగా ఆమెను సర్పంచ్‌గా ఎన్నుకుంది. ఈ నిర్ణయం మీనాక్షిని బాగా కదిలించింది. తన మీద ఇంత విశ్వాసం ఉంచిన గ్రామానికి పూర్తిగా సేవ చేయాలని గట్టిగా నిశ్చయించుకుంది.

అన్నీ మంచి పనులే

మీనాక్షి సర్పంచ్ అయిన వెంటనే చేసిన మొదటి పని ఊళ్లో ప్రతి ఇంట్లో మరుగుదొడ్లు కట్టించడం. దాంతో ఊరు ఒక్కసారిగా బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత గ్రామంగా మారిపోయింది. ఆ తర్వాత తాగునీరు ప్రతి ఇంటికి అందేలా చేయడమే కాకుండా ప్రతి ఇంట్లో ఇంకుడుగుంత ఏర్పాటు చేసి వృథానీరు ఆ గుంటలో పోయేలా చూసిందామె. దాంతో భూగర్భ జలాలు పెరిగాయి. ఊరి బయట పెద్ద వాగు వానొస్తే పొంగి రాకపోకలకు తీవ్ర అంతరాయం జరిగేది.

చెత్తను ఎరువుగా అమ్మి

ముఖరాలో తడి చెత్త - పొడి చెత్త విభజనను ప్రతి ఒక్కరూ పాటిస్తారు. తడి చెత్త నుంచి ఎరువు తయారు చేసి రైతులకు అమ్మి పంచాయతీకి లాభం సంపాదించిపెడుతోంది మీనాక్షి. ఎరువు అమ్మకం ద్వారా 6 లక్షలు వస్తే వాటిలో నాలుగు లక్షలు వెచ్చించి ఊళ్లో 6 కె.వి. సోలార్ గ్రిడ్లు ఏర్పాటు చేసింది. ఇక్కడ తయారయ్యే కరెంటులో 4 కిలో ఓల్టులు పంచాయతీ ఉపయోగించుకున్నా 2 కిలో ఓల్ట్‌లను పవర్ గ్రిడ్‌కు అమ్మడం ద్వారా లాభం రానుంది.

మీనాక్షి వంతెన కట్టించింది. పక్కా రోడ్ల నిర్మాణం, సైడు కాలువల వల్ల శుభ్రత ఏర్పడింది. పాత భవనంగా ఉన్న స్కూలును కొత్త భవన నిర్మాణం చేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దడమే కాదు ఇంగ్లిష్ మీడియంలో చెప్పడానికి టీచర్లను నియమించింది. దాంతో 1 నుంచి 5 వరకు ఊళ్లో ప్రతి ఒక్క విద్యార్థి ఈ ప్రభుత్వ బడిలోనే చదువుతున్నాడు.

దయల్ 100కు ఒక్క కాల్ లేదు

'గత మూడేళ్లుగా మా ఊరి నుంచి దయల్ 100కు ఒక్క కాల్ కూడా వెళ్లలేదు' అంటుంది మీనాక్షి. దానికి కారణం సంపూర్ణ మద్యపాన నిషేధం విధించడమే. దాని వల్ల సగం గొడవలు లేకుండా పోయాయి. మద్యం తాగితే జరిమానా విధిస్తారు. అంతేకాదు గ్రామమంతా శాకాహారాన్ని అలవాటు చేసుకుంది. ఆరోగ్యం కోసం శాకాహారాన్ని ప్రచారం చేయడం వల్ల ఈ మార్పు వచ్చింది. ఊరిలో చిన్న అంగడి కూడా నగదు రహిత లావాదేవీలు నిర్వహిస్తుంది. ఇక ఊరిలో నలభై వేల చెట్లు ఉన్నాయి. హరితహారంలో భాగంగా పది వేల మొక్కలు నాటి వాటిని పూర్తిగా కాపాడుకున్నారు. ఊళ్లోనే ఒక నర్సరీ ఉంది. వీటన్నింటి వల్ల ఊరు చల్లటి నీడలో ఉంటుంది. ఇందువల్లేనేమో కరోనా ఈ ఊరు దరిదాపులకు రాలేదు.

మహిళా విజేత


ఇన్ని మంచి పనులు చేసింది కనుకనే మీనాక్షిని మార్చి 4న కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖ 'స్వచ్ఛ సుజల్ శక్తి సమ్మాన్-2023' కార్యక్రమంలో భాగంగా మహిళా దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా 'మహిళా విజేత' పురస్కారంతో సత్కరించనుంది. 'నా భర్త, పిల్లలు, ఊరి ప్రజలు... వీరందరి సహకారం వల్లే ఈ పురస్కారం' అని మీనాక్షి అంది.

– ఇన్‌పుట్స్: గొడిసెల కృష్ణకాంత్ గౌడ్, సాక్షి, ఆదిలాబాద్

'కొత్త భాష నేర్చుకోవడం అంటే కొత్త వ్యక్తిగా రూపాంతరం చెందడమే' అనే మాట ఉంది. ఇది సరేగానీ, 'ఫలాన భాష టు ఫలాన భాష' సాంకేతికంగా ట్రాన్స్‌లేషన్స్ ఆప్షన్స్ ఉన్న ఈ కాలంలోనూ ఎందుకు యువతరం కొత్త భాషలు నేర్చుకోవడంపై ఆసక్తి ప్రదర్శిస్తోంది?

మీకెన్ని భాషలొచ్చు!?

యూత్ ప్లస్



రకరకాల ఇజాలు యువతరానికి కొత్త కాదు. అయితే యువతరంలో కొంతమంది 'హైపర్ పాలిగ్లాటిజం'పై ఆసక్తి చూపుతున్నారు. హైపర్ పాలిగ్లాటిజం అంటే బహు భాషల్లో ప్రవేశం. ఒకప్పుడు జ్ఞానదృష్టితో కొత్త విషయాలు నేర్చుకోవాలనే ఉద్దేశంతో కొత్త భాషలు నేర్చుకునేవారు.

అయితే గ్లోబలైజేషన్ పరిణామంలో ఉద్యోగాల విషయంలో బహు భాషలు మాట్లాడేవారికి, కొత్త భాషలను వేగంగా నేర్చుకోగలిగే వారికి డిమాండ్ పెరిగింది. దీంతో యువతరం కొత్త భాషలు నేర్చుకోవడంపై ఆసక్తి ప్రదర్శిస్తోంది.

అయితే ఇప్పటి యువతరం '30 రోజుల్లో కొత్త భాష' అని అంగట్లో దొరికే పుస్తకాల కంటే చాలా ముందు ఉంది. కొత్త భాషలను నేర్చుకోవడానికి రకరకాల టెక్నిక్స్‌ను అనుసరిస్తోంది. అందులో ఒకటి పాటతో కొత్త భాషపై పట్టు సాధించడం. అంటే మనం నేర్చుకునే భాషకు సంబంధించి వాక్యాలను పాపులర్ పాటల బాణీలలో పాడుకోవడం. దీనికి మూలం... నాగాలాండ్‌కు చెందిన 'ది తెట్సియో సిస్టర్స్' మ్యూజిక్ బ్యాండ్. మృత్యుశయ్యపై ఉన్న తమ మాతృభాష 'చోక్రి'ని బతికించుకోవడానికి ఈ బ్యాండ్ సంగీతాన్ని ఉపయోగించుకుంది. పాటలన్నీ తమ భాషలోనే ఉంటాయి. దీంతో యువతరం సులభంగా తమ భాషతో కనెక్ట్ అయింది. త్రిపురలోని ముగ్గురు సభ్యుల యంగ్ బ్యాచ్ తమ మాతృభాష 'కోక్‌బోరోక్' ను కాపాడుకోవడానికి జానపద బాణీలను ఆశ్రయిస్తోంది. అది మంచి ఫలితం ఇస్తోంది.

బహు భాషలు నేర్చుకోవాలనుకునే యువతరానికి ఇటలీకి చెందిన 'మెజో ఫాంటీ జిసెపీ' రోల్ మోడల్. 30 భాషలు మాట్లాడడంలో జిసెపీ దిట్ట.

ఇప్పుడు ప్రపంచంలో ఏ మూల అయినా ఉద్యోగం చేసే పరిస్థితుల్లో ఉన్నాం. స్థానికులతో కలిసి పనిచేయడానికి, ఆయా భాషలను వేగంగా నేర్చుకునే నైపుణ్యాలను కంపెనీలు కోరుకుంటున్నాయి. దీంతో 'స్వ కార్యం స్వామి కార్యం' లాగా కొత్త భాషలు నేర్చుకోవడంపై యువతరం ఆసక్తి ప్రదర్శిస్తోంది.

బహు భాష భాషిణి

తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన 26 సంవత్సరాల కిరుభాషిణి జయకుమార్ బహుభాష ప్రవీణ. హిందీ, సంస్కృతం, కన్నడం, బెంగాలీ మొదలైన భారతీయ భాషలతో పాటు ఫ్రెంచ్, జర్మన్, జపనీస్, అరబిక్... మొదలైన భాషలు మాట్లాడగలదు. దేశ, విదేశాలకు సంబంధించి 15 భాషల్లో కిరుభాషిణికి ప్రవేశం ఉంది. ఎనిమిది సంవత్సరాల వయసు నుంచే కొత్త భాషలు నేర్చుకోవడంపై కిరు ఆసక్తి చూపేది.


కిరుభాషిణి

'ఒక భాషలో ప్రవేశం ఉంది అంటే ఓన మాలు తెలియడం కాదు. పదాలు సరిగ్గా పలకాలి. రాయాలి. భాష ఆత్మను పట్టుకోగలగాలి' అంటుంది కిరుభాషిణి. తనకు తెలిసిన భాషలకు సంబంధించిన పుస్తకాలు చదవడం మాత్రమే కాదు, ఆయా భాషలకు సంబంధించిన వ్యక్తులతో సంభాషించడం ద్వారా భాషకు సంబంధించిన నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకుంటుంది కిరు. 'రెండు డీ లు ఉంటే ఎవరైనా కొత్త భాషలో ప్రవేశం సంపాదించవచ్చు' అంటోంది కిరుభాషిణి. ఆ రెండు డీ లు....ఒకటి డెడికేషన్, రెండోది డైలీ ప్రాక్టీస్. ప్రతి రోజూ నిద్ర పోయేముందు తనకు తెలిసిన భాషలకు సంబంధించిన పుస్తకం ఒకటి చదవడం ఆమె అలవాటు. 20 భాషలు నేర్చుకోవాలనేది కిరుభాషిణి లక్ష్యం.

బ్యూటిప్స్

కొబ్బరి పాలతో స్క్రబ్

కొబ్బరి పాలలో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలుంటాయి. ఇవి చర్మ ఆరోగ్యాన్ని కాపాడతాయి. దీనివల్ల ఎక్కువ కాలం చర్మం యవ్వనంగా కనిపిస్తుంది. • కొబ్బరి పాలల్లో దూదిని ముంచి ముఖానికి, మెడకు రుద్దుకోవాలి. పావుగంట తర్వాత చల్లటి నీటితో కడిగేసుకొంటే మంచి ఫలితం కనిపిస్తుంది. • ఇలా యాంటీ ఏజింగ్ ప్యాక్స్‌ను వారానికి రెండు నుంచి మూడు సార్లు వేసుకోవడం ద్వారా చర్మాన్ని ముడతలు పడకుండా కాపాడుకోవచ్చు.



మేనికాంతికి ఉసిరి.. నిమ్మ... నారింజ

తేనెను తరచూ మన ముఖానికి రాసుకుంటూ ఉంటే, ముఖం మీద ఉండే నల్లటి మచ్చలు తగ్గుముఖం పడతాయి. తేనెతో పెదవులకు మసాజ్ చేస్తే మృదువుగా, అందంగా కనిపిస్తాయి. చర్మాన్ని ఆరోగ్యంగా మెరిపించడంలో విటమిన్ సి ప్రముఖ పాత్ర పోషిస్తుంది. అందువల్ల విటమిన్ సి పుష్కలంగా ఉండే ఉసిరిని అది దొరికినంతకాలం విరివిగా తీసుకోవాలి. నిమ్మకాయ, నారింజలోనూ విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఉసిరి దొరకనప్పుడు వీటిని తరచూ తీసుకోవడం వల్ల కూడా అందంగా మారవచ్చు. అలాగే, వేపాకులు వేసిన నీటితో స్నానం చేయడం, తరచు ముఖాన్ని కడుక్కోవడం, ద్రవ పదార్థాలు సమృద్ధిగా తీసుకోవడం వల్ల మొటిమలు, మచ్చలు లేకుండా మేని చర్మం మెరుపులీనుతూ ఉంటుంది.

గీత మార్చుకుంది...

ఎవరి సామర్థ్యాలేంటో వారికే తెలిసినప్పటికీ శరీరం సహకరించడం లేదనో, ఆర్థిక స్థితిగతులు బాగోలేవనో ఏదో కారణంతో వెనకడుగు వేస్తుంటారు. కానీ, 42 ఏళ్ల గీతా ఎస్ రావు వాటన్నింటినీ అధిగమించి తన సత్తా ఏమిటో ప్రపంచానికి చూపుతోంది. పోలియోతో బాధపడుతున్నా శ్రీనగర్ నుంచి కన్యాకుమారి వరకు జాతీయస్థాయిలో నేడు ప్రారంభమయ్యే లాంగెస్ట్ సైకిల్ రేస్‌లో పాల్గొనబోతోంది. ఈ సైక్లింగ్‌లో రేస్‌లో పాల్గొంటున్న ఏకైక మహిళ గీతా ఎస్ రావు. 'నేను సాధించగలను' అనే ధీమాను తన విజయంలోనే చూపుతున్న మహిళగా ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోంది. ఇంపాజిబుల్ అనేవారికి ఇటీజ్ పాజిబుల్ అనే సమాధానం ఇస్తుంది.




గీతా ఎస్ రావు

నేడు శ్రీనగర్ నుండి ప్రారంభమై కన్యాకుమారి వరకు జరిగే 3,551 కిలోమీటర్ల లాంగ్ సైక్లింగ్ రేస్‌లో పాల్గొంటున్నది గీతా ఎస్ రావు. డిఫరెంట్లీ-ఏబుల్డ్ గానే కాదు ఇలా సైక్లింగ్ రేస్‌లో పాల్గొంటున్న ఏకైక మహిళగా కూడా గుర్తింపు పొందింది ఆమె. అహ్మదాబాద్‌లో ఉంటున్న గీతకు మూడేళ్ల వయసులో పోలియో కారణంగా ఎడమ కాలు చచ్చుబడిపోయింది. గీత తల్లిదండ్రులు ఆమెను మిగతా పిల్లలమాదిరిగానే ధైర్యం నూరిపోస్తూ పెంచారు. కొన్నాళ్లు బెడ్‌కే అంకితమైపోయిన గీత ఆ తర్వాత వీల్ చెయిర్, హ్యాండికాఫ్డ్ బూట్స్‌తో నిలబడింది. అక్కడ నుంచి ఒక్కో మెట్టు సాధన చేస్తూ ట్రెక్కింగ్, బంగీ జంపింగ్, పారాగ్లైడింగ్, వాక్ త్రూ, స్విమ్మింగ్, బ్యాడ్మింటన్, మారథాన్.. ఇలా ఒక్కో ప్రయత్నం ఆమెను శక్తిమంతురాలిగా నిలబెట్టాయి. ఆమె తన కలలను సాకారం చేసుకోవడానికి తన సంకల్ప శక్తినే ఆయుధంగా చేసుకుంది.

పడిపోతూ.. నిలబడింది

రెండు కాళ్లూ సరిగ్గా ఉన్న సైక్లిస్టులు రోడ్డు ప్రమాదాల్లో మరణించడం చూసి చలించిపోయేది. తను సైక్లిస్ట్‌గా మారలేనా అనుకుంది. ముప్పై ఏళ్ల వయసులో సైకిల్ నేర్చుకునే ప్రయత్నం చేసింది. రోడ్డు మీద సైక్లింగ్ చేసే సమయంలోనూ చాలా సార్లు పడిపోయింది. తల నుండి కాలి వరకు గాయలయ్యాయి. కానీ, శరీరం సహకరించలేదనే నెపంతో తనకు నచ్చిన సైక్లింగ్‌ను మూలనపడేయకూడదు అనుకుంది. తన లాంటి వారికి ప్రేరణగా నిలవాలనుకుంది. ఆ స్థైర్యమే ఆమెను పారా ఒలిపింక్ గేమ్స్ వరకు తీసుకెళ్లింది. 2016లో మొదలుపెట్టిన ఆమె సైకిల్ ప్రయాణం ఇప్పటికి 80 వేల కిలోమీటర్ల వరకు సాగింది. మొదట్లో 200 మీటర్లు కూడా సైకిల్ తొక్కలేకపోయేది. కానీ, త్వరలో ప్యారిస్‌కు చెందిన ఆడాక్స్ క్లబ్ పర్షియన్ రాండెన్యుర్ రైడ్స్‌లో పాల్గొనబోతోంది. ఒక యేడాదిలోనే 200, 300, 400, 600 కిలోమీటర్ల రైడ్‌లను కొన్ని గంటల్లోనే సాధించింది.

తన రికార్డులను తనే తిరగరాస్తూ..

నియమాలకు కట్టుబడి, సమయాన్ని సమర్థంగా ఉపయోగించుకుంటే వికలాంగులు కూడా సమర్థులైన వ్యక్తులుగా సమాజంలో నిలబడతారు అని తన కథనం ద్వారానే నిరూపిస్తుంది గీత. 2017 డిసెంబర్‌లో లిమ్కాబుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తన పేరు నమోదు చేసుకుంది. భారతదేశపు మొట్టమొదటి డిఫరెంట్లీ-ఏబుల్ సైక్లిస్ట్‌గా పేరు సంపాదించుకుంది. 2020-21లో తన రికార్డును తనే తిరగరాసుకుంది. ఈ యేడాది జనవరిలో వడోదర నుండి ధోలవీర వరకు వెయ్యి కిలోమీటర్ల రైడ్‌ను 73 గంటల 30 నిమిషాలలో పూర్తి చేసింది. హైదరాబాద్‌లో జరిగిన భారత జట్టు జాతీయ సెలక్షన్‌లలోనూ గీత మొదటి స్థానంలో నిలిచింది. ఆసియా ఛాంపియన్‌షిప్ కోసం ఆమెకు శిక్షణ ఇచ్చేందుకు స్వచ్ఛందంగా కోచ్‌లు ముందుకు వచ్చారు.


మద్దతు కోసం

తన కలలను సాకారం చేసుకోవడానికి గీత ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల నుండి స్పాన్సర్‌షిప్ కోసమూ ప్రయత్నిస్తోంది. ఈ పోరాట ప్రయాణానికి ఎంతో మంది తమ మద్దతును తెలియజేస్తున్నారు. ఇందులో భాగంగా లాంగెస్ట్ రేస్‌లో గీత పాల్గొనడానికి హైదరాబాద్‌లోని సుహానా హెల్త్ ఫౌండేషన్, ధాత్రి మదర్స్ మిల్క్ బ్యాంక్ నుంచి ఆమెకు మద్దతు లభిస్తోంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ –'ఇది జాతీయ స్థాయిలో జరిగే అతి పెద్ద రేస్. విభిన్నంగా ఉండే మన దేశీయ వాతావరణంలో, సుందరమైన ప్రదేశాల మీదుగా ఈ రేస్ ఉంటుంది. దేశంలోని వారే కాదు ప్రపంచంలోని మారుమూలప్రాంతాల నుంచి కూడా ఈ రేస్‌లో పాల్గొంటున్నారు. అతి పొడవైన ఈ సైక్లింగ్ రేస్ 12 రోజుల్లో 12 రాష్ట్రాలను దాటాలి' అని తెలియజేస్తుంది. సైక్లిస్ట్‌గానే కాదు గీత ట్రావెలర్‌గానూ పేరు తెచ్చుకుంది. కార్పొరేట్ కమ్యూనికేషన్, బిఎస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసిన గీత ఐటీ మేనేజర్‌గా ఉద్యోగమూ చేసింది. ఎంట్రప్రెన్యూర్‌గా సొంతంగా కార్పొరేట్ కంపెనీకి డైరెక్టర్‌గా ఉంది.

పిల్లలు సైకిల్ నేర్చుకునేటప్పుడు, ప్రాక్టీస్ చేసేటప్పుడు ఎంత ఉత్సాహంగా ఉంటారో గీత అంతే హుషారును చూపుతుంది. ఆ సాధన, ఆనందం ఆమెను ప్రపంచ కప్ సాధించే దిశగా తీసుకెళుతుంది.. వచ్చే సంవత్సరం ప్యారిస్‌లో జరిగే పారాలింపిక్స్‌లో భారత దేశం నుంచి సైక్లింగ్‌లో మొట్టమొదటి ఒలింపిక్ పతకాన్ని గెలుచుకురావాలని తపిస్తున్న గీత కలలు ఎంతో మందికి ఆదర్శం కావాలి.

సమస్యలకు ఎదురెళ్లి

ఆసియా ఛాంపియన్‌షిప్ రేసులో ఎదురు దెబ్బ తగిలి, కింద పడిపోయింది. సైక్లింగ్ షూస్ చిరిగిపోవడం, పెడల్ నుంచి జారి పడిపోవడంతో ఎడమ కాలు మరింతగా బాధపెట్టింది. అయినప్పటికీ కొండ ప్రాంతాలు, ఎత్తైన ప్రదేశాల గుండా ఆమె తన రేస్‌లో పాల్గొంది. రెండవ స్థానంలో నిలిచి బహుమతి ప్రదానోత్సవానికి గంట ముందు అంబులెన్స్‌లో చికిత్స తీసుకుంటూ ఉంది. కిందటేడాది పారాసైక్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో సూపర్ రాండన్యుర్‌గా పేరొందింది. ఒలింపిక్ ట్రై-అథ్లెట్‌లో రజత పతకాన్ని సాధించింది.


ప్రతీకాత్మక చిత్రం

పెళ్లి ఎప్పుడు చేసుకోవాలి? 'మాకు చేసుకోవాలనిపించినప్పుడు' అంటారు పిల్లలు. 'మేము చేయాలనుకున్నప్పుడు' అంటారు తల్లిదండ్రులు. 'మేము కన్న మా పిల్లల భవిష్యత్తు మాకు తెలియదా' అని ప్రశ్నిస్తారు కూడా. అలాగే పిల్లల నిర్ణయం ప్రకారమే అనుకుంటే అది పదిహేనేళ్ల కావచ్చు, పాతికేళ్లు కావచ్చు. అందుకే ప్రభుత్వం వివాహానికి ఒక వయసును నిర్ధారించింది. అమ్మాయిలకు 18, అబ్బాయిలకు 21ని వివాహ వయసుగా నిర్ధారిస్తూ అంతకంటే ముందు పెళ్లి జరిగితే ఆ పెళ్లిని బాల్య వివాహంగా పరిగణించాలని కూడా చెప్పింది. అలా వచ్చిన చట్టమే 'ప్రొహిబిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజ్ యాక్ట్- 2006', అంటే బాల్య వివాహ నిషేధ చట్టం అన్నమాట.

బాల్యానికి బందిఖానా!

అమ్మాయి అక్షరాలు దిద్దుతోంది కానీ...

చట్టాలు పని చేస్తూనే ఉన్నాయి. సమాజం చైతన్యవంతం అవుతూనే ఉంది. అమ్మాయిల అక్షరాస్యత శాతం పెరుగుతోంది. అయినా బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయి. అక్షరాస్యత శాతం పెరుగుతోంది కానీ పాఠశాల విద్య దాటి కాలేజ్ బాట పట్టే సంఖ్య తక్కువగానే ఉంది. ఆ చదువు కూడా ఇప్పటికీ ఇంటర్ దాటడం లేదు. మనం చెప్పుకుంటున్న కేస్‌స్టడీలు గ్రామాలు, అల్పాదాయ వర్గానికి చెందినవి కావడం గమనార్హం. బాల్య వివాహాలకు 'తల్లిదండ్రులకు చదువు లేకపోవడంతోపాటు సమాజంలో ఆడపిల్లకు భద్రత కరువవడం' కూడా కారణమేనంటారు కైలాశ్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ అనుబంధ విభాగం 'బచ్‌పన్ బచావో ఆందోళన్' తెలంగాణ రాష్ట్ర సమన్వయ కర్త చందన.



2025 నాటికి స్త్రీ-పురుష సమానత్వంతోపాటు మహిళలు, బాలికల సాధికారత సాధించాలని ఐక్యరాజ్యసమితి ఒక లక్ష్యంగా నిర్దేశించింది. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే బాలికల విద్య మీదనే దృష్టి పెట్టాలి. అల్పాదాయ వర్గాల వాళ్లు కూడా అమ్మాయి పెళ్లికి లక్షలు ఖర్చు చేస్తున్నారు. చదివించడం లేదెందుకంటే 'మా దగ్గర డబ్బులెక్కడున్నాయ్' అంటారు. అలాంటి వాళ్లందరికీ నేను చెప్పేదొక్కటే... 'పెళ్లికి చేసే ఖర్చుని అమ్మాయి చదువుకి ఉపయోగించండి. మీ అమ్మాయి జీవనస్థాయి మారుతుంది.

– చందన, కో ఆర్డినేటర్, బచ్‌పన్ బచావో ఆందోళన్, తెలంగాణ


బాల్యాన్ని హరించడమే!

''బాల్య వివాహం కూడా మానవ హక్కుల ఉల్లంఘనే. వివాహం, పని, ఒత్తిడితో కూడిన చదువు... ఇవన్నీ పిల్లల బాల్యాన్ని హరించేవే. పిల్లల బాల్యాన్ని హరించే హక్కు కన్నవాళ్లకు కూడా ఉండదు. బాల్యవివాహాల నియంత్రణ కోసం చేస్తున్న ప్రయత్నాల్లో అతి పెద్ద విఘాతం కరోనా రూపంలో వచ్చి పడింది. మునుపు 35గా ఉన్న బాల్య వివాహాల శాతం కరోనా కారణంగా 2020లో 62 శాతానికి పెరిగిపోయింది. ఆ తర్వాత ఏడాది కొంత తగ్గి 57 శాతం దగ్గర ఆగింది. ప్రభుత్వ పథకాలు కొంత వరకు బాల్య వివాహాలను తగ్గించగలుగుతున్నాయి. కానీ రావలసినంత మార్పు రాలేదనే చెప్పాలి. దేశంలో ఉత్తరాది రాష్ట్రాల కంటే మెరుగ్గా ఉన్నామని సంతోషం పడడమే ఇప్పటికి మనం సాధించింది'' అన్నారు చందన.

– వాకా మంజులారెడ్డి

ఐదు వేల బాల్య వివాహాలను నివారించాం

మనదేశంలో ప్రతి ముగ్గురు ఆడపిల్లల్లో ఒకరు బాల్య వివాహం చట్రంలో నలిగిపోతున్నారు. మేము ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహిళాసాధికారత కోసం నిర్వహించిన 'సబల' కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లగలిగాం. అధికారులు ఐదు వేల బాల్య వివాహాలను నివారించగలిగారు. బాల్య వివాహ వ్యవస్థ తరతరాలుగా వస్తున్న దురాచారం. దీన్ని రూపుమాపడానికి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి, పూర్తిగా నివారించడానికి ఇంకా కొన్నేళ్లు పడుతుంది. దీనికి మూలకారణం ఆర్థిక స్థితిగతులు, చదువు. ఆడపిల్లలను చదివించడం మీద దృష్టి పెట్టిన కుటుంబం బాల్య వివాహానికి దూరంగా ఉన్నట్లే. మహిళ సాధికారత సాధిస్తే తన కూతురిని ఈ చట్రంలో ఇరుక్కోకుండా రక్షించుకోగలుగుతుంది. అందుకే బాలికల విద్య, మహిళల ఆర్థికస్వయం సమృద్ధి పూర్తి స్థాయిలో సాధించగలిగిన రోజు బాల్య వివాహాలు వాటంతటవే నిర్మూలన అవుతాయి.



– వాసిరెడ్డి పద్మ, ఛైర్‌పర్సన్, మహిళా కమిషన్, ఆంధ్రప్రదేశ్



మార్క్‌రమ్ సెంచరీ: దక్షిణాఫ్రికా 314/8

వెస్టిండీస్ జట్టుతో సెంచూరియన్‌లో మంగళవారం మొదలైన తొలి టెస్టులో తొలి రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 82 ఓవర్లలో 8 వికెట్లకు 314 పరుగులు సాధించింది. ఓపెనర్లలో మార్క్‌రమ్ (174 బంతుల్లో 115 ; 18 ఫోర్లు) సెంచరీ సాధించగా... డీన్ ఎల్గర్ (118 బంతుల్లో 71 ; 11 ఫోర్లు) అర్ధ సెంచరీ చేశాడు. వీరిద్దరు తొలి వికెట్‌కు 141 పరుగులు జోడించారు. మార్కో జాన్సెన్ (17 బ్యాటింగ్; 3 ఫోర్లు), కోట్జీ (11 బ్యాటింగ్; 2 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. విండీస్ బౌలర్లలో అల్జారి జోసెఫ్ మూడు వికెట్లు తీసుకున్నాడు.

పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీకి టైటిల్



జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ అమ్మాయి పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ (కేరళ) జోడీ మహిళల డబుల్స్ విభాగంలో విజేతగా అవతరించింది. మంగళవారం పుణేలో జరిగిన ఫైనల్లో గాయత్రి-ట్రెసా జాలీ జోడీ 21-10, 21-9తో కావ్య గుప్తా-దీప్షిక సింగ్ (ఢిల్లీ) ద్వయంపై గెలిచింది.



విజేత గౌతమ్ జూనియర్ కాలేజి

- సీనియర్ విభాగంలో భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజీకి టైటిల్
- ముగిసిన తెలంగాణ సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ

SPL SAKSHI PREMIER LEAGUE | SAKSHI SAKSHI DIGITAL MEDIA GROUP

లాలాపేట: డిఫెండింగ్ చాంపియన్ గౌతమ్ జూనియర్ కాలేజి (ఈసీఐఎల్) జట్టు తెలంగాణ రీజియన్ సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీలో టైటిల్ నిలబెట్టుకుంది. హబ్సిగూడలోని ఐఐసీటీ మైదానంలో జరిగిన జూనియర్ విభాగం ఫైనల్లో గౌతమ్ కాలేజి జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో ఎస్ఆర్ఆర్ జూనియర్ కాలేజి (మంచిర్యాల) జట్టుపై ఘనవిజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఎస్ఆర్ఆర్ కాలేజి 11 ఓవర్లలో 50 పరుగులకే ఆలౌటైంది. గౌతమ్ కాలేజీ స్పిన్నర్ డి.మనీశ్ రెండు వికెట్లు పడగొట్టాడు. టోర్నీ మొత్తంలో మనీశ్ 12 వికెట్లతో టాప్ ర్యాంక్‌లో నిలిచాడు. అనంతరం గౌతమ్ కాలేజి జట్టు కేవలం. 4.2 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 52 పరుగులు చేసి గెలిచింది. అన్విత్ రెడ్డి 11 బంతుల్లో 24 పరుగులు చేశాడు. టోర్నీ మొత్తం నిలకడగా రాణించిన అన్విత్ రెడ్డి 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' అవార్డు సొంతం చేసుకున్నాడు. హెచ్‌సీఏ అండర్-14, అండర్-16 లీగ్‌లలో కూడా అన్విత్ రెడ్డి తన సత్తా చాటుకున్నాడు. బాలాజీకి 'మ్యాన్ ఆఫ్ ద ఫైనల్' అవార్డు లభించింది.

సీనియర్ విభాగంలో భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజి (సైనిక్‌పురి) జట్టు టైటిల్ సొంతం చేసుకుంది. ఫైనల్లో భవాన్స్ జట్టు 35 పరుగుల తేడాతో వాగ్దేవి డిగ్రీ కాలేజి (మంచిర్యాల) జట్టును ఓడించింది. ముందుగా భవాన్స్ జట్టు 15 ఓవర్లలో 6 వికెట్లకు 159 పరుగులు సాధించింది. రాహుల్ 36 బంతుల్లో 71 పరుగులు చేశాడు. అనంతరం వాగ్దేవి కాలేజి 14.4 ఓవర్లలో 124 పరుగులకు ఆలౌటైంది. నితీశ్ రెడ్డికి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, ఫైనల్' అవార్డులు దక్కాయి. జూనియర్, సీనియర్ విభాగాల్లో విజేతగా నిలిచిన జట్లకు రూ. 25 వేలు చొప్పున... రన్నరప్ జట్లకు రూ. 15 వేలు చొప్పున నగదు పురస్కారం లభించింది. తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లా రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విన్నర్స్, రన్నరప్ జట్లకు ట్రోఫీలను అందజేశారు. అబ్బాయిలకే కాకుండా అమ్మాయిలకు కూడా టోర్నీలు నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సాక్షి మీడియా గ్రూప్ డైరెక్టర్ రాణి రెడ్డి కూడా పాల్గొన్నారు.



భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజి జట్టు

'హ్యాట్రిక్' విజయంపై భారత్ గురి

నేటి నుంచి ఆస్ట్రేలియాతో మూడో టెస్టు

- గెలిస్తే టీమిండియా ఖాతాలో సిరీస్‌తోపాటు డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్
- సమస్యలతో ఆసీస్ సతమతం
- ఉదయం గం. 9:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



శుబ్‌మన్ గిల్, సూర్యకుమార్

ఇండోర్: 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'ని నిలబెట్టుకున్న భారత్ ఇప్పుడు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ బెర్త్‌పై కన్నేసింది. రెండు వరుస విజయాలతో తుదిపోరుకు మరింత చేరువైన టీమిండియా ఈ టెస్టు గెలిస్తే... చివరి టెస్టు, ఇతర జట్ల ఫలితాలతో సంబంధం లేకుండా ఫైనల్ చేరుతుంది. సొంతగడ్డపై జరుగుతున్న సిరీస్ కావడం... ఆటగాళ్లంతా ఆత్మవిశ్వాసంతో ఉండటం ఆతిథ్య జట్టును పటిష్టస్థితిలో ఉంచగా... గాయాలు, వరుస వైఫల్యాలతో పర్యాటక ఆస్ట్రేలియా జట్టు కునారిల్లుతోంది. ఈ నేపథ్యంలో భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య బుధవారం మొదలయ్యే మూడో టెస్టులో రోహిత్ శర్మ బృందం ఆరంభం నుంచే పైచేయి సాధించాలనే పట్టుదలతో ఉంది.

రాహుల్ స్థానంలో గిల్!

పేలవ ఫామ్‌తో ఇప్పటికే వైస్ కెప్టెన్సీ కోల్పోయిన కేఎల్ రాహుల్ తాజాగా తుది జట్టుకూ దూరమయ్యే అవకాశముంది. మూడు ఇన్నింగ్స్‌ల్లో అతని స్కోరు 20, 17, 1. ఓ టాపార్డర్ బ్యాటర్ ఆటతీరును సమీక్షిస్తున్న జట్టు మేనేజ్‌మెంట్ ఓపెనింగ్‌లో జోరు మీదున్న శుబ్‌మన్ గిల్‌ను బరిలోకి దించాలని చూస్తోంది. ఇది మినహా విజయవంతమైన జట్టులో ఇంకేం మార్పు ఉండదు. రోహిత్-గిల్ జోడీ ఇన్నింగ్స్ ఆరంభిస్తే పుజారా, కోహ్లి, శ్రేయస్ అయ్యర్‌లతో కూడిన మిడిలార్డర్ పటిష్టంగా ఉంది. అక్షర్ పటేల్ బంతి లేదంటే బ్యాట్‌తో జట్టును ఆదుకోవడం ఈ సిరీస్‌లో కలిసొచ్చింది. అతనితోపాటు జడేజా, అశ్విన్‌ల స్పిన్ త్రయం మళ్లీ కంగారూ-కంగారూ పెట్టేందుకు సిద్ధమైంది. పిచ్ పరిస్థితుల దృష్ట్యా ఆరంభంలో పేసర్లు షమీ, సిరాజ్‌లు కూడా ఇండోర్‌లో ప్రమాదకరం కావొచ్చు.



స్మిత్ సారథ్యంలో...

భారత పర్యటన మొదలైనప్పటి నుంచి ఆస్ట్రేలియా మైదానం లోపల, వెలుపల కష్టాలతో సహవాసం చేస్తోంది. కీలకమైన ఆటగాళ్ల గాయాలు, మ్యాచుల్లో వైఫల్యాలు నంబర్‌వన్ టెస్టు జట్టుకు ప్రతికూలంగా మారాయి. మూడంటే మూడు రోజుల్లోనే ఆటను ముగించడం చూస్తుంటే నిజంగా ఇది ఆస్ట్రేలియా జట్టేనా అనే అనుమానం కూడా రాక మానదు. తాజాగా రెగ్యులర్ కెప్టెన్ కమిన్స్ గైర్హాజరు (స్వదేశానికి తిరుగుముఖం)లో అనుభవజ్ఞుడైన స్టీవ్ స్మిత్ జట్టు పగ్గాలు చేపట్టాడు. మాజీ కెప్టెన్ సారథ్యంలో జట్టు ఏ మేరకు పుంజుకుంటుందో చూడాలి. ట్రావిస్ హెడ్, ఉస్మాన్ ఖాజాలు శుభారంభం అందిస్తేనే తర్వాత లబుషేన్, స్మిత్, గ్రీన్‌లు జట్టును నడిపిస్తారు. లేదంటే గత మ్యాచ్‌ల ఫలితాలే పునరావృతమయ్యే ప్రమాదముంది. ఈ నేపథ్యంలో తీవ్రమైన ఒత్తిడిలో ఉన్న ఆస్ట్రేలియా ఈ టెస్టును ఎన్ని రోజులు ఆడుతుందనేది ఆసక్తికరంగా మారింది.

పిచ్-వాతావరణం

ఇండోర్ పిచ్ ఆరంభంలో పేస్‌కు అనుకూలిస్తుంది. మూడో రోజు స్పిన్‌కు టర్న్ అవుతుంది. 2016లో న్యూజిలాండ్, 2019లో బంగ్లాదేశ్‌లతో జరిగిన మ్యాచ్‌ల్లో ఇదే జరిగింది. వేసవి వేడి మొదలవడంతో వాన ముప్పేమీ లేదు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్/రాహుల్, పుజారా, కోహ్లి, శ్రేయస్ అయ్యర్, జడేజా, శ్రీకర్ భరత్, అశ్విన్, అక్షర్, షమీ, సిరాజ్.

ఆస్ట్రేలియా: స్మిత్ (కెప్టెన్), హెడ్, ఉస్మాన్ ఖాజా, లబుషేన్, హ్యాండ్స్‌కాంబ్, గ్రీన్, క్యారీ, స్టార్క్, మర్ఫీ, లయన్, కున్‌మన్/బోలండ్.

'టెస్టు' థ్రిల్లర్... కివీస్ విన్నర్

వెల్లింగ్టన్: క్రికెట్లో వన్డేలు, టి20ల్లో రోమాంచకరమైన మ్యాచ్‌లెన్నో చూశాం. కానీ టెస్టుల్లో మాత్రం ఆసక్తికరమైన మ్యాచ్‌లు చాలా అరుదు. ఇప్పుడు కూడా ఈ అరుదైన మ్యాచ్... టి20లను మించి మరీ థ్రిల్ ఇవ్వడమే గొప్ప విశేషం. 2-0తో న్యూజిలాండ్ పర్యటన ముగించాల్సిన ఇంగ్లండ్ అనూహ్యంగా... ఒకే ఒక్క పరుగు తేడాతో 1-1తో సమం చేసుకోవాల్సి వచ్చింది. మంగళవారం ముగిసిన రెండో టెస్టులో కివీస్ ఎవరూహించని విధంగా ఒక పరుగు తేడాతో నెగ్గింది. 258 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు ఓవర్‌నైట్ స్కోరు 48/1తో ఆఖరి రోజు రెండో ఇన్నింగ్ కొనసాగించిన ఇంగ్లండ్ గెలుపు గడపదాకా వచ్చింది. కానీ 74.2 ఓవర్లలో 256 పరుగుల వద్ద ఆలౌటైంది. జో రూట్ (95; 8 ఫోర్లు, 3 సిక్సర్లు) ... స్టోక్స్ (33; 6 ఫోర్లు), ఫోక్స్ (35; 4 ఫోర్లు) గెలిపించే ప్రయత్నం చేసినా... న్యూజిలాండ్ బౌలర్లు పరుగు ముందే ఆలౌట్ చేశారు. వాగ్నర్ 4, సౌతీ 3, హెన్రీ 2 వికెట్లు తీశారు. ఫాలోఆన్‌లో పడి విజయం సాధించిన మూడో జట్టుగా కివీస్ గుర్తింపు పొందింది.



స్టోక్స్ సౌతీ

మెస్సీనే మేటి...

2022 ప్రపంచ ఉత్తమ ఫుట్‌బాలర్‌గా అర్జెంటీనా కెప్టెన్ ఎంపిక



పారిస్: తన అద్భుత ప్రతిభతో 36 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత అర్జెంటీనా జట్టును మళ్లీ ప్రపంచ చాంపియన్‌గా నిలబెట్టిన లియోనెల్ మెస్సీ 2022 ప్రపంచ ఉత్తమ ఫుట్‌బాలర్‌గా ఎంపికయ్యాడు. గత ఏడాది ఖతర్ ఆతిథ్యమిచ్చిన ప్రపంచకప్ ఫైనల్లో కెప్టెన్ మెస్సీ నేతృత్వంలోని అర్జెంటీనా పెనాల్టీ షూటౌట్‌లో ఫ్రాన్స్‌ను ఓడించి 1986 తర్వాత మళ్లీ జగజ్జేతగా నిలిచింది. ఈ టోర్నీలో మెస్సీ ఏడు గోల్స్ చేశాడు. ప్రపంచ ఉత్తమ ఫుట్‌బాలర్ అవార్డు కోసం మెస్సీ, కిలియాన్ ఎంబాపె (ఫ్రాన్స్), కరీమ్ బెంజెమా (ఫ్రాన్స్) పోటీపడ్డారు. జాతీయ జట్ల కెప్టెన్‌లు, కోచ్‌లు, ఎంపిక చేసిన జర్నలిస్టులు, ప్రపంచ ఫుట్‌బాల్ సమాఖ్యలో సభ్యత్వం ఉన్న 211 దేశాల ప్రతినిధులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఓటింగ్‌లో మెస్సీకి 52 పాయింట్లు రాగా... ఎంబాపెకు 44 పాయింట్లు, కరీమ్ బెంజెమాకు 34 పాయింట్లు వచ్చాయి. గత 14 ఏళ్లలో మెస్సీ ఏడోసారి ప్రపంచ ఉత్తమ ఫుట్‌బాలర్ అవార్డు గెల్చుకోవడం విశేషం. ఉత్తమ కోచ్‌గా అర్జెంటీనాకు ప్రపంచ టైటిల్ దక్కడంలో కీలకపాత్ర పోషించిన లియోనెల్ స్కలోని ఎంపికయ్యాడు. మహిళల విభాగంలో ప్రపంచ ఉత్తమ క్రీడాకారిణి అవార్డు స్పెయిన్‌కు చెందిన అలెక్సియా పుటెలాస్‌కు లభించింది.

మహిళల స్నూకర్ ప్రపంచకప్ విజేత భారత్



బ్యాంకాక్: మహిళల స్నూకర్ ప్రపంచకప్ టోర్నమెంట్‌లో భారత జట్టుకు టైటిల్ లభించింది. అమీ కమాని-అనుపమ రామచంద్రన్‌లతో కూడిన భారత 'ఎ' జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్లో అమీ కమాని-అనుపమ జోడీ 56-26, 67-27, 41-61, 27-52, 68-11, 55-64, 78-39తో ఇంగ్లండ్ 'ఎ' జట్టుకు చెందిన రీని ఇవాన్స్-రెబెకా కెన్నా ద్వయంపై విజయం సాధించింది.

సినిమా

గాయం... ఓ మంచి బహుమతి



త్రిష
సమంత

గాయం తియ్యగా ఉంటుందా... మనసు తీసుకునేదాన్ని బట్టి ఉంటుంది. కొందరు కథానాయికలు కొన్ని గాయాలను అలానే తీసుకున్నారు. పవర్‌ఫుల్ రోల్స్ చేసేటప్పుడు అయిన గాయాలను 'బహుమతి'గా, 'తియ్యని గాయం'లా అనుకుంటున్నారు. 'ఆగేదే లేదు' అంటూ దూసుకెళుతున్నారు. ఆ నాయికల గురించి తెలుసుకుందాం.

యాక్షన్‌కి దక్కిన బహుమతి

ఒకవైపు మయోసైటిస్ వ్యాధితో పోరాటం చేసి, దాదాపు కోలుకున్న సమంత మరోవైపు 'సిటాడెల్' వెబ్ సిరీస్‌లో పోరాట సన్నివేశాల్లో నటిస్తున్నారు. ఈ సిరీస్‌లో పవర్‌ఫుల్ రోల్ చేస్తున్న సమంత హాలీవుడ్ యాక్షన్ డైరెక్టర్ యానిక్ బెన్ దగ్గర శిక్షణ తీసుకున్నారు. ఆ తర్వాత షూట్‌లో పాల్గొన్నారు. అయితే యాక్షన్ సీన్ తీస్తున్నప్పుడు ఆమె రెండు చేతులకు గాయాలయ్యాయి. మంగళవారం ఆ ఫోటోను షేర్ చేసి, 'యాక్షన్‌కి దక్కిన బహుమతి ఇది' అని పేర్కొన్నారు సమంత. ప్రియాంకా చోప్రా ఓ లీడ్ రోల్‌లో రూసో బ్రదర్స్ తెరకెక్కించిన హాలీవుడ్ వెబ్ సిరీస్ 'సిటాడెల్'కి ఇండియన్ వెర్షన్‌గా వరుణ్ ధావన్, సమంత లీడ్ రోల్స్‌లో రాజ్ అండ్ డీకే ఈ సిరీస్‌ని తెరకెక్కిస్తున్నారు.

నొప్పిని మరచి...

గాయం చిన్నదైనా పెద్దదైనా నొప్పి మాత్రం కామన్. అయితే త్రిష మాత్రం గాయం తాలూకు నొప్పి తెలియలేదు అంటున్నారు. మణిరత్నం దర్శకత్వం వహించిన 'పొన్నియిన్ సెల్వన్' షూట్‌లో తగిలిన గాయాల గురించే త్రిష ఈ విధంగా అన్నారు. విక్రమ్, 'జయం' రవి, కార్తీ, ఐశ్వర్యా రాయ్, త్రిష తదితరులు ప్రధాన తారాగణంగా రెండు భాగాలుగా మణిరత్నం దర్శకత్వం వహించిన చిత్రం 'పొన్నియిన్ సెల్వన్'. తొలి భాగం గత ఏడాది సెప్టెంబర్ 30న విడుదల కాగా మలి భాగం ఏప్రిల్ 28న రిలీజ్ కానుంది. ఇందులో యువరాణి కుందవై పాత్ర చేశారు త్రిష. పోరాట సన్నివేశాల్లో నటించినప్పుడు తన చేతులకు గాయాలయ్యాయని, శోభిత ('పొన్నియిన్...'లో ఓ కీలక పాత్రధారి) చెవులకు కూడా గాయం అయిందని త్రిష పేర్కొన్నారు. అయితే గాయాల తాలూకు నొప్పిని మరచిపోయి షాట్ గ్యాప్‌లో కబుర్లు చెప్పుకుని, ఆ తర్వాత షూటింగ్‌లో పాల్గొనేవాళ్లమని త్రిష పేర్కొన్నారు. అలాగే 'పొన్నియిన్ సెల్వన్' తన జీవితంలో ఓ మంచి జ్ఞాపకం అని కూడా అన్నారామె.



పల్లవీ జోషి

తియ్యని గాయం

'క్రికెట్ చూడ్డానికి ఎగ్జయిటింగ్‌గా ఉంటుంది కానీ ఆడేటప్పుడు తెలుస్తుంది ఎంత కష్టమో' అంటున్నారు జాన్వీ కపూర్. రాజ్‌కుమార్ రావ్, జాన్వీ కపూర్ క్రికెటర్లుగా కనిపించనున్న చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ మహీ'. ఈ సినిమాలోని పాత్ర కోసం టీమిండియా క్రికెటర్ దినేష్ కార్తీక్ వద్ద శిక్షణ తీసుకున్నారు జాన్వీ. ఇటీవల తన పాత్రకు సంబంధించిన షూట్‌ని పూర్తి చేశారీ బ్యూటీ. ఈ సందర్భంగా ఈ సినిమా తనకు ఎప్పటికీ మరచిపోలేని అనుభూతిని మిగిల్చిందని పేర్కొన్నారామె. ''ఈ సినిమా కోసం కెమెరా ముందు క్రికెట్ ఆడినప్పుడు రెండు సార్లు నా భుజానికి గాయం అయింది. ఎముక పొజిషన్ మారింది. అయినప్పటికీ తియ్యని గాయం అనుకుంటున్నాను. ఒంటరిగా కూర్చుని నేను చేసిన సినిమాల గురించి ఆలోచించుకున్నప్పుడు కచ్చితంగా 'మిస్టర్ అండ్ మిసెస్ మహీ' ముందు గుర్తొస్తుంది. ఇది నాకు అపురూపమైన సినిమా'' అన్నారు జాన్వీ. శరణ్ శర్మ దర్శకత్వం వహించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది.



సమంత షేర్ చేసిన ఫొటో

గాయంతోనే షూటింగ్

వివేక్ రంజన్ అగ్నిహోత్రి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ది వాక్సిన్ వార్'. ఈ చిత్రంలో కీలక పాత్ర చేస్తూ, ఓ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు పల్లవీ జోషి. ఆ మధ్య ఈ చిత్రం చివరి షెడ్యూల్ హైదరాబాద్ శివార్లలో వేసిన సెట్‌లో జరిగింది. ఓ సన్నివేశం చిత్రీకరిస్తుండగా వాహనం అదుపు తప్పడంతో పల్లవీ జోషికి స్వల్ప గాయాలయ్యాయి. అయినప్పటికీ ఆ సన్నివేశం పూర్తి చేశాకే ఆమె డాక్టర్ దగ్గరికి వెళ్లారు.

ఈ నాయికలే కాదు.. ఆ మధ్య టబు, శిల్పా శెట్టి వంటి తారలు కూడా షూటింగ్స్‌లో గాయపడ్డారు.



శోభిత
జాన్వీ కపూర్

ఆ రోజు కోసం ఎదురు చూస్తున్నా!

\- ఎస్వీ కృష్ణారెడ్డి



సోహైల్, అచ్చిరెడ్డి, ఎస్వీ కృష్ణారెడ్డి, సి. కల్యాణ్, వరుణ్

''ప్రేక్షకుల్ని నవ్వుల్లో ముంచెత్తటానికే 'ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు' తీశాం. తెరమీద పాత్రలు మిమ్మల్ని (ప్రేక్షకులు) నవ్విస్తుంటే.. మీరు నవ్వుతూ ఉంటే చూసే రోజు కోసం(3వ తేదీ) ఎదురు చూస్తున్నాను'' అని డైరెక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి అన్నారు. సోహైల్, మృణాళిని జంటగా రాజేంద్ర ప్రసాద్, మీనా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు'. కె. అచ్చిరెడ్డి సమర్పణలో కోనేరు కల్పన నిర్మించిన ఈ సినిమా ఈ నెల 3న విడుదల కానుంది. మంగళవారం నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ– ''మా మూవీ ట్రైలర్‌కి ఇక్కడున్న వారు కొట్టిన చప్పట్లతో సినిమా విజయంపై మరింత విశ్వాసం పెరిగింది. ఈ సినిమాకు అన్నీ చక్కగా కుదిరాయి'' అన్నారు. నిర్మాత సి. కల్యాణ్ మాట్లాడుతూ–''నా దృష్టిలో తరాలు మారొచ్చు కానీ సినిమా అనేది నిరంతరం సాగే ప్రపంచం. మనసున్న ప్రతి ఒక్కరి కళ్లు చెమర్చేలా సన్నివేశాలు తీశారు కృష్ణారెడ్డిగారు'' అన్నారు. ''ఇప్పటి ట్రెండ్‌ను ఫాలో అవుతూ ఈ సినిమా విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నారు కృష్ణారెడ్డిగారు'' అని కె. అచ్చిరెడ్డి అన్నారు. ''హీరోగా నిరూపించుకోవడానికి నాకు వచ్చిన మంచి అవకాశం 'ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు' చిత్రం అని గర్వంగా చెబుతున్నాను'' అన్నారు సోహైల్.

పల్లి.. పల్లి.. బెల్లంపల్లి...



ఉపేంద్ర, తాన్యా హోప్

''చంద్రు ఇదివరకే అద్భుతమైన చిత్రాలను డైరెక్ట్ చేశారు. ఈ చిత్రం కచ్చితంగా బ్లాక్ బస్టర్ అవుతుంది'' అన్నారు కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్. ఉపేంద్ర హీరోగా ఆర్. చంద్రు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కబ్జ'. పునీత్ రాజ్‌కుమార్ జయంతి సందర్భంగా ఈ నెల 17న తెలుగు, కన్నడ, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. ఈ చిత్రంలోని 'పల్లి.. పల్లి.. బెల్లంపల్లి..' అంటూ సాగే మూడో పాటను కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్ విడుదల చేశారు. ఉపేంద్ర, తాన్యా హోప్‌పై ఈ మాస్ సాంగ్‌ని చిత్రీకరించారు. రవి బస్రూర్ స్వరపరచిన ఈ పాటను తెలుగులో చంద్రబోస్ రాయగా హరిణి ఇవటూరి, సంతోష్ వెంకీ పాడారు. దర్శక-నిర్మాత ఆర్. చంద్రు హోమ్ టౌన్ షిడ్ల గట్ట (కర్నాటక)లో జరిగిన ఈ పాట విడుదల వేడుకలో కర్నాటక ఆరోగ్య శాఖ మంత్రి కె. సుధాకర్, మాజీ మంత్రి హెచ్.ఎం. రేవన్న, కో ప్రొడ్యూసర్ అలంకార్ పాండియన్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీ విష్ణు

ఓ వింత సమస్య

'ప్రేమించి పెళ్లి చేసుకునేవాళ్లకి క్యాస్ట్ ప్రాబ్లమ్ వస్తుంది లేకపోతే క్యాష్ ప్రాబ్లమ్ వస్తుంది.. ప్రపంచంలో ఎవరికీ రాని వింత ప్రాబ్లమ్ నాకు వచ్చిందేంట్రా' అని హీరో శ్రీవిష్ణు చెప్పే డైలాగ్‌లతో 'సామజవరగమన' గ్లింప్స్ రిలీజైంది. శ్రీవిష్ణు, రెబా మోనికా జాన్ జంటగా రామ్ అబ్బరాజు దర్శకత్వం వహించిన చిత్రం 'సామజవరగమన'. అనిల్ సుంకర సగర్వ సమర్పణలో రాజేష్ దండా నిర్మిస్తున్నారు. శ్రీవిష్ణు బర్త్‌డే (ఫిబ్రవరి 29) సందర్భంగా గ్లింప్స్‌ని రిలీజ్ చేశారు. ఈ వేసవిలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సహనిర్మాత: బాలాజీ గుత్తా, సంగీతం: గోపీ సుందర్, కెమెరా: రాంరెడ్డి.


మంగళవారం మొదలైంది



అజయ్ భూపతి

అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తూ, నిర్మిస్తున్న చిత్రం 'మంగళవారం'. స్వాతి గునుపాటి, సురేష్ వర్మ, అజయ్ భూపతి నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రూపొందుతున్న ఈ సినిమా టైటిల్‌ని వెల్లడించి, కాన్సెప్ట్ పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ''ఇండియాలో ఎవరూ ప్రయత్నించని కొత్త జానర్ చిత్రమిది. ఈ చిత్రంలో ఉన్న 30 పాత్రలకూ కథలో ప్రాధాన్యం ఉంటుంది'' అన్నారు అజయ్. ''మంగళవారం' పాన్ ఇండియా కాదు.. సౌత్ ఇండియన్ సినిమా'' అన్నారు స్వాతి, సురేష్ వర్మ. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సాయికుమార్ యాదవిల్లి, కెమెరా: దాశరథి శివేంద్ర, సంగీతం: బి. అజనీష్ లోక్‌నాథ్.

డప్పుకొట్టి చెప్పుకోనా...



శివ, రాశీ సింగ్

శివ కందుకూరి, రాశీ సింగ్ జంటగా పురుషోత్తం రాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'భూతద్దం భాస్కర్ నారాయణ'. స్నేహల్ జంగాల, శశిధర్ కాశి, కార్తీక్ ముడుంబై నిర్మించిన ఈ సినిమా ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం నుంచి 'డప్పుకొట్టి చెప్పుకోనా..' అనే పాటను చిత్రబృందం రిలీజ్ చేసింది. విజయ్ బుల్గానిన్ స్వరపరచిన ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించగా అనురాగ్ కులకర్ణి పాడారు. ''ఇందులో శివ డిటెక్టివ్‌గా కనిపిస్తారు'' అని చిత్రయూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల, విజయ్ బుల్గానిన్, కెమెరా: గౌతమ్ జి.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్



ఆకాశ్ పూరి, పండు

మాన్యం కృష్ణ, అర్చన జంటగా రూపొందిన చిత్రం 'మిస్టర్ కళ్యాణ్'. పండు దర్శకత్వంలో ఉషశ్రీ సమర్పణలో ఎన్వీ సుబ్బారెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదల కానుంది. ఈ చిత్రం విడుదల తేదీ పోస్టర్‌ని హీరో ఆకాశ్ పూరి విడుదల చేసి, ''సినిమా విజయం సాధించాలి'' అన్నారు. ''ఫ్యామిలీ, లవ్ అండ్ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రమిది. మహిళలకు కనెక్ట్ అయ్యే అంశాలు మా సినిమాలో ఉన్నాయి'' అని చిత్ర యూనిట్ తెలిపింది.

సాక్షి బిజినెస్
బుధవారం
1-3-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	326	58,962
నిఫ్టీ ▽	89	17,304

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	11,504	△	37
డోజోన్స్	32,750	▽	139
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,876	▽	59
డాక్స్	15,365	▽	16
షాంఘై	3,280	△	21
నికాయ్	27,423	△	22

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (24 క్యారట్)	55,123	▽	543
బంగారం (22 క్యారట్)	54,900	▽	543
వెండి (కిలో)	62,770	▽	676

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		81.95	83.62
£	బ్రిటన్ పౌండ్		98.16	101.46
€	యూరో		86.20	89.24
¥	జపాన్ ఎన్ (100)		59.83	61.75
AUS	ఆస్ట్రేలియా డాలర్		54.69	57.04
S$	సింగపూర్ డాలర్		60.45	62.42
SAR	సౌదీ రియాల్		21.05	22.72
UAE D	యూఏఈ దిర్హామ్		21.61	23.40
¥	చైనా యువాన్		10.79	12.87

హెచ్‌డీఎఫ్‌సీ, పీఎన్‌బీ, బీవోఐ రుణ రేట్ల పెంపు

నేటి నుంచే అమల్లోకి



న్యూఢిల్లీ: గృహ రుణాల ప్రముఖ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీతోపాటు, ప్రభుత్వరంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీవోఐ) రుణాల రేట్లను పెంచుతూ నిర్ణయాన్ని ప్రకటించాయి. సవరించిన రేట్లు మార్చి 1 నుంచి అమల్లోకి వస్తాయని తెలిపాయి. కనీస రిటైల్ ప్రైమ్ లెండింగ్ రేటును హెచ్‌డీఎఫ్‌సీ 0.25 శాతం పెంచి 9.20 శాతానికి చేర్చింది. అయితే, 760 కంటే మించి క్రెడిట్ స్కోర్ ఉన్న వారికి 8.70 శాతానికే గృహ రుణాన్ని ఆఫర్ చేస్తోంది. పీఎన్‌బీ మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ ఆధారిత లెండింగ్ రేటు (ఎంసీఎల్ఆర్)ను 0.10% పెంచింది. దీంతో పీఎన్‌బీ ఏడాది కాల ఎంసీఎల్ఆర్ రేటు 8.5%కి చేరింది. ఆటో, వ్యక్తిగత, గృహ రుణాలను ఈ రేటు ఆధారంగానే బ్యాంకు జారీ చేస్తుంటుంది. ఇక బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా ఎంసీఆర్ఎల్ రేటును 0.10% పెంచుతున్నట్టు ప్రకటించింది. ఆర్‌బీఐ ఎంపీసీ ఫిబ్రవరి సమీక్షలో రెపో రేటును 0.25 శాతం పెంచడం తెలిసిందే. ఇక గతేడాది మే నెల నుంచి చూసుకుంటే మొత్తం పెంపు 2.50 శాతంగా ఉంది.

మానసిక, శారీరక వైకల్యం ఉన్న వారికి బీమా

బీమా కంపెనీలకు ఐఆర్‌డీఏఐ ఆదేశం



న్యూఢిల్లీ: సాధారణ, స్టాండలోన్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలు వైకల్యం ఉన్న వారు, హెచ్ఐవీ బాధితులు, మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వారి కోసం ప్రత్యేకంగా బీమా ఉత్పత్తులను తీసుకు రావాలని బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) ఆదేశించింది. ఐఆర్‌డీఏఐ హెల్త్ ఇన్సూరెన్స్ మార్గదర్శకాలకు (2016) అనుగుణంగా ఈ ఉత్పత్తుల ప్రీమియం ధరలను నిర్ణయించాలని తన తాజా సర్క్యులర్‌లో పేర్కొంది. ఈ తరహా వ్యక్తులకు సంబంధించి పాలసీల క్లెయిమ్‌లు తిరస్కరించకుండా బోర్డు స్థాయిలో ఆమోదం పొందిన అండర్‌రైటింగ్ పాలసీని అందుబాటులోకి తీసుకురావాలని కూడా ఆదేశించింది. ఏడాది కాల వ్యవధితో బీమా ఉత్పత్తి ఉండాలని, దాన్ని ఏటా పునరుద్ధరించుకునే అవకాశం కల్పించాలని కోరింది.

తగ్గిన వృద్ధి వేగం

- డిసెంబర్ త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు 4.4 శాతానికి పరిమితం
- జూన్, సెప్టెంబర్ త్రైమాసికాల్లో ఈ రేట్లు 13.5 శాతం, 6.3 శాతం
- తయారీ పేలవ పనితీరు
- క్యూ3 ఎకానమీ విలువ రూ.40.19 లక్షల కోట్లుగా నమోదు



న్యూఢిల్లీ: భారత్ ఆర్థిక వ్యవస్థ వృద్ధి వేగం తగ్గుతోంది. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి పరిస్థితులతో పాటు దేశంలో కీలక తయారీ రంగం కుంటుపడటం ఎకానమీ మందగమనానికి కారణమవుతోంది. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) మంగళవారం విడుదల చేసిన అక్టోబర్-నవంబర్-డిసెంబర్ (3వ త్రైమాసికం) గణాంకాల ప్రకారం, స్థూల దేశీయోత్పత్తి వృద్ధి రేటు మూడవ త్రైమాసికంలో 4.4 శాతంగా నమోదయ్యింది. అంతక్రితం గడచిన రెండు త్రైమాసికాల్లో (జూన్, సెప్టెంబర్) జీడీపీ వృద్ధి రేట్లు వరుసగా 13.5 శాతం, 6.3 శాతాలుగా నమోదయ్యాయి. 2021 ఇదే కాలంలో భారత్ వృద్ధి రేటు 11.2%. ఈ లెక్కలు ఎకానమీ మందగమనాన్ని సూచిస్తున్నాయి.

2021–22 వృద్ధి రేటు 9.1 శాతానికి పెంపు

2021–22 వృద్ధి అంచనాలను ఎన్ఎస్ఓ తాజాగా క్రితం 8.7 శాతం నుంచి 9.1 శాతానికి ఎగువముఖంగా సవరించడం కొంత ఊరట కలిగించే అంశం. 2020–21లో జీడీపీ విలువ రూ.136.87 లక్షల కోట్లు. 2021–22లో ఈ విలువ రూ.149.26 లక్షల కోట్లకు చేరింది. వెరసి వృద్ధి రేటు 9.1 శాతంగా నమోదయ్యిందన్నమాట. కరోనా తీవ్ర సంక్షోభం నేపథ్యంలో 2020–21లో ఎకానమీలో అసలు వృద్ధి లేకపోగా 5.8% క్షీణతను నమోదుచేసుకుంది. ఇక తలసరి ఆదాయం 2020–21 నుంచి 2021–22కు రూ.1,27,065 నుంచి రూ.1,48,524కు పెరిగింది. పెట్టుబడులకు సంబంధించి గ్రాస్ క్యాపిటల్ ఫార్మేషన్ కరెంట్ ప్రైస్ ప్రకారం, ఇదే కాలంలో రూ.55.27 లక్షల కోట్ల నుంచి రూ.73.62 లక్షల కోట్లకు ఎగసింది. స్థూల పొదుపులు రూ.57.17 లక్షల కోట్ల నుంచి రూ.70.77 లక్షల కోట్లకు ఎగశాయి.

2022–23లో 7 శాతంగా అంచనా..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23) భారత్ వృద్ధి రేటు 7 శాతంగా ఉంటుందని ఎన్ఎస్ఓ రెండవ ముందస్తు అంచనాలు పేర్కొంటున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అంచనాలకన్నా (6.8 శాతం) ఇది 20 బేసిస్ పాయింట్లు అధికంకావడం గమనార్హం.

4.4 శాతం వృద్ధి ఎలా అంటే..

ద్రవ్యోల్బణం సర్దుబాటు చేసిన స్థిర (2011–12 బేస్ ఇయర్) ధరల వద్ద 2021–22 అక్టోబర్–డిసెంబర్ మధ్య జీడీపీ విలువ రూ.38.51 లక్షల కోట్లు. 2022–23 ఇదే కాలంలో ఈ విలువ రూ.40.19 లక్షల కోట్లుగా తొలి అంచనాలు వేయడం జరిగింది. అంటే వృద్ధి రేటు 4.4 శాతమన్నమాట. ఇక ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకోకుండా, ప్రస్తుత ధరల వద్ద జీడీపీ వృద్ధి రేటు 11.2% వృద్ధితో రూ.62.39 లక్షల కోట్ల నుంచి రూ.69.38 లక్షల కోట్లకు చేరింది.

2022-23పై అంచనాలు ఓకే



మార్చితో ముగిసే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 7 శాతం వృద్ధి రేటు నమోదవుతుందన్న అంచనాలు తగిన విధంగా, వాస్తవికతకు అద్దం పట్టేవిగా ఉన్నాయి. ఈ స్థాయి వృద్ధి సాధనకు భారత్ నాల్గవ త్రైమాసికంలో 5 నుంచి 4.1 శాతం వృద్ధి సాధించాల్సి ఉంటుంది. అయితే ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితులను తట్టుకోవడానికి భారత్ సిద్ధం కావాల్సి ఉంది.

– వీ అనంత నాగేశ్వరన్, చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్

కీలక రంగాల తీరిది...

- **తయారీ:** గ్రాస్ వ్యాల్యూ యాడెడ్ ప్రకారం (పరిశ్రమ లేదా ఆర్థిక వ్యవస్థలో ఒక రంగం వృద్ధి తీరు ఎలా ఉందన్న విషయాన్ని నిర్దిష్టంగా పరిశీలించడానికి దోహదపడే విధానం) 3వ త్రైమాసికంలో తయారీ రంగం ఉత్పత్తిలో అసలు వృద్ధి లేకపోగా 1.1 శాతం క్షీణించింది. 2021 ఇదే కాలంలో ఈ రంగం కనీసం 1.3 శాతం వృద్ధిని నమోదుచేసుకుంది.
- **వ్యవసాయం:** మొత్తం ఎకానమీలో దాదాపు 15 శాతం వాటా ఉన్న ఈ రంగంలో వృద్ధి రేటు 3.7 శాతంగా ఉంది. 2022 ఇదే కాలంలో ఈ రేటు 2.2 శాతం.
- **మైనింగ్ అండ్ క్వారియింగ్:** వృద్ధి రేటు 5.4 శాతం నుంచి 3.7 శాతానికి తగ్గింది.
- **నిర్మాణం:** నిర్మాణ రంగంలో వృద్ధి రేటు 0.2 శాతం నుంచి 8.4 శాతానికి చేరింది.
- **విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా, ఇతర యుటిలిటీ సేవలు:** వృద్ధి 6 శాతం నుంచి 8.2 శాతానికి ఎగసింది.
- **ట్రేడ్, హోటల్, రవాణా, కమ్యూనికేషన్, బ్రాడ్‌కాస్టింగ్ సేవలు:** వృద్ధి 9.2 నుంచి 9.7 శాతానికి చేరింది.

5జీతో విద్య, వైద్యంలో పెను మార్పులు

రిలయన్స్ జియో చైర్మన్ ఆకాశ్ అంబానీ



న్యూఢిల్లీ: అత్యంత వేగవంతమైన 5జీ సర్వీసులతో హెల్త్‌కేర్, విద్య, వ్యవసాయం, విపత్తు నిర్వహణ మొదలైన విభాగాల్లో భారీ మార్పులు రాగలవని టెలికం సంస్థ రిలయన్స్ జియో చైర్మన్ ఆకాశ్ అంబానీ తెలిపారు. వీటితో నగరాలు స్మార్ట్‌గా, సొసైటీలు సురక్షితమైనవిగా మారగలవని ఆయన పేర్కొన్నారు. బడ్జెట్ అనంతర వెబినార్‌లో పాల్గొన్న సందర్భంగా ఆకాశ్ అంబానీ ఈ విషయాలు చెప్పారు. ఆరోగ్యసంరక్షణ రంగంలో 5జీ వినియోగంతో అంబులెన్సులు డేటా, వీడియోను రియల్ టైమ్‌లో వైద్యులకు చేరవేయగలవని, రిమోట్ కన్సల్టేషన్‌లు, వేగవంతమైన రోగనిర్ధారణ విధానాలతో మారుమూల ప్రాంతాలకు కూడా నాణ్యమైన వైద్య సేవలను అందించడం సాధ్యపడుతుందని పేర్కొన్నారు. వ్యవసాయం విషయానికొస్తే వాతావరణం తీరుతెన్నులు, నేలలో తేమ స్థాయి, పంటల ఎదుగుదల మొదలైన వాటి గురించి డేటా ఎప్పటికప్పుడు పొందడం ద్వారా సరైన సాగు విధానాలు పాటించేందుకు వీలవుతుందని ఆకాశ్ చెప్పారు. అంతిమంగా సమాజంపై 5జీ, అనుబంధ టెక్నాలజీలు సానుకూల ప్రభావాలు చూపగలవని వివరించారు.

నాలుగు నెలల కనిష్టానికి సూచీలు

- ఎనిమిదో రోజూ అమ్మకాలే
- 59 వేల దిగువకు సెన్సెక్స్



ముంబై: దేశీయ ఈక్విటీ మార్కెట్‌లో అమ్మకాలు ఆగడం లేదు. ద్రవ్యోల్బణ భయాలతో స్టాక్ సూచీలు వరుసగా ఎనిమిదో ట్రేడింగ్ సెషన్‌లోనూ నష్టాలను చవిచూశాయి. విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు సెంటిమెంట్‌పై ఒత్తిడిని పెంచాయి. డిసెంబర్ క్వార్టర్ జీడీపీ డేటా వెల్లడి(మార్కెట్ ముగిసిన తర్వాత)కి ముందు అప్రమత్తత చోటుచేసుకుంది. అధిక వెయిటేజీ రిలయన్స్, ఇన్ఫోసిస్, ఐటీసీ షేర్లు 2% నుంచి 1.5% నష్టపోయి సూచీల పతనానికి ప్రధాన కారణమయ్యాయి. ఓ దశలో సెన్సెక్స్ 491 పాయింట్లు పతనమై 58,796 వద్ద, నిఫ్టీ 138 పాయింట్లు క్షీణించి 17,255 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకాయి. చివరి గంటలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో సెన్సెక్స్ 326 పాయింట్ల నష్టపోయి 58,962 వద్ద ముగిసింది. నిఫ్టీ 89 పాయింట్లు తగ్గి 17,304 వద్ద స్థిరపడింది. ఈ ముగింపు స్థాయిలు సూచీలకు 4 నెలల కనిష్టం కావడం గమనార్హం. ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్, ఫార్మా, ఎఫ్ఎంసీజీ షేర్లు నష్టపోయాయి. ఆటో, మీడియా, బ్యాంకింగ్, రియాల్టీ, వినిమయ రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఫలితంగా బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అరశాతం చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.4,559 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.4,610 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 21 పైసలు బలపడి 82.58 స్థాయి వద్ద స్థిరపడింది.

జనవరిలో మౌలిక రంగం ఊరట

4 నెలల గరిష్ట స్థాయిలో 7.8% నమోదు



న్యూఢిల్లీ: ఎనిమిది మౌలిక పారిశ్రామిక రంగాల గ్రూప్ జనవరిలో మంచి ఫలితా న్ని నమోదు చేసింది. ఈ గ్రూప్ వృద్ధి రేటు సమీక్షా నెల్లో 7.8 శాతంగా నమోదయ్యింది. 4 నెలల గరిష్ట స్థాయి ఇది. క్రూడ్ ఆయిల్ (1.1 శాతం క్షీణత) మినహా మిగిలిన ఏడు రంగాలూ వృద్ధి రేటును నమోదు చేసుకున్నాయి. వీటిలో బొగ్గు, సహజవాయువు, రిఫైనరీ ప్రొడక్టులు, ఎరువులు, స్టీల్, సిమెంట్, విద్యుత్ రంగాలు ఉన్నాయి. కాగా ఏప్రిల్–జనవరి మధ్య ఈ గ్రూప్ వృద్ధి రేటు 11.6 శాతంగా ఉంది. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీ(ఐఐపీ)లో ఈ ఎనిమిది రంగాల వెయిటేజ్ 49.27 శాతం.

ప్రపంచ ఆటో తయారీ హబ్‌గా భారత్

- లక్ష్యానికి అనుగుణంగా పలు చర్యలు
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి
- టాటా మోటార్స్ స్క్రాప్ ప్లాంటు షురూ



న్యూఢిల్లీ: భారత్‌ను ప్రపంచ ఆటో తయారీ కేంద్రం (హబ్)గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తాజాగా వెల్లడించారు. సమీప భవిష్యత్‌లో దేశీ ఆటో పరిశ్రమ విలువ రూ. 15 లక్షల కోట్లకు చేరే అంచనాలున్నట్లు తెలియజేశారు. జైపూర్‌లో ఆటో రంగ దిగ్గజం టాటా మోటార్స్ ఏర్పాటు చేసిన వాహనాలను తుక్కుగా మార్చే(స్క్రాపింగ్) ప్లాంటును వర్చువల్‌గా ప్రారంభించిన గడ్కరీ ప్రస్తుతం ఆటో పరిశ్రమ దేశ జీడీపీలో 7.1 శాతం వాటాను సమకూరుస్తున్నట్లు పేర్కొన్నారు. రూ. 7.8 లక్షల కోట్ల పరిమాణంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 4 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు తెలియజేశారు. 2025కల్లా ఈ సంఖ్య 5 కోట్లను తాకనున్నట్లు అభిప్రాయపడ్డారు. జైపూర్‌లో టాటా మోటార్స్ వార్షికంగా 15,000 వాహన స్క్రాపింగ్ సామర్థ్యంతో తొలిసారి రిజిస్టర్డ్ ప్లాంటును ఏర్పాటు చేసింది.

రూ. 15 లక్షల కోట్లకు..: గ్లోబల్ ఆటో తయారీ కేంద్రంగా భారత్‌ను నిలిపే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తున్నట్లు గడ్కరీ పేర్కొన్నారు. సమీప కాలంలో పరిశ్రమ పరిమాణాన్ని రూ. 15 లక్షల కోట్లకు చేర్చనున్నట్లు చెప్పారు. పాత, పనికిరాని వాహనాలను తొలగించడం ద్వారా స్క్రాపేజ్ పాలసీ దశలవారీగా పర్యావరణ అనుకూల కొత్త వాహనాలకు దారి చూపుతుందని వివరించారు. తుక్కుగా మార్చే తాజా విధానాల వల్ల వాహన డిమాండు ఊపందుకుంటుందని, రూ. 40,000 కోట్ల ఆదనపు జీఎస్‌టీ ఆదాయానికి వీలుంటుందని తెలిపారు.

జాబ్ పాయింట్

స్పోర్ట్స్ అథారిటీ, న్యూఢిల్లీలో 152 పోస్టులు

న్యూఢిల్లీలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా.. ఒప్పంద/డిప్యూటేషన్ ప్రాతిపదికన కోచ్, సీనియర్ కోచ్, చీఫ్ కోచ్, హైపెర్ఫార్మెన్స్ కోచ్ నియామకానికి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 152
» **పోస్టుల వివరాలు:** హై-పెర్ఫార్మెన్స్ కోచ్-25, చీఫ్ కోచ్-49, సీనియర్ కోచ్-34, కోచ్-44.
» **విభాగాలు:** ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, సైక్లింగ్, ఫెన్సింగ్, హాకీ, జూడో, రోయింగ్, షూటింగ్, స్విమ్మింగ్, టీ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, కయాకింగ్-కెనోయింగ్,ఖో-ఖో,తైక్వాండో, వాలీబాల్, వుషు.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా లేదా తత్సమానం లేదా ఒలింపిక్స్/ప్రపంచ ఛాంపియన్‌షిప్ విజేత లేదా పారాలింపిక్స్/ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం లేదా ద్రోణాచార్య అవార్డు గ్రహీత అయి ఉండాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 03.03.2023.
» **వెబ్‌సైట్:** sportsauthorityofindia.gov.in

ఇండియన్ ఆర్మీలో జేసీవో, హవల్దార్ పోస్టులు

ఇండియన్ ఆర్మీ.. జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్(జేసీవో), హవల్దార్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **పోస్టుల వివరాలు:** జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్(రిలీజియస్ టీచర్), హవల్దార్ (సర్వేయర్ ఆటోమేటెడ్ కార్టోగ్రాఫర్).
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 12 వతరగతి, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **వయసు:** 01.10.2023 నాటికి 25 నుంచి 34 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ కంప్యూటర్ రాతపరీక్ష, రిక్రూట్‌మెంట్ ర్యాలీ, ఇంటర్వ్యూ (ఆర్టీ జేసీవో పోస్టులకు మాత్రమే) ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.03.2023.
» **ఆన్‌లైన్ పరీక్ష తేదీలు:** 17.04.2023 నుంచి 04.05.2023 వరకు.
» **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in

'అగ్నివీర్'లకు ఆర్మీ స్వాగతం

» 2023-24 ఎంపిక ప్రక్రియలో మార్పులు
» ముందుగా ఆన్‌లైన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహణ
» ఎంట్రన్స్‌లో ప్రతిభ ఆధారంగా దేహ దారుఢ్య పరీక్షలు
» మార్చి 15 వరకు దరఖాస్తు అవకాశం
» ఏప్రిల్ 17 నుంచి రాత పరీక్షలు

గతేడాది కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన.. 'అగ్నిపథ్' పథకంలో భాగంగా.. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌ల్లో 'అగ్నివీర్' పేరిట నియామకాలు చేపడుతున్నారు. గతేడాది తొలిసారిగా అగ్నివీర్‌ల నియామకం జరిగింది! తాజాగా.. 2023-24 సంవత్సరానికి సంబంధించి.. ఆర్మీ విభాగంలో.. అగ్నివీర్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది! మరోవైపు నియామక ప్రక్రియలో కీలక మార్పులు ప్రకటించారు!! ఈ నేపథ్యంలో.. 'అగ్నివీర్' నియామక ప్రక్రియలో తాజా మార్పులు, రిక్రూట్‌మెంట్ విధానం, విధులు, ప్రయోజనాలు తదితర అంశాలపై విశ్లేషణ..

గత ఏడాది నుంచే అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా అగ్నివీర్ నియామకాలకు శ్రీకారం చుట్టారు. తాజాగా ఆర్మీ విభాగంలో.. 2023-24 సంవత్సరానికి దేశ వ్యాప్తంగా ఉన్న 72 ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్‌ల పరిధిలో.. అన్ని రాష్ట్రాల్లోనూ పదో తరగతి, ఇంటర్మీడియెట్, ఐటీఐ అర్హతలతో అగ్నివీర్ నియామక ప్రక్రియ ప్రారంభమైంది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి సికింద్రాబాద్, విశాఖపట్నం, గుంటూరు రిక్రూటింగ్ ఆఫీస్‌ల పరిధిలో అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

ఎంపిక ప్రక్రియలో మార్పులు

- అగ్నివీర్ నియామక విధానంలో ఈ ఏడాది కొన్ని కీలక మార్పులు చేశారు. ఈ క్రమంలో ఫేజ్-1,ఫేజ్-2లుగా ఎంపిక ప్రక్రియను పేర్కొన్నారు. ముందుగా ఫేజ్-1లో భాగంగా అభ్యర్థులు ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే కామన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.ఆ టెస్ట్‌లో సాధించిన మార్కులు, పోస్ట్‌ల సంఖ్యను అనుసరించి నిర్దిష్ట కటాఫ్‌ను పేర్కొని మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఆ జాబితాలో నిలిచిన వారికి తదుపరి దశ ఫేజ్-2లో.. ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్,ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్‌లను నిర్వహిస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా రిక్రూట్‌మెంట్ ర్యాలీలను నిర్వహిస్తారు. ఫేజ్-2 దశలోనూ ప్రతిభ చూపి..తుది విజేతలుగా నిలిస్తే అగ్నివీర్‌లుగా నియామకం ఖరారు చేస్తారు.
- వాస్తవానికి గత ఏడాది ముందుగా రిక్రూట్‌మెంట్ ర్యాలీ పేరుతో దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహించి.. అందులో ఉత్తీర్ణత సాధించిన వారికి తదుపరి దశలో రాత పరీక్ష నిర్వహించి నియామకాలు ఖరారు చేశారు.

ఈ పోస్ట్‌లకే నియామకాలు

అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా 2023-24 రిక్రూట్‌మెంట్ ర్యాలీలో.. అగ్నివీర్(జనరల్ డ్యూటీ-ఆల్ ఆర్మ్స్), అగ్నివీర్(టెక్నికల్-ఆర్మ్స్), అగ్నివీర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్(ఆల్ ఆర్మ్స్), అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్(ఆల్ ఆర్మ్స్), ట్రేడ్స్‌మెన్(ఆల్ ఆర్మ్స్- ఎనిమిదో తరగతి) పోస్ట్‌లను భర్తీ చేయనున్నారు.

అర్హతలు

- **అగ్నివీర్-జనరల్ డ్యూటీ:** 45 శాతం మార్కులతో పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలి. లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వారికి డ్రైవర్ పోస్ట్‌లలో ప్రాధాన్యం ఇస్తారు.
- **అగ్నివీర్-టెక్నికల్:** 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఎంపీసీ ఉత్తీర్ణత ఉండాలి(ఫిజిక్స్, మ్యాథ్స్, కెమిస్ట్రీ, ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లలో ప్రతి సబ్జెక్ట్‌లో 40 శాతం మార్కులు సాధించాలి)(లేదా) 50 శాతం మార్కులతో పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు.. మెకానిక్ మోటార్ వెహికిల్, మెకానిక్ డీజిల్, ఎలక్ట్రానిక్ మెకానిక్, టెక్నీషియన్ పవర్ ఎలక్ట్రానిక్ సిస్టమ్స్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఇన్‌స్ట్రుమెంటేషన్ మెకానిక్, డ్రాఫ్ట్స్‌మెన్, సర్వేయర్,జియో ఇన్ఫర్మాటిక్ అసిస్టెంట్, ఐసీటీ సిస్టమ్ మెయింటనెన్స్, మెకానిక్ కమ్ ఆపరేటర్ ఎలక్ట్రిక్ కమ్యూనికేషన్ సిస్టమ్, వెస్సెల్ నేవిగేటర్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్,కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ బ్రాంచ్‌లలో ఐటీఐ లేదా డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
- **అగ్నివీర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్:** 60 శాతం మార్కులతో ఆర్ట్స్/కామర్స్/సైన్స్ విభాగాల్లో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి(ప్రతి సబ్జెక్ట్‌లో 50 శాతం మార్కులు తప్పనిసరి).
- **అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్-టెన్త్ క్లాస్:** పదోతరగతిలో ప్రతి సబ్జెక్ట్ 33 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.
- **అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్-ఎనిమిదో తరగతి:** అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్ ఉద్యోగాల్లోనే కొన్నింటికి ఎనిమిదో తరగతిని అర్హతగా పేర్కొన్నారు. ఈ పోస్ట్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ప్రతి సబ్జెక్ట్‌లో 33% మార్కులతో ఎనిమిదో తరగతిలో ఉత్తీర్ణత సాధించాలి.
- పదో తరగతి లేదా ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలకు హాజరవనున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.



ఆర్మీ రిక్రూట్‌మెంట్

వయసు

- గత ఏడాది తొలిసారిగా నియామకాలు చేపట్టిన క్రమంలో వయో పరిమితిలో సడలింపు ఇచ్చి 17 1/2 నుంచి 23 ఏళ్ల మధ్య ఉన్న వారికి అవకాశం కల్పించారు. ఈ ఏడాది మాత్రం 17 1/2 ఏళ్ల నుంచి 21 ఏళ్ల లోపు ఉన్న వారినే అర్హులుగా పేర్కొన్నారు.

శారీరక ప్రమాణాలు

అగ్నివీర్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు విద్యార్హతలు, వయో పరిమితితోపాటు నిర్దేశిత శారీరక ప్రమాణాలు కూడా ఉండాలి. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, ట్రేడ్స్‌మెన్ అభ్యర్థులు 166 సెంటీమీటర్ల ఎత్తు, టెక్నికల్ అభ్యర్థులు 165 సెం.మీ. ఎత్తు, క్లర్క్/స్టోర్ కీపర్-టెక్నికల్ అభ్యర్థులు 162 సెం.మీ. ఎత్తు ఉండాలి. అదే విధంగా ఛాతి కొలత 77 సెం.మీ. ఉండాలి. శ్వాస పీల్చినప్పుడు 5 సెం.మీ. విస్తరించాలి.

ఫేజ్-1 ఆన్‌లైన్ సీఈఈ

- నియామక ప్రక్రియలో.. తొలి దశ(ఫేజ్-1)లో ఆన్‌లైన్ విధానంలో ఉమ్మడి ప్రవేశ పరీక్ష (కామన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్) నిర్వహిస్తారు. ఈ పరీక్ష.. ఆయా పోస్ట్‌లను అనుసరించి 50 మార్కులకు లేదా 100 మార్కులకు జరుగుతుంది.
- జనరల్ డ్యూటీ పోస్ట్‌ల అభ్యర్థులకు జనరల్ నాలెడ్జ్(15 ప్రశ్నలు), జనరల్ సైన్స్ (15 ప్రశ్నలు), మ్యాథమెటిక్స్(15 ప్రశ్నలు), లాజికల్ రీజనింగ్(5 ప్రశ్నలు) విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. మొత్తం మార్కులు 50.
- టెక్నికల్ పోస్ట్‌ల అభ్యర్థులకు ఇంగ్లిష్, సైన్స్, మ్యాథమెటిక్స్, జనరల్ అవేర్‌నెస్ విభాగాల నుంచి 25 ప్రశ్నలు చొప్పున అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 100 మార్కులకు పరీక్ష ఉంటుంది.

బోనస్ మార్కుల విధానం

ఆన్‌లైన్ ఎంట్రన్స్ ఎగ్జామ్‌కు కేటాయించిన మార్కులతోపాటు బోనస్ మార్కులు కేటాయించే విధానాన్ని కూడా అమలు చేస్తున్నారు. ఎక్స్‌సర్వీస్‌మెన్, స్పోర్ట్స్‌మెన్, ఎన్‌సీసీ, ఐటీఐ, డీఓఈఏసీఈ స్కీమ్‌ల అభ్యర్థులకు బోనస్ మార్కులు కేటాయిస్తారు. ఇలా టెక్నికల్ విభాగం వారికి గరిష్ఠంగా 50 మార్కులు, నాన్-టెక్నికల్ అభ్యర్థులకు గరిష్ఠంగా 25 మార్కులు బోనస్ మార్కులుగా కేటాయిస్తారు.

ఫేజ్-2.. ర్యాలీ

తొలిదశ(ఫేజ్-1)లో ఆన్‌లైన్ పరీక్షలో మెరిట్ జాబితాలో నిలిచిన వారికి రెండో దశ(ఫేజ్-2)లో రిక్రూట్‌మెంట్ ర్యాలీ పేరుతో.. నిర్దిష్ట ప్రాంతాల్లో ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్(ఎఫ్‌టీటీ), ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్ (ఎఫ్ఎంటీ)లను నిర్వహిస్తారు.

మెడికల్ ఎగ్జామినేషన్

ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్‌లలో విజేతలుగా నిలిచిన వారికి చివరగా మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. ఆర్మీ వైద్య బృందాల ఆధ్వర్యంలో జరిగే ఈ పరీక్షల్లోనూ విజయం సాధిస్తే.. అగ్నివీర్‌లుగా నియామకం ఖరారు చేస్తారు.

ఆరు నెలల శిక్షణ

- ఎంపిక ప్రక్రియలో అన్ని దశల్లోనూ విజయం సాధించి.. అగ్నివీర్‌లుగా ఎంపికైన వారికి తొలుత 6 నెలల పాటు శిక్షణనిస్తారు. ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకుంటే..అగ్నివీర్‌లుగా అభ్యర్థులు ఎంపికైన విభాగాల్లో నియమిస్తారు.
- అగ్నివీర్‌లుగా ఎంపికైన వారు శిక్షణ కాలంతో కలిపి నాలుగేళ్ల పాటు వారు ఎంపికైన విభాగాల్లో విధులు నిర్వహించే అవకాశం ఉంటుంది. సోల్జర్‌గా క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించొచ్చు. అంతేకాకుండా సర్వీస్ పూర్తయిన తర్వాత స్కిల్ సర్టిఫికెట్‌ను కూడా అందిస్తారు.

వేతనం

- అగ్నివీర్‌లుగా ఎంపికైన వారికి వేతనాలు కూడా ఆకర్షణీయంగానే ఉంటాయి. మొదటి ఏడాది రూ. 30వేలు, రెండో ఏడాది రూ.33 వేలు, మూడో ఏడాది రూ.36,500, నాలుగో ఏడాది రూ.40 వేలు చొప్పున నెల వేతనం లభిస్తుంది. ఈ వేతన మొత్తాల్లోంచి ప్రతి నెల 30% చొప్పున అగ్నివీర్ కార్పస్ ఫండ్‌కు జమ చేస్తారు. ఈ 30 శాతానికి సమానమైన మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం కూడా ఈ కార్పస్ ఫండ్‌కు జమ చేస్తుంది.
- అంటే.. నాలుగేళ్లు పూర్తయ్యే సరికి అభ్యర్థుల కార్పస్ ఫండ్‌లో రూ.10.04 లక్షలు జమ అవుతాయి. సర్వీస్ పూర్తి చేసుకుని విధులను విరమించే సమయంలో ఈ మొత్తాన్ని అగ్నివీర్‌లకు చెల్లిస్తారు. దీంతోపాటు.. రిస్క్ అండ్ హార్డ్‌షిప్ అలవెన్స్, డ్రెస్ అలవెన్స్, ట్రావెల్ అలవెన్స్‌లను కూడా చెల్లిస్తారు. నాన్-కంట్రిబ్యూటరీ జీవిత బీమా పేరుతో రూ.48 లక్షల మొత్తానికి జీవిత బీమా కల్పిస్తారు.

25 శాతం మందికి శాశ్వత ఉద్యోగం

అగ్నివీర్‌లుగా ఎంపికై నాలుగేళ్లు పాటు విధులు నిర్వహించిన వారిలో 25 శాతం మందికి శాశ్వత ఉద్యోగం కల్పించే విధానాన్ని కూడా అమలు చేస్తున్నారు. సర్వీస్ పూర్తి చేసుకునే సమయానికి ముందుగా అంతర్గత ఎంపిక ప్రక్రియ నిర్వహించి మొత్తం అభ్యర్థుల్లో 25 శాతం మందికి శాశ్వత కొలువు కల్పిస్తారు.

రాత పరీక్షలో విజయం ఇలా

- అగ్నివీర్ ఎంపిక ప్రక్రియలో తొలిదశ రాత పరీక్షలో విజయానికి అభ్యర్థులు పలు అంశాలపై దృష్టిపెట్టాలి.
- **ఇంగ్లిష్:** బేసిక్ గ్రామర్ నైపుణ్యాలు పరీక్షించే విభాగం ఇది. ఇందులో రాణించడానికి ప్రిపొజిషన్స్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, యాక్టివ్, ప్యాసివ్ వాయిస్, ప్యాసేజ్ కాంప్రహెన్షన్, డైరెక్ట్-ఇన్ డైరెక్ట్ స్పీచ్,వెర్బ్స్,టెన్సెస్,పంక్చుయేషన్స్, యాంటానిమ్స్, సినానిమ్స్‌లపై పట్టు సాధించాలి.
- **సైన్స్:** ఇంటర్మీడియెట్ స్థాయిలోని కైనమాటిక్స్, వర్క్, ఎనర్జీ, చలన నియమాలు, మెకానిక్స్, హీట్, థర్మోడైనమిక్స్, ఎలక్ట్రోస్టాటిస్టిక్స్, వేవ్స్, కరెంట్, ఎలక్ట్రిసిటీ, మ్యాగ్నటిజం, సెమీ కండక్టర్స్ వంటి అంశాలపై పట్టు సాధించాలి.
- **మ్యాథమెటిక్స్:** క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, కాంప్లెక్స్ నెంబర్స్, సమితులు, ప్రమేయాలు, ట్రిగ్నోమెట్రీ, స్ట్రెయిట్ లైన్స్, పెర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్, వెక్టార్స్, స్టాటిస్టిక్స్, 3-డి జామెట్రీ, డిఫరెన్షియేషన్స్, డెరివేటివ్స్, అల్జీబ్రా వంటి గణిత అంశాలపై సన్నద్ధత పొందాలి.
- **జనరల్ అవేర్‌నెస్:** అభ్యర్థులు కరెంట్ అఫైర్స్‌పై ఎక్కువ శ్రద్ధ చూపాలి. అదే విధంగా భారత దేశ చరిత్ర,భౌగోళిక అంశాలు,పోర్ట్‌లు, తీర ప్రాంతాలు, ముఖ్యమైన వ్యక్తులు, సదస్సులు, క్రీడలు-విజేతలు, రక్షణ రంగానికి సంబంధించి తాజా పరిణామాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

ముఖ్య తేదీలు

- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** ఫిబ్రవరి 16– మార్చి 15, 2023
- **ఆన్‌లైన్ పరీక్ష తేదీలు:** ఏప్రిల్ 17 నుంచి పలు స్లాట్లలో పరీక్షలు నిర్వహిస్తారు.
- **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in/latest-rally-agniveer-or.htm

నేటినుంచి ఆన్‌లైన్‌లో భద్రాద్రి రామన్న కల్యాణం టికెట్లు



భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఈనెల 30న సీతారాముల తిరుకల్యాణ మహోత్సవం, 31న స్వామివారి పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాలు జరగనున్నాయి. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం అధికారులు పలు సెక్టార్ల టికెట్లను బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో ఉంచనున్నారు. ఆసక్తి ఉన్న భక్తులు టికెట్లను వెబ్‌సైట్ www.bhadrachalamonline.com ద్వారా నేరుగా కొనుగోలు చేయొచ్చని ఈవో రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. రూ.7,500 విలువైన శ్రీ రామనవమి కల్యాణ ఉభయదాతల టికెట్లను దేవస్థాన కార్యాలయం, ఆలయ టికెట్ కౌంటర్ల వద్ద కూడా విక్రయిస్తామని పేర్కొన్నారు.

నక్క మొహం చూశాడు.. జైలుకెళ్లాడు!



తుమకూరు: కర్ణాటకలోని నాగవల్లికి చెందిన లక్ష్మీకాంత్‌కు మూఢనమ్మకాలు జాస్తి. ఆకస్మాత్తుగా ఎవరైనా శ్రీమంతులైతే.. నక్క తోక తొక్కాడని.. నక్క మొహం చూడటం వల్లే అలా జరిగిందనే అంటుంటారుగా.. అలాంటి వాటిని బాగా నమ్మాడు. దీంతో ఇంట్లో రెండు నక్క ఫొటోలను పెట్టుకున్నాడు. అయినా.. పెద్దగా అదృష్టం కలిసి రావడం లేదని అనుకున్నాడో ఏమో.. అడవికి వెళ్లి నిజంగానే నక్కను పట్టుకొచ్చాడు. తన కోళ్ల ఫారం బోనులో ఉంచాడు. రోజూ ఉదయం లేవగానే దాని మొహం చూసేవాడు. విషయం గ్రామస్తులకు తెలిసింది. అడవిలో ఉండాల్సిన నక్కను ఇలా పెంచుకోవడం నేరమంటూ పోలీసులు అరెస్టు చేశారు. నక్కను అటవీ శాఖ సిబ్బందికి అప్పగించారు.

యువతరం మారుతోంది



యువతరం ఆలోచన మారుతోంది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు, అవసరాలు వారి ఆలోచనలో మార్పు తెస్తుంటే.. అందుబాటులోకి వస్తున్న సరికొత్త ఉపాధి అవకాశాలు ఉత్సాహాన్నిస్తున్నాయి. హుందాగా పనిచేస్తూ కష్టాన్ని బట్టి సంపాదన పెంచుకునే అవకాశం వారిని ఆకర్షిస్తోంది. దీంతో చదువుకుంటూనే, పోటీ పరీక్షలకు సిద్ధమవుతూనే కుటుంబంపై ఆధారపడకుండా అవసరమైన ఖర్చుల కోసం ఆహారం, సరుకులు, వస్తువుల ఆన్‌లైన్ డెలివరీ బాయ్స్‌గా, బైక్ ట్యాక్సీ డ్రైవర్లుగా చేరిపోతున్నారు. వీరిలో ఎక్కువ మంది (80 శాతం) విద్యార్థులు కావడం ఆసక్తి కలిగించే అంశం.

- సాక్షి, హైదరాబాద్

చదువుతూ, పోటీ పరీక్షలకు సిద్ధమవుతూనే పార్ట్‌టైమ్ పనులు

కుటుంబానికి భారంగా ఉండకూడదనే ఆలోచన

ఆన్‌లైన్ డెలివరీ బాయ్స్‌గా లేదా బైక్ ట్యాక్సీ డ్రైవర్‌గా ఉపాధి

నగర బాట.. ఉపాధి వేట

మొత్తం మీద విద్య కోసమో, ఉద్యోగం కోసమో లక్షలాది మంది యువత హైదరాబాద్ మహా నగరానికి వలస వస్తోంది. వీరిలో ఎక్కువ శాతం పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వాళ్లే. మొన్నటి వరకు ఇంటి నుంచి పంపించే డబ్బులను జాగ్రత్తగా వాడుకుంటూ చదువుకోవడమో, మంచి ఉద్యోగం వెతుక్కోవడమో చేస్తూ వచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సరికొత్త ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రావడంతో ఇక తల్లిదండ్రుల డబ్బులపై ఆధారపడి ఉండాలని అనుకోవడం లేదు. తమ అవసరాలు తామే తీర్చుకోవడానికి పార్ట్ టైం ఉద్యోగాలను వెతుక్కుంటున్నారు. వేగంగా విస్తరిస్తున్న డెలివరీ రంగం వీరికి గొప్ప అవకాశంగా మారింది.

75 వేల మందికి పైనే..

మహానగరంలో 75 వేల మందికి పైగానే ఫుడ్, గ్రోసరీ డెలివరీ, బైక్ ట్యాక్సీ రంగంలో కొనసాగుతున్నట్లు ఆయా కంపెనీల అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. స్విగ్గీ, జొమాటో, ఉబర్ ఈట్స్, ఫుడ్‌పాండా, రాపిడో తదితర సంస్థలు తమ మార్కెట్‌ను విస్తరించుకోవడంలో భాగంగా యువతను రిక్రూట్ చేసుకుంటున్నాయి. ఇక అమెజాన్, మింత్ర, ఫ్లిప్‌కార్ట్, బిగ్‌బాస్కెట్, జెప్టో వంటి సంస్థలు కూడా తమ సరుకులు, వస్తువుల డెలివరీకి యువతను వినియోగిస్తున్నాయి.

పని చేయాలనే తపన ఉంటే సరి..

పార్ట్ టైం ఉద్యోగం చేయాలనే తపన, కాలం విలువ తెలిస్తే చాలు ఫుడ్ డెలివరీ బాయ్‌గా పని చేయొచ్చు. కనీస విద్యార్హతతో పాటు లైసెన్స్, ద్విచక్రవాహనానికి సంబంధించిన అన్ని[illegible] ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంక్ వివరాల ఒరిజినల్స్[illegible]సరిపోతుంది. కస్టమర్‌కు ఆర్డర్ సమయానికి ఎలా అందించాలి? వారితో ఎలా నడుచుకోవాలి? ఇన్సెంటివ్స్ కోసం ఎలాంటి వ్యూహాలు అనుసరించాలి? నగరంలో డ్రైవింగ్ ఎలా చేయాలి? తదితర వాటిపై సదరు కంపెనీలు శిక్షణ ఇస్తున్నాయి.



నగరంలో డెలివరీ బాయ్స్ ఇలా

ఫుడ్ డెలివరీ:	35,000
గ్రాసరీ డెలివరీ:	22,000
బైక్ ట్యాక్సీ:	18,000

బీకాం చేస్తూనే డెలివరీ...



బీకాం కంప్యూటర్ ఫైనల్ ఇయర్ చేస్తూ పార్ట్‌టైంగా ఫుడ్ డెలివరీ బోయ్‌గా పనిచేస్తున్నా. ప్రతిరోజు రూ.400 నుంచి రూ.500 వరకు సంపాదిస్తున్నా. కాలేజీ, ట్యూషన్ ఫీజులు, చేతి ఖర్చులకు సరిపోతున్నాయి. ఇంటి ఆర్థిక పరిస్థితి దృష్ట్యా తల్లిదండ్రులపై ఆధారపడకుండా సొంతంగా సమకూర్చుకుంటుండటంతో సంతృప్తిగా ఉంది. నా మిత్రులు చాలామంది ఇలా చదువుకుంటూనే పార్ట్‌టైంగా పని చేస్తూ సంపాదిస్తున్నారు.

– మొహియొద్దీన్, ఫుడ్ డెలివరీ బాయ్, మల్లాపూర్

ప్రభుత్వ ఉద్యోగం కోసం సిద్ధమవుతూనే

బీటెక్ పూర్తి కావడంతో అదనపు కోర్సుల కోసం నగరానికి వచ్చాను. కోచింగ్ ఇనిస్టిట్యూట్‌లో చేరా. ఏడాది పాటు ఇంటి నుంచి డబ్బులు పంపించారు. తర్వాత కుటుంబానికి భారంగా మారకూడదనే ఉద్దేశంతో ఫ్రెండ్ బైక్‌తో పార్ట్ టైం జాబ్‌లో చేరాను. ఆ డబ్బులతోనే ఇప్పుడు ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్నా.

– వెంకటేశ్వర్లు, నల్లగొండ

డిగ్నిటీ ఆఫ్ వర్క్..



సిటీలో ఫుడ్, గ్రాసరీ డెలివరీ, బైక్ ట్యాక్సీ డిగ్నిటీ ఆఫ్ వర్క్‌గా మారాయి. నిరుద్యోగులు, విద్యార్థులతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు సైతం పార్ట్‌టైం జాబ్ చేస్తూ సంపాదించుకుంటున్నారు. – **షేక్ సలావుద్దీన్, అధ్యక్షుడు, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్**

ఎండలు.. జర జాగ్రత్త



- పార్క్ చేసిన వాహనాల్లో పిల్లలను వదిలేయవద్దు
- ఎండాకాలంలో వాహనాల్లో వేడి ప్రమాదకరం
- మధ్యాహ్నం 12–3 గంటల మధ్య బయటకు రాకూడదు
- దాహం వేయకపోయినా వీలైనప్పుడల్లా నీరు తాగాలి
- ప్రజలకు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ సూచనలు

సాక్షి, హైదరాబాద్: తీవ్రమైన ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల సమయంలో ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ప్రత్యేకంగా సూచనలు చేసింది. దాహం వేయకపోయినా వీలైనప్పుడల్లా తగినంత నీరు తాగాలని పేర్కొంది. దాహం వేసేంతవరకు వేచిచూడడం మంచి సూచిక కాదని తెలిపింది. పార్క్ చేసిన వాహనాల్లో పిల్లలను లేదా పెంపుడు జంతువులను వదిలి వెళ్లవద్దనీ, వాహనం లోపల ఉష్ణోగ్రత ప్రమాదకరంగా మారవచ్చని హెచ్చరించింది.

- బయటకు వెళ్లేప్పుడు తాగునీటిని వెంట తీసుకెళ్లాలి. ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ (ఓఆర్ఎస్)ను వినియోగించాలి. నిమ్మరసం, మజ్జిగ, లస్సీ వంటి ఇంట్లో తయారుచేసిన పానీయాలు, ఉప్పు కలిపిన పండ్ల రసాలను తీసుకోవాలి. పుచ్చ, కర్బూజ, ఆరెంజ్, ద్రాక్ష, వంటి అధిక నీటి కంటెంట్ ఉన్న సీజనల్ పండ్లు, కూరగాయలను తినాలి. అలాగే పైనాపిల్, దోసకాయ, పాలకూర లేదా ఇతర స్థానికంగా లభించే పండ్లు, కూరగాయలు తినాలని సూచించింది. సన్నని వదులుగా ఉండే కాటన్ వస్త్రాలను ధరించడం మంచిది. గొడుగు, టోపీ, టవల్ వంటి ఇతర సాంప్రదాయ పద్ధతుల్లో తలను ఎండ వేడి నుంచి రక్షించుకోవాలి. ఎండలో బయటకు వెళ్లేటప్పుడు బూట్లు లేదా చెప్పులు తప్పనిసరిగా ధరించాలి.

ఇంకా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- బాగా వెంటిలేషన్ ఉన్న చల్లని ప్రదేశాల్లో ఉండాలి. ప్రత్యక్ష సూర్యకాంతి, వేడి గాలులను నిరోధించాలి. పగటిపూట కిటికీలు, కర్టెన్లను మూసి ఉంచాలి.
- ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బయటకు వెళ్లేలా ప్రణాళిక రూపొందించుకోవాలి.
- అనారోగ్యంతో ఉన్నవారు ఎండాకాలంలో ఇతరులకన్నా ఎక్కువ ప్రమాదంలో ఉంటారు. వీరు అదనపు శ్రద్ధ తీసుకోవాలి. మరీ ముఖ్యంగా శిశువులు, చిన్న పిల్లలు, గర్భిణీ స్త్రీలు, ఆరుబయట పనిచేసే వ్యక్తులు, మానసిక వ్యాధి ఉన్న వ్యక్తులు, శారీరకంగా అనారోగ్యంతో ఉన్న వ్యక్తులు, గుండె జబ్బులు లేదా అధిక రక్తపోటు ఉన్నవారు జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఒంటరిగా నివసించే వృద్ధులు లేదా అనారోగ్యంతో ఉన్న వారి ఆరోగ్యాన్ని ప్రతి రోజూ పర్యవేక్షించాలి.
- శరీరాన్ని చల్లబరచడానికి ఫ్యాన్, తడిబట్టలను ఉపయోగించాలి.
- మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల మధ్య బయటకు రావొద్దు. ఒకవేళ వచ్చినా ఎండలో శారీరకమైన కఠినమైన పనులు చేయకూడదు.
- తీవ్రమైన ఎండ సమయంలో వంట గదిలో వంట చేయకూడదు. ఒకవేళ చేయాల్సి వస్తే వంటిల్లు వెంటిలేషన్‌తో ఉండాలి. వెంటిలేట్ చేయడానికి తలుపులు, కిటికీలను తెరవాలి.
- ఆల్కహాల్, టీ, కాఫీ, శీతల పానీయాలు, పెద్ద మొత్తంలో చక్కెరతో కూడిన పానీయాలను తీసుకోకూడదు. ఇవి శరీర ద్రవాన్ని కోల్పోవడానికి లేదా కడుపు తిమ్మిరికి కారణం కావచ్చు.
- ఆరు బయట పనిచేసే కార్మికుల కోసం పని ప్రదేశంలో చల్లని తాగునీటిని అందుబాటులో ఉంచాలి. ప్రతి 20 నిమిషాలకు ఒక గ్లాసు నీరు తాగాలని వారికి చెప్పాలి.
- సాధారణ మానవ శరీర ఉష్ణోగ్రత 97.5ని ఫారిన్‌హీట్ నుండి 98.9ని ఫారిన్ హీట్ ఉండాలి.

జాతీయ అవార్డు అందుకున్న ఏబీకే



ఏబీకేకు అవార్డు అందించిన జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్

సాక్షి, న్యూఢిల్లీ: సీనియర్ పాత్రికేయులు డాక్టర్ అన్నే భవానీ కోటేశ్వర ప్రసాద్(ఏబీకే) ప్రతిష్టాత్మక రాజా రామ్ మోహన్ రాయ్ జాతీయ అవార్డును అందుకున్నారు. మంగళవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్‌పర్సన్ జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్ ఈ అవార్డును ఏబీకేకు అందించారు. 2020లో జర్నలిజంలో అత్యుత్తమ సేవలందించినందుకు గాను ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న వారంతా ఏబీకేను ప్రశంసించారు. 66 సంవత్సరాలకు పైగా వృత్తి జీవితంలో ఉన్న డాక్టర్ ఏబీకే ప్రసాద్ రాష్ట్రంలోని దాదాపు అన్ని ప్రధాన పత్రికలకు సంపాదకులుగా పనిచేశారు. అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో 2004 నుంచి 2009 వరకు అధికార భాషా సంఘం చైర్మన్‌గా కూడా పని చేసిన విషయం తెలిసిందే.



సాక్షి కార్టూనిస్టు శంకర్‌కు జర్నలిజంలో జాతీయ పురస్కారం

సాక్షి కార్టూనిస్టు పామర్తి శంకర్‌కు ఢిల్లీలో జరిగిన ఇదే కార్యక్రమంలో ఎక్సలెన్స్ ఇన్ జర్నలిజంలో జాతీయ అవార్డును ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్ పర్సన్ జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్ అందించారు. కార్టూన్లు, క్యారికేచర్లు, బెస్ట్ న్యూస్ పేపర్ ఆర్ట్ కేటగిరీల్లో ఆయనకు ఈ అవార్డు బహూకరించారు.

ఎస్‌బీఐ యోనో పేరిట మోసాలు

- అప్‌డేట్ చేయాలని సైబర్ నేరగాళ్ల సందేశాలు
- అలాంటివి నమ్మవద్దని పోలీసుల హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్ : బ్యాంకు ఖాతాలు కొల్లగొట్టేందుకు సైబర్ నేరగాళ్లు సంక్షిప్త సందేశాలు పంపి మోసాలకు పాల్పడుతున్నట్టు తెలంగాణ సైబర్ క్రైం కో–ఆర్డినేషన్ సెంటర్ అధికారులు హెచ్చరించారు. ఎస్‌బీఐ వినియోగదారులకు ఎస్‌బీఐ ఆన్‌లైన్ యాప్ యోనో పేరిట ఈ సందేశాలు పంపుతున్నట్టు వారు పేర్కొన్నారు. 'మీ వివరాలు, పాన్‌కార్డు నంబర్ అప్‌డేట్ చేయకపోతే యోనో బ్యాంకు ఖాతా బ్లాక్ అవుతుంది'.. అంటూ నకిలీ సందేశాలు పంపుతున్నారని తెలిపారు. వ్యక్తిగత ఫోన్ నంబర్ల నుంచి వచ్చే ఈ తరహా సందేశాలను నమ్మి మోసపోవద్దని వారు హెచ్చరించారు. బ్యాంకుల నుంచి వచ్చే సందేశాలలో ఎలాంటి యూఆర్‌ఎల్ లింక్‌లు ఉండవని వివరించారు. ఒకవేళ వినియోగదారులకు ఫోన్ నంబర్ల ద్వారా వచ్చే సందేశాల్లో లింక్‌లు ఉండి.. వాటిపై క్లిక్ చేయాలని సూచిస్తే అది కచ్చితంగా సైబర్ నేరగాళ్ల పనిగా గుర్తించాలని స్పష్టం చేశారు. అలాంటి వాటికి స్పందించవద్దని వారు సూచించారు.

ఐఐటీహెచ్‌లో డార్క్ స్కై అబ్జర్వేటరీ



ప్రారంభించిన ఇస్రో మాజీ చైర్మన్ రాధాకృష్ణన్..

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఖగోళశాస్త్రంలో ఉన్నత స్థాయి పరిశోధనలకు ఉపయోగపడే అడ్వాన్స్‌డ్ డార్క్ స్కై అబ్జర్వేటరీని హైదరాబాద్ ఐఐటీలో ఏర్పాటు చేశారు. నేషనల్ సైన్స్ డే మంగళవారం ఐఐటీలో నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఇస్రో మాజీ చైర్మన్, పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ కె.రాధాకృష్ణన్ ఈ అబ్జర్వేటరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖగోళ శాస్త్ర పరిశోధనలకు ఈ అబ్జర్వేటరీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్.మూర్తి, ఫిజిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం పహారి, విద్యార్థులు పాల్గొన్నారు.

హైడ్రోజన్‌తో స్వావలంబన దిశగా..

విస్తృత స్థాయిలో పరిశోధనలు	సౌర, పవన విద్యుత్‌లతో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి ప్రయత్నాలు	ఎన్టీపీసీ జనరల్ మేనేజర్ డీఎంఆర్ పాండా వెల్లడి	ఐఐసీటీలో ఘనంగా నేషనల్ సైన్స్ డే ఉత్సవాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ సమీర్ దవే, డీఎంఆర్ పాండా, శ్రీనివాసరెడ్డి, నెట్టెం చౌదరి

సాక్షి, హైదరాబాద్: ఇంధన రంగంలో మన దేశం స్వావలంబన సాధించేందుకు హైడ్రోజన్ ఉపయోగపడుతుందని, ఈ దిశగా పరిశోధనలూ వేగంగా సాగుతున్నాయని నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) హైడ్రోజన్ విభాగం జనరల్ మేనేజర్ డీఎంఆర్ పాండా వెల్లడించారు. జాతీయ సైన్స్ దినోత్సవాల్లో భాగంగా మంగళవారం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో డీఎంఆర్ పాండా 'గ్రీన్ హైడ్రోజన్ ఎమర్జింగ్ ట్రెండ్స్'' అన్న అంశంపై కీలకోపన్యాసం చేశారు. ఎన్టీపీసీ ఆధ్వర్యంలో పర్యావరణ అనుకూలమైన విధానాల్లో హైడ్రోజన్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయని తెలిపారు. ఇందులో భాగంగా లేహ్, ఢిల్లీల్లో హైడ్రోజన్ బస్సులు ఇప్పటికే నడుస్తుండగా, సౌర విద్యుత్ సాయంతో హైడ్రోజన్ ఉత్పత్తి, నిల్వలకు కూడా పైలెట్ ప్రాజెక్టులు నిర్వహిస్తున్నామని చెప్పారు.

గత పదేళ్లలో హైడ్రోజన్ ధర పదిరెట్లు తగ్గింది..

దేశంలో సౌర, పవన విద్యుదుత్పత్తులకు అపార అవకాశాలున్నాయని, ఇలా ఉత్పత్తి అయిన విద్యుత్‌తో వేర్వేరు పద్ధతులను ఉపయోగించుకుని హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా దేశం పెట్రో ఉత్పత్తుల దిగుమతులపై ఆధారపడాల్సిన అవసరం తప్పుతుందని పాండా వివరించారు. అలాగే కర్బన ఉద్గారాల తగ్గింపూ సాధ్యమవుతుందన్నారు. ప్రస్తుతం హైడ్రోజన్ ఉత్పత్తి ఖర్చులు ఎక్కువైనప్పటికీ, ఐఐసీటీ, ఇతర విద్యా, పరిశోధన సంస్థల సహకారంతో దాన్ని తగ్గించి విస్తృత వినియోగంలోకి తేవచ్చునని ఆశాభావం వ్యక్తం చేశారు. గత పదేళ్లలో హైడ్రోజన్ ధర పదిరెట్లు తగ్గిందని గుర్తు చేశారు. ఎలక్ట్రలైజర్లు, ఒత్తిడిని తట్టుకోగల సిలిండర్లు, హైడ్రోజన్‌ను చిన్న చిన్న సిలిండర్లలోకి పంపేందుకు అవసరమైన కంప్రెషర్ల విషయంలో దేశం ఇప్పటికీ విదేశాలపైనే ఆధారపడుతోందని, ఫలితంగా ఈ ఇంధనాన్ని అందరికీ అందుబాటులోకి తేవడంలో ఆలస్యం జరుగుతోందని చెప్పారు. ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస రెడ్డి, డాక్టర్ సమీర్ దవే, డాక్టర్ నెట్టెం వి.చౌదరి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు ఎన్టీపీసీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గురుదీప్ సింగ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ దేశంలో హైడ్రోజన్ ఉత్పత్తి, వినియోగంపై జరుగుతున్న ప్రయత్నాలను క్లుప్తంగా వివరించారు.

ఆంధ్రప్రదేశ్‌లో హైడ్రోజన్ హబ్

దేశంలో హైడ్రోజన్ ఉత్పత్తి, వినియోగాలను పెంచే కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో హైడ్రోజన్ హబ్ ఒకదాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఎన్టీపీసీ జనరల్ మేనేజర్ (హైడ్రోజన్ విభాగం) డీఎంఆర్ పాండా తెలిపారు. విశాఖపట్నంలోని ఎన్టీపీసీ కేంద్రానికి దగ్గరగా ఈ హబ్ ఏర్పాటు కానుందని ఆయన విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. మొత్తం 1200 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటయ్యే హైడ్రోజన్ హబ్‌లో హైడ్రోజన్ ఉత్పత్తితోపాటు దానికి సంబంధించిన టెక్నాలజీలు, రవాణా వ్యవస్థలపై విస్తృతమైన పరిశోధనలు జరగనున్నాయని, సౌర శక్తి కోసం పెద్ద ఎత్తున సోలార్ ప్యానెల్స్ కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ హబ్ ఏర్పాటుకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని, అన్నీ సవ్యంగా సాగితే ఇంకో వారం రోజుల్లో ఎన్టీపీసీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల మధ్య దీనిపై ఒక అవగాహన ఒప్పందం కూడా జరగనుందని వివరించారు. రానున్న పదేళ్లలో ఈ హబ్ ఏర్పాటుకు కొన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయనున్నట్లు పాండా తెలిపారు.

'వన్ వీక్.. వన్ ల్యాబ్' ఈ నెల ఏడు నుంచి!

కౌన్సిల్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) పరిశోధనశాలల కార్యకలాపాలను ప్రజలకు వివరించేందుకు ఉద్దేశించిన 'వన్ వీక్.. వన్ ల్యాబ్'కార్యక్రమం ఈ నెల ఏడవ తేదీ నుంచి ప్రారంభం కానుందని ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఆరు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా ఐఐసీటీలో జరుగుతున్న పరిశోధనలు, అభివృద్ధి చేసిన ఉత్పత్తులను ప్రదర్శించనున్నామని చెప్పారు. పరిశోధకులు, ఉపాధ్యాయులు, పారిశ్రామికవేత్తలు, టెక్నాలజిస్టులు, స్టార్టప్‌లు, సాధారణ ప్రజలు ఎవరైనా ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చునని సూచించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.